ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం 25.09.2025 | సంపుటి :12 సంచిక : 67 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



ఆర్టీసీలో మరింత వేగంగా సేవలకు

## ఏఐ



సాంకేతికత అమలు కోసం ప్రత్యేక టీమ్ ఏర్పాటు : మంత్రి పొన్నం

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తమ సేవలను మెరుగు పరుచు కునేందుకు ఆర్‌టిసి మరో గొప్ప అడుగు వేసింది. అన్ని రంగాలను ప్రభావితం చేస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ను విస్తృతంగా వినియోగించాలని నిర్ణయించింది. తమ ఉత్పాదకత పెంపు, సిబ్బంది పనితీరు, ఆరోగ్య స్థితి పర్యవేక్షణ, ఖర్చుల తగ్గింపు, రద్దీకి అనుగుణంగా సర్వీసుల ఏర్పాటుతో పాటు- సేవలను మరింత ప్రజానుకూలంగా తీర్చిదిద్దడమే ఈ నిర్ణయానికి ప్రధాన ఉద్దేశం. దేశంలోనే తొలిసారిగా ఎఐ వినియోగించిన ప్రజా రవాణా సంస్థగా తెలంగాణ ఆర్‌టిసి నిలిచింది. ఎఐ ప్రాజె క్టు అమలుకు హన్స ఈక్విటీ- పార్ట్‌నర్స్ ఎల్‌ఎల్‌పి అనే సంస్థ ఆర్‌టిసికి తోడ్పాటు- అందిస్తోంది. సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యం, ప్రణాళికాబద్ధమైన అమలు వ్యూహాలను అందించి, అన్ని డిపోల్లో సులభంగా అమలు జరిగేలా ఆ సంస్థ యోచిస్తోంది

12లో..

పహల్గాం దాడి కేసు..

ఉగ్రవాదులకు సహకరించిన

## వ్యక్తి అరెస్టు

9లో..

# గ్రూప్-1 రద్దు ఆదేశాలపై స్టే

సింగిల్ బెంచ్ ఉత్తర్వులను రద్దు చేసిన హైకోర్టు డివిజన్ బెంచ్

- మార్కుల జాబితా, ర్యాంకింగ్ లిస్ట్ రద్దు, పునఃమూల్యాంకనంపై టీజీపీఎస్సీకి ఊరట
- నియామకాలు చేపట్టుకోవచ్చన్న ధర్మాసనం
- తదుపరి విచారణ అక్టోబర్ 16కు వాయిదా



హైదరాబాద్(జనంసాక్షి): గ్రూప్-1 పరీక్షలను రద్దు చేయాలని సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పుపై హైకోర్టు స్టే విధించింది. ఈ అంశంలో టీజీపీఎస్సీకి హైకోర్టులో ఊరట లభించింది. సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పుపై హైకోర్టు డివిజన్ బెంచ్ స్టే విధించింది. గ్రూప్-1 నియామకాలు చేపట్టుకోవచ్చని స్పష్టం చేసింది. అనంతరం తదుపరి విచారణను వచ్చేనెల 16కి వాయిదా వేసింది. గ్రూప్-1 తుది మార్కుల జాబితా, జనరల్ ర్యాంకింగ్స్‌ను రద్దు చేస్తూ ఇటీవల సింగిల్ బెంచ్ తీర్పు వెలువరించింది. మెయిన్స్ జవాబు పత్రాలను 8 నెలల్లో పునఃమూల్యాంకనం చేయించాలని.. లేదంటే పరీక్షలను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని ఆదేశించింది. సింగిల్ బెంచ్ తీర్పుపై టీజీపీఎస్సీ డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేసింది. దీనిపై హైకోర్టులో బుధవారం విచారణ జరిగింది. పిటిషన్ విచారణ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏజీ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. తుది మార్కుల జాబితా, జనరల్ ర్యాంకింగ్ లిస్ట్‌ను సింగిల్ బెంచ్ రద్దు చేసింది. మెయిన్స్ పత్రాలను పునఃమూల్యాంకనం చేయాలని ఆదేశించింది. 8 నెలల్లోపు చేయకపోతే మెయిన్స్ పరీక్షలు మళ్లీ నిర్వహించాలని స్పష్టం చేసింది. 2011లో గ్రూప్-1 నిర్వహించారు. ఆ తర్వాత 2022లో నిర్వహిస్తే సుప్రీంకోర్టు రద్దు చేసింది. 14 ఏళ్ల తర్వాత గ్రూప్-1 నియామకాలు జరుగుతున్నాయి. ఈ సమయంలో ప్రక్రియను సింగిల్ బెంచ్ రద్దు చేసింది. తెలుగులో మెయిన్స్ జవాబులు రాసిన వారిపట్ల పక్షపాతం చూపించారనడానికి ఎలాంటి ఆధారాలు లేవని కోర్టుకు ఏజీ తెలిపారు. దీనిపై సీజే జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్ స్పందిస్తూ మాల్ ప్రాక్టీస్, పేపర్ లీక్‌లాంటి ఘటనలు ఏమైనా

మిగతా 2లో..

బీజేపీ, బీఆర్‌ఎస్‌లకు

## చెంపపెట్టు

హైకోర్టు తీర్పు విమర్శకులకు కనువిప్పుకావాలి:కాంగ్రెస్

హైదరాబాద్(జనంసాక్షి): గ్రూప్ -1 మెయిన్స్ పరీక్షలపై తెలంగాణ హైకోర్టు డివిజన్ బెంచ్ బుధవారం ఇచ్చిన తీర్పు విమర్శకులకు కనువిప్పుకావాలని

మిగతా 2లో..

# మున్నేరు ముంపునకు ముగింపు

శరవేగంగా రిటైనింగ్ వాల్ నిర్మాణం



రూ 525.36 కోట్ల వ్యయంతో పనులు

ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్న మంత్రి పొంగులేటి

వరదల నుంచి తప్పనున్న తిప్పలు

ఖమ్మం(జనంసాక్షి): ఖమ్మం నగర ప్రజల వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారానికి రూ 525.36 కోట్ల వ్యయంతో మున్నేరుకి రిటైనింగ్ వాల్ నిర్మాణాన్ని ప్రజా ప్రభుత్వం చేపట్టింది. తెలంగాణలో విద్య, వైద్యం, వ్యవసాయ మార్కెటింగ్, వర్తక, వ్యాపార రంగాలలో వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో ఖమ్మం అగ్రగామిగా నిలుస్తుంది. అయితే ఖమ్మం నగరం మధ్య నుండి ప్రవహిస్తున్న మున్నేరు వాగు ప్రతి ఏటా వర్షాకాలంలో ఉధృతంగా పొంగి, పరిసర ప్రాంతాల ఇండ్లు, వర్తక , వ్యాపార సంస్థలు, పంటలు వరద ముంపునకు గురవుతున్నాయి. మారిన వాతావరణ మార్పుల ప్రభావం వల్ల వస్తున్న ఆకస్మిక వర్షాలు, క్లౌడ్ బస్ట్ లతో ప్రభుత్వ మౌళిక వసతులకు కూడా తీవ్ర నష్టం జరుగుతున్నది. పనులకు వెళ్ళిన వారు, ఇంటికి వచ్చి సామాన్లు, నిత్యావసరాలు సర్దుకునే వెసులుబాటు- లభించదు.

మిగతా 2లో..

42% బీసీ రిజర్వేషన్ చట్టవిరుద్ధమంటూ దాఖలైన పిటిషన్

## కొట్టివేత



- ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోకుండానే పత్రిక కథనాల ఆధారంగా పిటీషన్‌లు ఎలా వేస్తారు?
- హైకోర్టు ఆగ్రహం

హైదరాబాద్(జనంసాక్షి): బీసీ రిజర్వేషన్లపై దాఖలైన పిటిషన్లను తెలంగాణ హైకోర్టు కొట్టి వేసింది. 42 శాతం రిజర్వేషన్లు బీసీలకు కేటాయిస్తూ ప్రభుత్వం తెస్తున్న జీవోపై

మిగతా 2లో..

ఓట్ల చోరీపై మరిన్ని సంచలనాలు

# బయటపెడతాం

బీహార్ ఎన్నికలతో మోడీ పాలనకు ముగింపు • నితీశ్ కుమార్‌ను భారంగా భావిస్తున్న బిజెపీ - ఎన్‌డీఏలో తారాస్థాయికి అంతర్గత కలహాలు • కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో ఖర్గే



పాట్నా(జనంసాక్షి): బిహార్ అసెంబ్లీ ఎన్నికలు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అవినీతి పాలన ముగింపునకు నాంది పలుకుతాయని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. బిహార్ ప్రజలు బీజేపీ రెలిజియస్ పోలరైజేషన్‌పై ఏమాత్రం ఆసక్తిగా లేరని, అభివృద్ధి, సంక్షేమంతో కూడిన రాజకీయాలను కోరుకుంటున్నారని చెప్పారు. బిహార్‌లోని ఎన్డీయేలో అంతర్గత కలహాలు చాలా స్పష్టంగా కనిపిస్తున్నా యని, ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌ను ఒక భారంగా బీజేపీ భావిస్తోందని అన్నారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల వ్యూహాన్ని ఖరారు చేసేందుకు, ఓట్ చోరీ అంశంపై బీజేపీని మరింత ఇరకాటంలో పెట్టే విషయమై చర్చించేందుకు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం బిహార్ రాజధాని పాట్నాలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయమైన సదాకత్ ఆశ్రమంలో బుధవారం నిర్వహించారు. ఖర్గే అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ నేత రాహుల్ గాంధీ, కోశాధికారి అజయ్ మాకెన్, ప్రధాన కార్యదర్శులు కేసీ వేణుగోపాల్, సచిన్ పైలట్, బిహార్ కాంగ్రెస్ చీఫ్ రాజేష్

మిగతా 2లో..



71మంది మావోయిస్టుల

## లొంగుబాటు

2లో..




# లద్దాఖ్‌లో జెన్‌జీ ఉద్యమం

రాష్ట్ర హోదా ఇవ్వాలంటూ భగ్గుమన్న లద్దాఖ్

బీజేపీ కార్యాలయానికి, పోలీసు వాహనాలకు నిప్పు

ఉద్రిక్తంగా మారిన ఆందోళన • నిరసన కార్యక్రమాలు హింసాత్మకం

పోలీస్ కాల్పుల్లో నలుగురు మృతి • మరో 30 మందికి గాయాలు



శ్రీనగర్(జనంసాక్షి): లద్దాఖ్‌కు రాష్ట్ర హోదా కల్పించాలని డిమాండ్ చేస్తూ లేహ్ నగరంలో చేపట్టిన నిరసన కార్యక్రమాలు హింసాత్మకంగా మారాయి. ఆందోళనకారులు, భద్రతా దళాలకు మధ్య జరిగిన ఘర్షణల్లో నలుగురు మృతి చెందారు. మరో 30 మందికి గాయాలైనట్లు అధికారులు వెల్లడించారు. అయితే, పోలీసులు జరిపిన కాల్పుల్లోనే నలుగురు యువకులు మృతిచెందారని, గాయపడిన వారి సంఖ్య ఎక్కువ ఉందని ఆందోళనకారులు ఆరోపించారు. లద్దాఖ్‌కు రాష్ట్ర హోదాతో పాటు- ఆరో షెడ్యూల్ పొడిగింపు డిమాండ్ చేస్తూ స్థానికంగా కొంతకాలంగా స్థానికంగా నిరసనలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో సెప్టెంబర్ 10 నుంచి ఓ పదిహేను మంది ఆమరణ దీక్షకు దిగారు. ఇందులో ఇద్దరి పరిస్థితి విషమంగా మారడంతో సెప్టెంబర్ 23 సాయంత్రం వారిని ఆసుపత్రికి తరలించారు. ఈ నేపథ్యంలో లద్దాఖ్ అపెక్స్ బాడీ యువజన విభాగం తాజా నిరసనలకు పిలుపునిచ్చింది. ఈ క్రమంలోనే లేహ్ నగరంలో అనేక మంది వీధుల్లోకి వచ్చి ఆందోళన చేపట్టారు. వీరిని చెదరగొట్టేందుకు వచ్చిన

మిగతా 2లో..



తమ ఎమ్మెల్యే అభ్యర్థి ఓడినా

# కేసీఆరే మళ్లీ సీఎం అవుతాడనుకున్నారు

- ప్రతీ నియోజకవర్గంలో ఇలా జరగడం వల్లే ఆయన ముఖ్యమంత్రి కాలేకపోయారు : కేటీఆర్
- గిగ్ వర్కర్ల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని వెల్లడి



హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అధికారం చేజిక్కించుకోకపోవడంపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల సమయంలో తెలంగాణ ప్రజలంతా స్థానికంగా ఉన్న తమ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఓడిపోయినా.. కేసీఆర్ మాత్రం మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని అనుకున్నారని తెలిపారు. అయితే, అందరూ అలాగే అనుకోవడంతో కేసీఆర్ సీఎం కాలేకపోయారని కేటీఆర్ చెప్పుకొచ్చారు. బంగారుపల్లెంలో పెట్టి ఇచ్చిన

మిగతా 2లో..

మెడికల్ సీట్ల పెంపునకు

# కేంద్రం ఆమోదం

దేశవ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 5023 ఎంబీబీఎస్ సీట్ల పెంపు

ఎన్నికల రాష్ట్రం బీహార్‌పై కేంద్రం వరాల జల్లు

రూ.6వేల కోట్ల విలువైన రైల్వే, రహదారి అభివృద్ధి ప్రాజెక్టులు

కేంద్ర కేబినేట్ కీలక నిర్ణయాలు

సమావేశంలో పలు కీలక ప్రాజెక్టులకు ఆమోదం




న్యూఢిల్లీ(జనంసాక్షి): అసెంబ్లీ ఎన్నికల వేళ బిహార్‌పై కేంద్ర ప్రభుత్వం వరాల జల్లు కురిపించింది. రాష్ట్రంలో సుమారు రూ.6వేల కోట్ల విలువైన రైల్వే, రహదారి అభివృద్ధి ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. దీంతో పాటు దేశవ్యాప్తంగా వైద్యవిద్య సీట్ల పెంపునకు కేంద్రం ఆమోద ముద్ర వేసింది. ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ- సమావేశంలో తీసుకున్న కీలక నిర్ణయాలకు సంబంధించిన వివరాలను కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. బిహార్‌లో రైల్వేకు సంబంధించి రూ.2192 కోట్లతో భక్తియార్‌పుర్-రాజ్‌గిర్-తిలయ్యా డబ్లింగ్ పనులకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇక సాహెబ్‌గంజ్-అరెరాజ్-బెతియా మధ్య రూ.3822 కోట్లతో 78.9 కి.మీ నాలుగు వరుసల జాతీయ రహదారి నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టుతో రాజధాని పట్నా-బెతియా మధ్య కనెక్టివిటీ- మెరుగు పడుతుందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. వీటితోపాటు- దేశీయ నౌకా నిర్మాణం, సముద్ర రంగాల పునరుజ్జీవనానికి కేంద్రం ఆమోదం తెలిపింది. ఇందు కోసం రూ.69,725 కోట్ల ప్యాకేజీకి కేబినెట్ ఆమోదముద్ర వేసింది. దేశవ్యాప్తంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వైద్య కళాశాలలను బలోపేతం చేయడంలో భాగంగా కేంద్ర కేబినెట్ మరో నిర్ణయం తీసుకుంది. కొత్తగా 5వేల పీజీ సీట్లకు ఆమోదం తెలిపింది. వీటితో పాటు- కేంద్ర ప్రాయోజిత కార్యక్రమం మూడో ఫేజ్ కింద 2028-29 నాటికి ఇప్పటికే ఉన్న ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 5023 ఎంబీబీఎస్ సీట్లను పెంచాలని నిర్ణయించింది. ఈ పథకం అమలుకు సంబంధించి కేంద్ర ఆరోగ్య

మిగతా 2లో..

భారత్‌పై టారీఫ్‌లను సరిచేసేందుకు

# సానుకూలంగా ఉన్నాం

సూత్రప్రాయంగా అంగీకరించిన మార్కో రూబియో

వాషింగ్టన్(జనంసాక్షి): రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు భారత్‌పై విధించిన 25శాతం అదనపు టారిఫ్‌లను ట్రంప్ కార్యవర్గం సరిచేసేందుకు సానుకూలంగా ఉన్నట్లు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో సూచనప్రాయంగా తెలిపారు. ఆయన ఎన్‌బీసీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో రష్యా-ఉక్రెయిన్ యుద్ధంపై కీలక వ్యాఖ్యలు చేశారు. "ఐరోపా దేశాలు కూడా తక్షణమే రష్యాపై ఆంక్షలు విధించడం చాలా కీలకం. అక్కడ చాలా దేశాలు ఇప్పటికీ రష్యా నుంచి చమురు సహజవాయువును కొనుగోలు చేస్తున్నాయి. ఇది సరికాదు. పైగా వాళ్లు రష్యాపై అదనపు ఆంక్షలు విధించాలని మళ్లీ డిమాండ్ చేస్తున్నారు. వారు చేయాల్సినవి చేయడం లేదు" అని పేర్కొన్నారు. ఇక భారత్‌పై ఆంక్షల గురించి మాట్లాడుతూ "మేము దానిని సరిచేయగలమని ఆశిస్తున్నాం" అని పేర్కొన్నారు. రష్యాపై మరిన్ని ఆంక్షలు

మిగతా 9లో..



రష్యా విమానాలను

## కూల్చేయాలి

ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

వాషింగ్టన్(జనంసాక్షి): ప్రపంచంలోని రెండు భారీ శక్తుల మధ్య వివాదం ముదురుతోంది. నాటో కూటమి దేశాల గగనతల సరిహద్దులను ఉల్లంఘించి రష్యా ఫైటర్ జెట్లు దూసుకురావడంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు.

మిగతా 9లో..

# మెడికల్ సీట్ల పెంపునకు కేంద్రం ఆమోదం

కుటుంబ సంక్షేమ శాఖ పూర్తి మార్గదర్శకాలు జారీ చేయనుంది. దేశంలో పోస్ట్ గ్రాడ్యుయేట్, అండర్ గ్రాడ్యుయేట్ వైద్య విద్య సీట్లలో భారీ పెంపునకు కేంద్రమంత్రివర్గం ఆమోదం తెలిపింది. 5,023 ఎంబీబీఎస్ సీట్లను పెంచడానికి, ప్రస్తుత ప్రభుత్వ వైద్య కళాశాలల అప్‌గ్రేడ్ కోసం సెంట్రల్ స్పాన్సర్డ్ స్కీమ్ విస్తరణకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఫలితంగా దేశంలో వైద్య విద్య సామర్థ్యాన్ని గణనీయంగా పెంచేందుకు వీలవుతుంది సెంట్రల్ స్పాన్సర్డ్ స్కీమ్ 3వ దశ కింద ప్రస్తుత ప్రభుత్వ వైద్య కళాశాలల అప్‌గ్రేడేషన్ ద్వారా 5,000 కొత్త పోస్ట్‌గ్రాడ్యుయేట్ సీట్లు–, 5,023 ఎంబీబీఎస్ సీట్లు– పెంచేందుకు ఆమోదం తెలిపింది. తాజా మార్పులతో దేశవ్యాప్తంగా ఎంబీబీఎస్ సీట్లు– 1,18,190కి, పీజీ సీట్లు– 74,306కి చేరుకుంటాయి. మొత్తం రూ.15,034.50 కోట్ల బడ్జెట్ (2025–26 నుంచి 2028–29 వరకు)తో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తారు. ఇందులో కేంద్రం వాటా రూ.10,303.20 కోట్లు– కాగా.. రాష్ట్రాల వాటా రూ.4,731.30 కోట్లు. ఈ విస్తరణ వైద్యులు, స్పెషలిస్టుల సంఖ్యను పెంచి గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల్లో ఆరోగ్య సేవలను మెరుగుపరుస్తుంది. ఇది విద్యార్థులకు మరిన్ని వైద్య వృత్తి అవకాశాలు, ఉద్యోగాలు సృష్టించడంతోపాటు– భారతదేశాన్ని సరసమైన ఆరోగ్య సేవల గ్లోబల్ హబ్‌గా మార్చుతుంది. ఇప్పటికే దేశంలో 808 మెడికల్ కళాశాలలో 1,23,700 ఎంబీబీఎస్ సీట్లు– ఉన్నప్పటికీ, డిమాండ్‌కు తగ్గట్టు సామర్థం పెంచడం అవసరమని ప్రభుత్వం గుర్తించింది. ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఈ మార్పుల అమలుకు మార్గదర్శకాలు వెంటనే జారీ చేస్తుంది. ఈ నిర్ణయం యూనివర్సల్ హెల్త్ కవరేజ్ లక్ష్యాన్ని సాకారం చేస్తూ, దేశ ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేస్తుందని నిపుణులు అంటున్నారు.

# గ్రూప్–1 రద్దు ఆదేశాలపై స్టే

చోటు–చేసుకున్నాయా? పక్షపాతం చూపించారనడానికి ఏమైనా ఆధారాలున్నాయా?అని ఏజీని ప్రశ్నించారు. ఎలాంటి ఆధారాలు చూపించలేకపోయారని ఆయన తెలిపారు. ఏపీలో నిర్వహించిన గ్రూప్స్ పరీక్షల్లో తెలుగులో రాసిన అభ్యర్థులు తక్కువగా ఎంపికయ్యారని చెప్పారు. కోఠి మహిళా విశ్వవిద్యాలయంలో పురుషులకు వాష్‌రూమ్‌లు లేవని.. అందుకే ఆ రెండు కేంద్రాల్లో మహిళలకు మాత్రమే కేటాయించామని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దివ్యాంగులను దృష్టిలో ఉంచుకుని వాళ్లకు సమీపంలోని కేంద్రాలు కేటాయించామన్నారు. ప్రిలిమ్స్, మెయిన్స్‌కు వేర్వేరు హాల్ టికెట్లు– జారీ చేయడాన్ని సైతం తప్పుబట్టారని ఏజీ తెలిపారు. హాల్ టికెట్ల జారీ విషయంలో టీజీపీఎస్సీకి అధికారం ఉంటుందని.. పరీక్ష కేంద్రాల కేటాయింపును తప్పుబట్టలేమని సీజే అన్నారు. అనంతరం సింగిల్ బెంచ్ తీర్పుపై స్టే విధిస్తూ డివిజన్ బెంచ్ ఆదేశాలు ఇచ్చింది. తుది తీర్పునకు లోబడే నియామకాలు ఉంటాయని సీజే జస్టిస్ ఏకే సింగ్ స్పష్టం చేశారు. డివిజన్ బెంచ్ స్టే విధించడంతో గ్రూప్–1 ర్యాంకర్లకు ఊరట లభించింది. ఈ తీర్పుతో పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

## బీజేపీ, బీఆర్ఎస్‌లకు చెంపపెట్టు

కాంగ్రెస్ తెలిపింది. ఈ అంశంపై అధికార కాంగ్రెస్ పార్టీ స్పందించింది. బుధవారం హైదరాబాద్ గాంధీ భవన్‌లో కాంగ్రెస్ పార్టీ మీడియా కమ్యూనికేషన్ చైర్మన్ సామా రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వాన్ని బద్నాం చేద్దామనుకున్న వాళ్లకి.. ఈ కోర్టు తీర్పు చెంపపెట్టు అని అభివర్ణించారు. గ్రూప్ –1 ర్యాంకర్లపై బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నేతలు నీచ రాజకీయాలు చేస్తున్నారంటూ మండిపడ్డారు. అంతే కాదు.. ఈ పరీక్షల రద్దు చేయడం ద్వారా ర్యాంకర్ల తల్లిదండ్రులను తీవ్ర ఆవేదనకు గురిచేశారన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం వచ్చిన తర్వాత.. బీఆర్ఎస్ పార్టీ ఒక్క గ్రూప్ –1 పోస్టు కూడా ఇవ్వలేదని గుర్తు చేశారు. ఉద్యోగాలు రాకుండా అడ్డుకొని.. విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటు–న్నారంటూ బీజేపీ, బీఆర్ఎస్ నేతలపై ఆయన నిప్పులు చెరిగారు. అలాంటి వేళ.. కోర్టు తీర్పుతో న్యాయస్థానాలపై ప్రజలకు విశ్వాసం పెరిగిందని సామా రామ్మోహన్ రెడ్డి తెలిపారు. గ్రూప్ 1 మూల్యాంకనంలో అక్రమాలు జరిగాయని.. ఈ నేపథ్యంలో ఈ పరీక్షలను రద్దు చేయాలంటూ కొందరు అభ్యర్థులు తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన సింగిల్ బెంచ్ ధర్మాసనం.. ఈ పరీక్షల జవాబు పత్రాలను రీవాల్యుయేషన్ చేయించాలని.. లేకుంటే ఆ పరీక్షలను రద్దు చేసి తాజాగా నిర్వహించాలంటూ కీలక తీర్పు వెలువరించింది. ఈ తీర్పుపై డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేయాలని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్ణయించింది. అందులో భాగం దీనిపై తెలంగాణ హైకోర్టును టీ–జీపీఎస్సీ ఆశ్రయించింది. ఇక మరోవైపు గ్రూప్–1 మెయిన్స్ పరీక్షపై సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పుపై ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థుల్లో పలువురు హైకోర్టును ఆశ్రయించారు. ఎవరో ఒకరు తప్పు చేయడం వల్ల.. మొత్తం అందరిని శిక్షించడం సబబు కాదంటూ పలువురు అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మంగళవారం అంటే.. సెప్టెంబర్ 23వ తేదీ.. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఆ క్రమంలో సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును హైకోర్టు ధర్మాసనం నిశితంగా పరిశీలించింది. అందులో భాగంగా ఈ కేసు తీర్పులో వినియోగించిన పదాలు.. చేసిన వ్యాఖ్యల పట్ల ధర్మాసనం పలు సందేహాలు వ్యక్తం చేసింది.



# 42% బీసీ రిజర్వేషన్ చట్టవిరుద్ధంమటూ దాఖలైన పిటిషన్ కొట్టివేత

హైకోర్టులో రెండు పిటిషన్లు దాఖలయ్యాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సరికాదని పిల్ దాఖలు కాగా... బుధవారం హైకోర్టులో విచారణ జరిగింది. ఈ క్రమంలో పిటిషనర్లపై న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. పత్రికల్లో కథనాల ఆధారంగా పిల్ ఎలా వేస్తారని హైకోర్టు ధర్మాసనం ప్రశ్నించింది. సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం పత్రికల్లో వచ్చిన వార్తలను పరిగణలోకి తీసుకోలేమని స్పష్టం చేస్తూ.. రిజర్వేషన్ల అంశంపై దాఖలైన పిటిషన్లను కొట్టివేస్తూ హైకోర్టు ఉత్తర్వుల జారీ చేసింది. రిజర్వేషన్లు 50 శాతం మించకుండా ఆదేశాలు ఇవ్వాలని, 42 శాతం బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వ చేస్తున్న ప్రయత్నాలు అడ్డుకోవాలని హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. రిజర్వేషన్లు 50 శాతానికి మించితే స్థానిక సంస్థల్లో ఇతర వర్గాలకు అన్యాయం జరుగుతుందని పిటిషనర్లు పేర్కొన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్స్ ఇస్తే 50 శాతం దాటు–తుందని.. సుప్రీంకోర్టు తీర్పు, పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం 50 శాతం మించకూడదని పిటిషన్లు వేశారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు.. ఆ రెండు పిటిషన్లను కొట్టివేసింది.

# తెలంగాణలో కోకాకోలా కొత్త ప్లాంట్

**రూ.2,398 కోట్లు పెట్టుబడితో రాష్ట్రంలో అత్యాధునిక తయారీ కర్మాగారం ఏర్పాటు : ఉప ముఖ్యమంత్రి భట్టి**

**హైదరాబాద్(జనంసాక్షి):**తెలంగాణ పారిశ్రామిక విభాగంలో వ్యవసాయ రంగానికి ఊతం ఇచ్చేలా సాఫ్ట్‌డ్రింక్స్ తయారీ దిగ్గజం కోకాకోలా చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఈ కంపెనీ రూ.2,398 కోట్లు పెట్టుబడితో రాష్ట్రంలో అత్యాధునిక తయారీ కర్మాగారాన్ని ఏర్పాటు చేయనుందని చెప్పారు. ఇటీవల పారిశ్రామిక ప్రోత్సాహంపై జరిగిన క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశంలో ఈమేరకు ఆయన ప్రకటన చేశారు. పారిశ్రామిక వృద్ధి ద్వారా అధిక విలువ కలిగిన పెట్టుబడులను ఆకర్షించడానికి, రాష్ట్రంలో ఉపాధిని సృష్టించడానికి తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన విస్తృత ప్రయత్నంలో ఈ చర్య భాగమన్నారు. అనేక పండ్ల ఆధారిత పానీయాల్లో కీలకంగా ఉన్న మామిడి, నారింజకు స్థిరమైన డిమాండ్ అందించడం ద్వారా కోకాకోలా ఫెసిలిటీ స్థానిక రైతులకు గణనీయంగా ప్రయోజనం చేకూరుస్తుందని కంపెనీ తెలిపింది. ఈ సమావేశంలో ఆమోదించిన మరో రెండు ప్రధాన ప్రతిపాదనలతో పాటు కోకాకోలా భవిష్యత్తులో రూ.3,745 కోట్ల పెట్టుబడిని సూచిస్తుందని, రాష్ట్రంలో 1,500 కొత్త ఉద్యోగాలు పుట్టుకొస్తాయని మంత్రి హైలైట్ చేశారు. ఈ సమావేశంలో భాగంగా తోషిబా ట్రాన్స్ మిషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ తెలంగాణలో గ్యాస్–ఇన్సులేటెడ్ స్విచ్ గేర్, బుషింగ్స్ కోసం రూ.562 కోట్ల ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించినట్లు చెప్పారు.

# తమ ఎమ్మెల్యే అభ్యర్థి ఓడినా కేసీఆరే మళ్లీ సీఎం అవుతాడనుకున్నారు



తెలంగాణను కాంగ్రెస్ నేతలు ఆగమాగం చేశారని మండిపడ్డారు. దేవుని పేరు చెప్పి ఓట్లు– వేసుకోవడం ఒక్కటే బీజేపీకి తెలుసన్న కేటీఆర్.. దేవుని పేరు చెప్పారనే కరీంనగర్ ఎంపీగా బీజేపీ అభ్యర్థిని గెలుపించారని అన్నారు. కాంగ్రెస్ దొంగ మాటలు హైదరాబాద్ ప్రజలు నమ్మలేదని.. కానీ ఊళ్లలో నమ్మి మోసపోయారని కేటీ–ఆర్ వ్యాఖ్యానించారు. బుధవారం కరీంనగర్ కు చెందిన ప్రముఖ డాక్టర్ దంపతులు రోహిత్ రెడ్డి, గౌతమి రెడ్డిని కేటీ–ఆర్ సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. హైదరాబాద్ లోని తెలంగాణ భవన్లో వారిద్దరికీ గులాబీ కండువా కప్పి పార్టీలో చేర్చుకున్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు.

**గిగ్ వర్కర్ల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తాం**

గిగ్ వర్కర్స్‌కు కాంగ్రెస్ పార్టీ తీరని ద్రోహం చేసిందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ అన్నారు. అభయ హస్తం డిక్లరేషన్‌లో గిగ్, ప్లాట్‌ఫాం కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రచారంలో గిగ్ వర్కర్స్ కోసం ప్రత్యేక డిక్లరేషన్ విడుదల చేసిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి వచ్చాక వారిని పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ యూనియన్ సభ్యులు బుధవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిశారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయడం లేదని అన్నారు. గిగ్ వర్కర్స్‌కు అండగా ఉంటామన్న కేటీఆర్... వారి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాన్ని నిలదీస్తామని చెప్పారు. కాంగ్రెస్ హామీ ఇచ్చినట్లు– గిగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు–, బీమాతో కూడిన సామాజిక భద్రత, సరైన వేతనాలతో పాటు– మరణించిన కార్మికులకు పరిహారం చెల్లింపు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ హామీల అమలు బాధ్యతను తీసుకుంటానన్న రాహుల్ గాంధీ, వీరి సమస్యలపై వెంటనే స్పందించాలన్నారు. కరోనా వంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ ప్రజలకు సేవలు అందించిన గిగ్ వర్కర్లకు కాంగ్రెస్ ద్రోహం చేస్తోందని విమర్శించారు. గిగ్, ప్లాట్‌ఫాం కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక చట్టం తీసుకొస్తే భారత రాష్ట్ర సమితి పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని కేటీఆర్ తెలిపారు. గిగ్, ప్లాట్‌ఫారమ్ కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకువస్తే బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని కేటీ–ఆర్ తెలిపారు.

# ఓట్ల చోరీపై మరిన్ని సంచలనాలు బయటపెడతాం

కుమార్ తదితరులు పాల్గొన్నారు. శాశ్వత, ప్రత్యేక ఆహ్వానితులు, పార్టీ ముఖ్యమంత్రులు, పీసీసీ అధ్యక్షులు, సీఎల్పీ నేతలు హాజరయ్యారు. జాతీయంగా, అంతర్జాతీయంగా దేశం పెక్కు సవాళ్లు ఎదుర్కొంటున్న తరుణంలో సీడ బ్ల్యూసీ సమావేశం జరుగుతోందని ఖర్గే ఈ సందర్భంగా అన్నారు. మోదీ, ఆయన ప్రభుత్వ దౌత్య వైఫల్యాల కారణంగానే అంతర్జాతీయంగా మనం సమస్యలను ఎదుర్కొంటున్నామని విమర్శించారు. మోదీ నా ఫ్రెండ్ అని చెప్పుకునే అమెరికా అధ్యక్షుడు ట్రంపే ఇప్పుడు ఇండియాను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. ఓటు చోరీ అంశాన్ని ప్రస్తావిస్తూ ఎన్నికల కమిషన్ నిష్పాక్షికత, పారదర్శకతపై ఆందోళనలు తలెత్తుతున్నాయని ఖర్గే అన్నారు. వివిధ రాష్ట్రాల్లో అవకతవకలను రాహుల్ లేవనెత్తుతుంటే వాటిని పరిష్కరించకుండా అఫిడవిట్లు సమర్పించాలని ఈసీ ఒత్తిడి తెస్తోందన్నారు. బిహార్ తరహాలోనే దేశవ్యాప్తంగా లక్షలాది మంది ఓటర్లను తొలగించేందుకు ప్రస్తుతం కుట్ర జరుగుతోందని ఖర్గే ఆరోపించారు. ఓట్ చోరీ అంటే రేషన్, పెన్షన్, మెడిసన్, దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతులు, మైనారిటీలు, పేదల హక్కులను దొంగిలించడమేనని అన్నారు. ప్రజలు బహిరంగంగానే మోడీ తీరును ఎండగడుతున్నారని మండిపడ్డారు.

# 71మంది మావోయిస్టుల లొంగుబాటు

**– 30మందిపై రూ.64లక్షల రివార్డు**

**ఖమ్మం (చర్ల)(జనంసాక్షి):**ఛత్తీస్‌గఢ్‌లో బుధవారం 71 మంది మావోయిస్టులు లొంగిపోయారు ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ జిల్లా ఎస్పీ గౌరవ్ రాయ్ వద్ద లొంగిపోయిన మావోయిస్టులలో 50మంది పురుషులు, 21మంది మహిళలు ఉన్నట్లు తెలస్తోంది. వీరిలో 30 మందిపై రూ.64లక్షల రివార్డు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్లు ముమ్మరం చేయడం, ప్రభుత్వ పునరావాస విధానం అమలుతో నక్సల్స్ కార్యకలాపాలు పూర్తిగా తగ్గిపోతున్నట్లు బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ తెలిపారు. మావోయిస్టుల ఏరివేతను కేంద్ర ప్రభుత్వం ముమ్మరం చేస్తుండడంతో లొంగిపోవడం తప్ప వారికి మరో మార్గం లేదన్నారు. వీరంతా గతంలో అనేక విధ్వంసక సంఘటనలో ప్రత్యక్షంగా పాల్గొన్నట్లు బస్తర్ ఐజీ తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వారికి పునరావాసం కల్పిస్తామని స్థానిక అధికారులు పేర్కొన్నారు. మావోయిస్టులు హింసాయుత విధానాలు వదిలివేసేలా చేయడమే తమ ఉద్దేశమని.. జనజీవన స్రవంతిలో కలిసే వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ కగార్'తో మావోయిస్టుల వైపు భారీగా నష్టం వాటిల్లుతోంది. ఈ నేపథ్యంలో పెద్దసంఖ్యలో మావోయిస్టులు లొంగిపోతున్నారు.

# లద్దాఖ్‌లో జెన్‌జీ ఉద్యమం




భద్రతా దళాలపై ఆందోళనకారులు రాళ్లు రువ్వారు. స్థానిక భాజపా కార్యాలయానికి, పోలీసు వాహనాలకు నిప్పు పెట్టారు. ఒక్కసారిగా పరిస్థితులు హింసాత్మకంగా మారాయి. వీటిని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించిన పోలీసులు ఫైరింగ్ చేశారు. అనంతరం లేహ్ జిల్లాలో నిషేధాజ్ఞలు విధించారు. లేహ్‌లో చోటు–చేసుకున్న హింసపై పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. శాంతియుతంగా చేపట్టిన నిరసనలు ఎలాంటి ఫలితాలు ఇవ్వకపోవడంతోనే యువత నిస్పృహ చెందారన్నారు. ఇవే తాజా ఘటనలకు దారితీశాయన్న ఆయన.. పలువురు యువకులు ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. కేంద్ర పాలిత ప్రాంతమైన లద్దాఖ్ కు రాష్ట్ర హోదా కల్పించాలనే డిమాండ్‌తో చేపట్టిన ఆందోళనలు హింసాత్మకంగా మారడంతో పర్యావరణ ఉద్యమకారుడు సోనం వాంగ్‌చుక్ 15 రోజులుగా సాగిస్తున్న నిరాహార దీక్షను విరమించారు. రాష్ట్ర హోదా డిమాండ్ చేస్తూ లేహ్ నగరంలో పెద్ద ఎత్తున ఆందోళనకారులు బుధవారంనాడు రోడ్లపైకి వచ్చారు. పోలీసులతో ఘర్షణకు దిగడం, రాళ్లు రువ్వడం, సీఆర్‌పీఎఫ్ వాహనంతో పాటు– బీజేపీ కార్యాలయానికి నిప్పుపెట్టడం వంటి హింసాత్మక చర్యలకు దిగడంతో తీవ్ర ఉద్రిక్తత తలెత్తింది. ఈ నేపథ్యంలో ఉద్యమం హింసాత్మక రూపు దాల్చడంతో తన నిరాహార దీక్షను విరమిస్తున్నట్టు– సోనం వాంగ్‌చుగ్ ప్రకటించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో వీడియో పోస్ట్ చేశారు.



# మున్నేరు ముంపునకు ముగింపు

దీనితో వందలాది కుటుంబాలు సర్వస్వం కోల్పోయి, కట్టు– బట్టలతో రోడ్డున పడుతున్నాయి. రోడ్లు ,విద్యుత్ స్తంభాలు, సబ్ స్టేషన్లు, పాఠశాల భవనాలు, తాగునీటి వసతు లు, పైపు లైన్లు , ఆరోగ్య కేంద్రాలు దెబ్బతింటు–న్నవి. రూరల్ మండలం లో పంటలు ముంపుకు గురవుతాయి. ఉదాహరణకు 2024 సెప్టెంబర్లో సంభవించిన క్లౌడ్ బస్ట్ తో మున్నేరుకు వచ్చిన ఆకస్మిక వరద ముంపుతో ప్రభుత్వ మౌలిక సదుపాయాలకు రూ. 757 కోట్ల నష్టం జరిగినట్లు– అధికారులు అంచనా వేశారు. వరద ముంపు ప్రాంతాల్లో ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి పర్యటించి, బాధిత కుటు–ంబాలను పరామర్శించారు. మున్నేరు వాగు రివిట్‌మెంట్ వాల్ పనులు వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మున్నేరు వాగుకు 5,863 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం నుండి గరిష్ఠంగా 10 వేల క్యూమెక్స్ వరద ప్రవహిస్తుంది. ఖమ్మం నగరం మధ్య నుండి ప్రవహిస్తున్న మున్నేరు వాగుకు ఎడమ వైపు డ్రైనేజ్ వ్యవస్థ ద్వారా 379 క్యూమెక్స్ , కుడి వైపు డ్రైనేజ్ వ్యవస్థ ద్వారా 605 క్యూమెక్స్ వరద డిశ్చార్జ్ అవుతుంది. పరివాహక ప్రాంతం, నగరం నుంచి వచ్చే వరద గరిష్ఠ స్థాయిని దృష్టిలో ఉంచుకుని, మున్నేరు వాగుకు రెండు వైపుల సిమెంట్ కాంక్రీట్ రక్షణ గోడ పనులను ప్రభుత్వం మంజూరు చేసింది. మున్నేరు వాగు వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారానికి ప్రజా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా రూ.525.36 కోట్ల వ్యయంతో మున్నేరు వాగు కు రెండు వైపుల నిర్మాణం పనులను 2024 మార్చి నెలలో ప్రారంభించారు. మున్నేరు వాగుకు రెండు వైపుల ఖమ్మం రూరల్ మండలంలో 8.5 కిలోమీటర్లు, ఖమ్మం అర్బన్ మండలంలో 8.5 కిలోమీటర్లు మొత్తం 17 కిలోమీటర్లు పొడవున 10–15 మీటర్ల ఎత్తున రి–టైనింగ్ వాల్ తో పాటు–, సర్వీసు రోడ్డు , డ్రైనేజ్ వ్యవస్థ సదుపాయంతో ప్రారంభించిన పనులు వేగంగా జరుగుతున్నాయి. పనుల నాణ్యతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్నది. వరంగల్ కఒు నిపుణులతో పనుల ప్రమాణాలను తనిఖీ చేయిస్తున్నది. పనులను రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లు రెగ్యులర్ గా మానిటరింగ్ చేస్తున్నారు. ఖమ్మం అర్బన్ మండలంలో మల్లేమడుగు, దానవాయి గూడెం, బుర్హాన్ పురం, ఖమ్మం గ్రామాలు , ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లి, గొల్లపాడు, గుడిమల్ల, గుర్రాలపాడు, ఏదులాపురం గ్రామాలకు చెందిన మొత్తం 245.12 ఎకరాల భూసేకరణలో 106.21 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉంది. 138.31 ఎకరాల పట్టా భూమిలో ఇప్పటివరకు 69.12 ఎకరాలను సేకరించడం జరిగింది. భూ సేకరణ ప్రక్రియ వేగంగా జరుగుతున్నది. నిర్వాసితులకు పరిహారంతో పాటు–, ఇండ్ల స్థలాలు కేటాయించుటకు ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లి గ్రామంలో 139.27 ఎకరాల్లో లే–అవుట్ ను ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్నది. ఈ లే–అవుట్ నందు 1,666 కుటు–ంబాలకు ఇండ్ల స్థలాలు కేటాయించనున్నారు. అన్ని మౌలిక వసతులతో మోడల్ కాలనీగా ఇది అభివృద్ధి చెందుతుంది. మున్నేరు రీ–టైనింగ్ వాల్ పనులు పూర్తయితే, ఖమ్మం పురోభివృద్ధికి మైలు రాయిగా నిలుస్తుంది. దశాబ్దాల సమస్యను పరిష్కరించిన ఘనత ప్రజా ప్రభుత్వానికి దక్కుతుంది.

# జీసీసీల రాజధానిగా హైదరాబాద్


- దేశంలోనే తొలి హెల్త్‌కేర్ జీసీసీ ప్రారంభం
- రూ.650 కోట్ల పెట్టుబడులు
- 3000 మందికి ఉద్యోగాలు: మంత్రి శ్రీధర్ బాబు




**హైదరాబాద్(జనంసాక్షి):** ఏడాది కాలంలోనే సుమారు 70కిపైగా గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లను ఏర్పాటు కావడం జీవశాస్త్ర రంగంలో హైదరాబాద్ స్థానాన్ని మరింత సుస్థిరం చేసే అంశమని తెలంగాణ రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. దేశంలోనే మొట్టమొదటి హెల్త్‌కేర్ జీసీసీ 'హెచ్‌సీఏ హెల్త్‌కేర్'ను ఆయన బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ భారత జీసీసీ రాజధానిగా ఎదుగుతోందని అన్నారు. హాస్పిటాలిటీ రంగంలో మొట్టమొదటి జీసీసీని ఇటీవలే ప్రారంభించామని, తాజాగా హెల్త్‌కేర్‌లోనూ మొట్ట మొదటి జీసీసీ ఇక్కడే ఏర్పాటు కావడం ఎంతైనా హర్షణీయమైన అంశమన్నారు. జీవశాస్త్ర రంగాల్లో హైదరాబాద్ ఎదుగుదల దశాబ్దాల క్రితం బల్క్ డ్రగ్ మ్యానుఫ్యాక్చరింగ్ పరిశ్రమల ఏర్పాటుతోనే మొదలైందని మంత్రి అన్నారు. అంచెలంచెలుగా ఎదుగుతూ ప్రస్తుతం సుమారు 800 ఫార్మా కంపెనీలకు కేంద్రంగా నిలిచిందని వివరించారు. ఏపీఐలతోపాటు మందులు, బయలాజిక్స్, స్పెషాలిటీ మెడిసిన్స్, టీకాల తయారీ కేంద్రంగా ఎదిగిందని, ఈ రంగాన్ని మరింత ముందుకు తీసుకెళ్లే లక్ష్యంతో ప్రభుత్వం పలు చర్యలు చేపట్టిందని, స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు అందులో ఒకటి మాత్రమేనని తెలిపారు. ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల నిర్వహణలో అపారమైన అనుభవం కలిగిన హెచ్‌సీఏ హెల్త్ కేర్ హైదరాబాద్‌లో తన గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌ను ఏర్పాటు చేయడం ప్రభుత్వ సానుకూల విధానాలకు లభించిన మద్దతుగా భావిస్తున్నట్లు తెలిపారు. వైద్యం చౌకగా, అందరికీ అందుబాటులో ఉండేలా ఉండాలన్నది ప్రభుత్వ ప్రయత్నమని, ఈ దిశగా హెచ్‌సీఏ హెల్త్‌కేర్ నుంచి ఏ రకమైన సహాయ సహకారాలనైనా తీసుకునేందుకు సిద్ధమని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. నైపుణ్యంగల మానవ వనరులు, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు ఉన్న హైదరాబాద్ భవిష్యత్తులో అంతర్జాతీయ ఆరోగ్య సేవలకు ఒక చుక్కానిలా నిలవాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్ ఐటీ కారిడార్‌లోని సత్వా నాలెడ్జ్ పార్క్‌లో ఏర్పాటైన ఈ జీసీసీ అమెరికా, యూకేల్లోని 192 ఆసుపత్రులు, 2500కు పైచిలుకు ఆరోగ్య కేంద్రాలకు సంబంధించిన కార్యకలాపాలను నిర్వహించనుంది. నాలుగు అంతస్తుల్లో సుమారు 4.28 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో విస్తరించిన ఈ జీసీసీపై సుమారు రూ.650 కోట్ల పెట్టుబడులు పెడుతున్నట్లు సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఎమిలీ దంకన్ తెలిపారు. ప్రస్తుతం 1200 మంది ఉద్యోగులు ఇక్కడి నుంచి ఐటీ, ఫైనాన్స్, సప్లై చెయిన్ మేనేజ్మెంట్ విభాగాల కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని, ఏడాదిలోపు ఉద్యోగుల సంఖ్యను మూడు వేలకు చేరుస్తామని తెలిపారు. హెచ్‌సీఏ హెల్త్‌కేర్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ అతుల్ కపూర్ మాట్లాడుతూ ఆరోగ్య సేవలను మరింత విస్తృతం చేసేందుకు, నాణ్యమైన సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు ఈ జీసీసీ ఉపయోగపడుతుందన్నారు.

# ఉగ్రవాదులకు సహకరించిన వ్యక్తి అరెస్టు

**శ్రీనగర్(జనంసాక్షి):**పహల్గాం ఉగ్రదాడి కేసులో ఉగ్రవాదులకు సహకరించిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. పర్యాటకులపై దారుణానికి ఒడిగట్టిన ముష్కరులకు రవాణా సౌకర్యం కల్పించినందుకు గానూ అతడిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడిని జమ్మూకశ్మీర్‌లోని కుల్గాం జిల్లాకు చెందిన మహ్మద్ యూసఫ్ కటారి (26)గా గుర్తించారు. ఇంటెలిజెన్స్ వర్గాల నుంచి అందిన సమాచారం మేరకు నిందితుడిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ 22న పర్యాటకులే లక్ష్యంగా పహల్గాంలో ఉగ్రదాడి జరిగింది. అందులో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఉగ్రదాడికి పాల్పడిన ముగ్గురు టెర్రరిస్టులను ఈ ఏడాది జులై 29న 'ఆపరేషన్ మహాదేవ్'లో మన భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. అందులో సులేమాన్ అలియాస్ ఆసిఫ్‌ను ఈ ఘటనకు మాస్టర్‌మైండ్‌గా గుర్తించారు. మరో ఇద్దరిని జిబ్రాన్, హమ్జా అఫ్గానీగా గుర్తించారు.



# మేడారం అభివృద్ధి పనులపై వేగం పెంచిన ప్రభుత్వం

- అధికారులతో మంత్రులు సీతక్క, కొండ సురేఖ సమీక్ష



హైదరాబాద్ (జనం సాక్షి) : మేడారం సమ్మక్క–సారలమ్మ జాతరకు సంబంధించి చేపట్టిన మేడారం అభివృద్ధి పనులపై ప్రభుత్వం వేగం పెంచింది. సీఎం రేవంత్ రెడ్డి మంగళ వారం నాడు అధికారికంగా ప్రణాళికను ఖరారు చేయగా, అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మంత్రులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, వరంగల్ జిల్లా ఇంచార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచనలతో సచివాలయం నుంచి మంత్రి సీతక్క, వరంగల్ నుంచి మంత్రి కొండా సురేఖ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు . సమావేశానికి దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యార్, ఆర్ అండ్ బీ ఈఎన్సీ మోహన్ నాయక్, పంచాయతీ రాజ్ ఈఎన్సీ ఎన్. ఆశోక్, దేవాదాయ శాఖ ఇంజనీరింగ్ విభాగం అధికారులు హాజరయ్యారు. సమావేశంలో మంత్రులు మాట్లాడుతూ, "మేడారం అభివృద్ధి ప్రణాళిక సీఎం రేవంత్ రెడ్డి ఖరారు చేయడంతో కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. ఇది ఒక మహాఘట్టం. ఈ చరిత్రాత్మక పనిలో మీరు అందరూ భాగమవుతున్నారు. ఈ కృషి శాశ్వతంగా నిలుస్తుంది" అని పేర్కొన్నారు. మేడారం కీర్తి వెయ్యేళ్లు నిలిచేలా అభివృద్ధి పనులు ఉండాలని....భక్తులకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా పనులు చేపట్టాలని అని మంత్రులు స్పష్టం చేశారు. భక్తుల సౌకర్యాల కోసం మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులు ఆదేశించారు. అలాగే మేడారం అభివృద్ధి ప్రణాళికలకు సంబంధించి వర్కింగ్ డ్రాయింగ్స్, స్ట్రక్చరల్ డిజైన్స్‌ను అత్యంత వేగంగా పూర్తి చేయాలని, తదనుగుణంగా పనుల అంచనాలను సిద్ధం చేసి టెండర్లు తక్షణమే పిలవాలని మంత్రులు ఆదేశించారు.

# అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- అంచెలంచెలుగా మార్పు తీసుకువస్తున్నాం
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి): అన్ని వర్గాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని, అంచెలంచెలుగా అభివృద్ధి వైపు మార్పు తీసుకురావడానికి నిరంతరం కష్ట పడుతున్నామని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. బుధవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని భారత్ ఫంక్షన్ హాలులో ఎస్సి కార్పోరేషన్ ఆధ్వర్యంలో జరిగిన దళిత మేధావుల, మహాత్మా గాంధీ ఉపాధిహామీ పథకం రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ దండు రమేష్ అభినందన సభలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా డా బిఆర్ అంబేద్కర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నూతన పదవి చేపట్టిన దండు రమేష్ ను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాలలో అనేక సంక్షేమ పథకాలుం చేపట్టామని తెలిపారు. ఇంకా రానున్న మూడు సంవత్సరాలల్లో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపడతామని అన్నారు. ఎస్సి వర్గీకరణ చేసిన మొట్ట మొదటి ప్రభుత్వం ఈ రాష్ట్ర ప్రభుత్వం అని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలనే ఆలోచనను ఆచరణలో పెట్టేందుకు న్యాయ పరమైన ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అనేక మంది కార్యకర్తలు, నాయకులు ఏ పదవి ఆశించకుండా ఇంకా నాతోనే ప్రయాణం చేద్దామని గుర్తించిన వారు చాలామంది ఉన్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాలకు సంబంధించిన అధ్యక్షులని, పార్టీ కోసం పనిచేసిన వారికి ఎప్పుడు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలియజేశారు. కార్యకర్తలు, నాయకులు ఎన్నో ఏండ్లుగా సేవలు అందిస్తూ పార్టీని నిలబెట్టారని కొనియాడారు. రాష్ట్రంలో 3 వేల కోట్ల భారం పడుతున్నా, సంపన్నులు తినే సన్న బియ్యం ఇస్తున్నామని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సులో ప్రయాణం చేసే హక్కు కల్పించామని, దానిపై అసత్య ప్రచారం చేశారని తెలిపారు. ఈ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పని చేస్తుందని తెలిపారు. పార్టీలకు అతీతంగా అర్హులకు ఉచిత విద్యుత్తు ఇస్తున్నామని తెలిపారు. రైతు రుణమాఫీ, సన్న బియ్యానికి బోనస్ ఇస్తున్నామని తెలిపారు. ప్రజలు అసత్య ప్రచారాలు నమ్మొద్దని సూచించారు. బైపాస్ సాదించినందుకు, పంట కాలువల నిర్మాణానికి కృషి చేసినందుకు స్థానిక ఎమ్మెల్యే ను అభినందించారు. సింగరేణి కార్మికులకు 34 శాతం బోనస్ ఇచ్చామని, కార్మికుల పక్షాన నిలబడి చిత్తశుద్ధితో పని చేస్తున్నామని, ఇచ్చిన మాటను నిలబెట్టుకునేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఇచ్చిన హామీలన్నీ నిలబెట్టుకుని 3 సంవత్సరాలలో రానున్న ఎన్నికలకు వెళ్తామని తెలిపారు. అవసరమున్న చోట్ల అంబేద్కర్, ఎస్టీ కమ్యూనిటి హాలు, డా బిఆర్ అంబెద్కర్, పూలే కాంస్య విగ్రహాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. భూపాలపల్లి పట్టణం సుందరీకరణకు ప్రణాళికా బద్ధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పోరాటాల్లో ముందుకు నడిచిన వ్యక్తి దండు రమేష్ ముమ్ముందు మంచి కార్యక్రమాలు చేపట్టాలని, రానున్న రోజుల్లో ప్రభుత్వానికి మీ ఆశీస్సులు ఉండాలని మంత్రి కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, ఎస్సి కార్పోరేషన్ చైర్మన్ ప్రీతం, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం రాష్ట్ర సభ్యులు దండు రమేష్ ట్రేడ్ ప్రమోషన్ ఛైర్మన్ ఐతా ప్రకాష్ రెడ్డి, ఎస్సి కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వర్లు, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ రాజబాబు, టిపిసిసి అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, మార్కెట్ కమిటీ, సహకార సంఘాల చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

# బతుకమ్మ వేడుకల్లో మంత్రి సురేఖ

## మేయర్ గుండు సుధారాణి ఆటాపాట





వరంగల్ ప్రతినిధి, సెప్టెంబర్ 24 (జనంసాక్షి) : వరంగల్ నగరంలోని జీ డబ్ల్యూ ఎం సి ఆధ్వర్యం లో ప్రధాన కార్యాలయ ఆవరణ లో తీరక్క పూలతో పెద్దపెద్ద బతుకమ్మలను పేర్చి మంత్రి సురేఖ మేయర్ గుండు సుధారాణి అధికారులు కలిసి ఆటలు పాడుతూ పాటలు పాడుతూ బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మంత్రి సురేఖ ఎంతో ఉత్సాహభరితంగా శ్రీ లక్ష్మీ నీ మహిమలు చిత్రమై తోచినమ్మ అంటూ పాటలు పాడుతూ నృత్యం చేస్తూ మహిళా మణులకు ఉత్సాహంగా కోలాటం ఆడుతూ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రకృతిలో దొరికే ప్రతి పుష్పం గొప్పదని చెబుతూ గొనుగు పువ్వు ఆవశ్యకతను వివరించారు. రాబోయే రోజుల్లో బతుకమ్మ పేర్చే పూల ప్రాధాన్యతను అనుసరిస్తూ దాని అవసరం తెలియపరిచారు. మంత్రి సురేఖతోపాటు మేయర్ గుండు సుధారాణి అధికారులు ఉత్సాహంగా వేడుకలు నిర్వహించారు. అధికారులు పోలీస్ సిబ్బందితో కలిసి మెలిసి ఆడారు. జిడబ్ల్యూ ఎంసీ కమీషనర్ చాహాత్ బాజ్ పాయి, వరంగల్ ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి, కార్పొరేటర్లు అధికారులు, మహిళా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్లపై దాగుడుమూతలు

- కాంగ్రెస్ తీరుపై మండిపడ్డ శ్రీనివాసగౌడ్



హైదరాబాద్, సెప్టెంబర్ 24 (జనంసాక్షి) : బీసీ రిజర్వేషన్ల బిల్లు గురించి ఢిల్లీ పెద్దలను సీఎం రేవంత్‌రెడ్డి ఏనాడూ అడగలేదని భారత రాష్ట్ర సమితి నేత, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నేతలు మొదట చట్ట సవరణ అన్నారని.. తర్వాత ఆర్డినెన్స్.. ఇప్పుడు జీవో అంటున్నారన్నారు. బిల్లుల పేరుతో బీసీలను అవమానిస్తే ఊరుకునేది లేదని చెప్పారు. 42 శాతం రిజర్వేషన్లను చట్టబద్ధంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీలు అడగకపోయినా.. కాంగ్రెస్ పార్టీయే హామీ ఇచ్చిందని పేర్కొన్నారు. రిజర్వేషన్ల అమలుపై ఆ పార్టీ మోసం చేస్తోందని దుయ్యబట్టారు. ఈ అంశం విద్య, ఉద్యోగాల్లో లక్షల మంది జీవితాలతో ముడిపడి ఉంది. జీవో ఇచ్చి కేవలం రాజకీయ పదవులకే సరిపెడితే ఊరుకునేది లేదు. రాజకీయ పదవుల్లోనూ బీసీలకు పూర్తి న్యాయం చేయలేదు. బిల్లు ఆమోదం కోసం ఢిల్లీలో ధర్నాలు చేశారు. కానీ.. ఎవరినీ అడగలేదు. విజయోత్సవ సభ పెడుతున్నామని ఎందుకు వెనక్కి తగ్గారని శ్రీనివాస్ గౌడ్ ప్రశ్నించారు. మీడియా సమావేశంలో మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ మధుసూధనాచారి తదితరులు పాల్గొన్నారు.

# విశ్వకర్మలకు క్షమాపణలు : కంచ ఐలయ్య



హైదరాబాద్ (జనం సాక్షి) : విశ్వకర్మ కమ్యూనిటీకి కంచె ఐలయ్య క్షమాపణలు చెప్పారు. ఆయన సెప్టెంబర్ 17 నాడు పెరియార్ జయంతి మీటింగ్‌లో మాట్లాడారు. అదే రోజు భగవాన్ విశ్వకర్మ జయంతి కూడా, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జయంతి కూడా. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి భగవాన్ విశ్వకర్మను నరేంద్ర మోడీని ఒకే స్థాయిలో పోలుస్తూ ఒక ప్రకటన చేశారని, దాన్నే తప్పు పడుతూ తాను భగవాన్ విశ్వకర్మను మొదటిసారి కేంద్రం దేవునిగా గుర్తించిందని, అయితే కొంతమంది రచయితలు విశ్వకర్మ ఇంద్రుని వజ్రాయుధాన్ని తయారు చేశాడని, కొన్ని పట్టణాలను కట్టారని మాత్రమే చెబుతున్నారని, వ్యవసాయానికి మూలమైన నాగలి పారా వంటి అనేక ఉత్పత్తి పరికరాలను ఆయనే చేసి ఉండాలి కదా, హరప్పా ఒంటి నగరాలను ఆయనే కట్టి ఉండాలి కదా అని తాను చెప్పిన మాటను కొన్ని చానళ్లు సగం మాత్రమే చూపించాయని పేర్కొన్నారు. దీంతో తన ఉపన్యాసం విశ్వకర్మకు వ్యతిరేకంగా చేశానని విశ్వకర్మ కమ్యూనిటీ నొచ్చుకున్నట్లు తెలిసిందని, అందుకు తాను క్షమాపణలు చెబుతున్నానని తెలిపారు. తనకు విశ్వకర్మ మీద ఆ కమ్యూనిటీ మీద చాలా గౌరవం ఉందని, తాను వారిని ఆది ఇంజనీర్లుగా పొగుడుతూ ఎన్నో వ్యాసాలు రాశానని తెలిపారు. బిజెపి భగవాన్ విశ్వకర్మను దేవునిగా గుర్తించిందని, ఆయనకు రామాలయం లాంటి పెద్ద ఆలయం కట్టాలని కోరారు. ఢిల్లీ ఐఐటి కి భగవాన్ విశ్వకర్మ పేరు పెట్టాలని, భగవాన్ విశ్వకర్మ పేరుతో ఒక పెద్ద మ్యూజియంను దేశంలో నిర్మించి అతి పురాతన ఇంజనీరింగ్ వస్తువులను అన్నిటినీ సేకరించి అందులో భద్రపరచాలని, దేశంలోని మొత్తం స్కూళ్లలో భగవాన్ విశ్వకర్మ పైన విశ్వకర్మలు తయారుచేసిన ఇంజనీరింగ్ వస్తువుల పైన పాఠాలు చెప్పించాలని కోరారు.

# సాంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతిరూపం బతుకమ్మ పండుగ

- ఘనంగా బతుకమ్మ పండుగ ఏర్పాట్లు చేయాలి..
- జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్..



మహబూబాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 24 (జనం సాక్షి): తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలకు ప్రతిరూపం బతుకమ్మ పండుగ అని జిల్లాలో ఘనంగా బతుకమ్మ పండుగ నిర్వహించడం కోసం ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు, బుధవారం జిల్లా కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టోప్పో కె.అనిల్ కుమార్ సంబంధిత అధికారులతో కలిసి జిల్లాలో బతుకమ్మ పండుగ ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సెప్టెంబర్ 21 నుండి 30 వరకు తెలంగాణ ఆడపడుచుల పండగ బతుకమ్మ వేడుకలు అధికారికంగా నిర్వహించడం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకొని జిల్లాలలో కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అందులో భాగంగానే ఉమ్మడి వరంగల్ జిల్లా మహబూబాబాద్ జిల్లాలో ఘనంగా బతుకమ్మ ఏర్పాట్లు చేయాలని బతుకమ్మ ఆడే ప్రదేశాలు చెరువులు కుంటలు దేవాలయాలు తదితర ప్రదేశాలలో ప్రభుత్వం సూచించిన ప్రకారం విద్యుత్ కాంతులతో సకల ఏర్పాట్లను చేయాలని సంబంధిత మున్సిపల్ పంచాయతీరాజ్ అన్ని విభాగాల సిబ్బందులను ఆయన ఆదేశించారు. ప్రజాప్రతినిధులు తదితరులకు అధికారులకు ప్రోటోకాల్ ప్రకారం ఏర్పాట్లు చేయాలన్నారు.

# ఊపేస్తున్న మన బతుకమ్మ -2025 పాట




హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన 'మన బతుకమ్మ 2025' పాట విడుదలైంది. పాటను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేశారు. పూర్తి పాటను బుధవారం సాయంత్రం 8 గంటలకు రిలీజ్ చేశారు. ప్రముఖ ప్రజాకవి, గాయకుడు, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న అద్భుతమైన సాహిత్యం అందించగా.. సురేష్ బొబ్బిలి సంగీతం అందించారు. అదితి భవరాజు, మంగ్లీ, గోరటి వెంకన్న ఆలపించగా.. ఈశ్వర్ పెంటి (ప్రేమలో ఫేమ్) నృత్య రూపకల్పన చేశారు. దర్శకుడు బద్రప్ప గాజుల ప్రతి సన్నివేశాన్ని సజీవ చిత్రంగా మలచగా, శ్యామ్ దుపాటి, ఉదయ్ గుర్రాల (సినిమాటోగ్రఫీ) తెలంగాణ పల్లె దృశ్యాలు, పండుగ వాతావరణం, ఉత్సాహం అన్నింటినీ అద్దం పట్టినట్లుగా అద్భుతంగా తెరకెక్కించారు. ఓ తంగేడు పూల తల్లి బతుకమ్మ అంటూ సాగే ఈ పాటను తెలంగాణ ఆడపడుచులు ఆడిపాడుకునేలా రూపొందించారు. ఈ పాట సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉంది.

# టీచర్లకు స్థానికతను ఇవ్వండి

- తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ నాగర్ కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మునగాల సతీష్ కుమార్



నాగర్‌కర్నూల్ (జనంసాక్షి) : టీచర్లకు స్థానికత ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ నాగర్ కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మునగాల సతీష్ కుమార్ కోరారు. నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే కూచికుళ్ళ రాజేష్ రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికు మెమోరాండం ఇచ్చారు. జీవో 317 డిప్యూటేషన్‌పై వచ్చిన.. జీవో 190 లో ప్రతి ఒక్క ఉద్యోగ ఉపాధ్యాయునికి అవకాశం కలిగించి స్థానిక పునాదుల మీద ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రంలో వారి పిల్లల స్థానికతను కోల్పోకుండా వారి స్థానిక జిల్లాలకు అవకాశం కలిగించాలని కోరారు. జీవో 190లోని క్లాస్ 10.. లో ప్రమోషన్ పొందిన ఉద్యోగులు అనర్హులు అని చెప్పడం ఎంతో శోచనీయమన్నారు. ప్రమోషన్ అనేది ఉద్యోగ జీవితంలోని ఒక జన్మ హక్కు అని, ఈ ప్రాథమిక హక్కును ఉల్లంఘించే విధంగా ఉన్న చర్యగా భావిస్తూ.. రాష్ట్రంలో 317.. జీవో ద్వారా నష్టపోయిన ప్రతి ఒక్క ఉద్యోగ ఉపాధ్యాయునికి వారి స్థానిక జిల్లాను కేటాయించవలసిందిగా కోరారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడానికి ఉద్యోగ ఉపాధ్యాయులు ఎంతో శ్రమించారని గుర్తుచేస్తూ.. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉద్యోగ ఉపాధ్యాయులు ఎప్పుడు వెనుదనుగా ఉండేలా చూసుకోవాలని కోరారు. ఇచ్చిన మాటను పూర్తిస్థాయిలో నెరవేర్చుకొని తమకు స్థానికతను ప్రసాదించాలని కోరారు. డీఈవో పుల్ లో ఉన్న పోస్టులన్నీ ఓపెన్ చేసి ఖాళీలను కూడా పరిగణించి ఉపాధ్యాయులకు తగు న్యాయం చేయుటకు తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ పక్షాన ప్రాతినిధ్యం చేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు పోశయ్య, కల్వకుర్తి మండల అధ్యక్షులు మహేందర్, ఎండి సలీం మంగులాల్ పాల్గొన్నారు.




# అక్టోబర్ 10న ఢిల్లీలో పెన్షనర్ల ధర్నా

హైదరాబాద్ (జనంసాక్షి) : అక్టోబర్ 10న ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నామని, ఈ ధర్నాని జయప్రదం చేయాలని ఈరోజు టాప్ర రాష్ట్ర కార్యాలయంలో జరిగిన టాప్ర రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. కేంద్ర ప్రభుత్వం ఆర్థిక బిల్లులో భాగం చేస్తూ పెన్షన్ చట్టాల సవరణ చేయడం దేశ వ్యాప్తంగా పెన్షనర్లందరినీ తీవ్రమైన ఆందోళనకు గురిచేసిందనీ, ఈ చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ ఎన్ని విజ్ఞప్తులు చేసినా, దేశ వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదని పేర్కొంది. ఈ సమావేశానికి ఎం జనార్ధన్ రెడ్డి అధ్యక్షత వహించగా ప్రధాన కార్యదర్శి పి కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులు యు ఆంజనేయులు, డా ఎల్ అరుణ, ఎం రంగయ్య, వి కృష్ణ మోహన్, కోశాధికారి నాగేశ్వర్ రావు, టి. సీతారాం, కె నాగేశ్వర్ రావు, స్వరాజ్ కుమార్, జగదీశ్ చంద్ర, మస్తాన్ రావు, నర్సింగరావు, చెన్న కేశవులు, శివలింగం, రామారావు, రామకృష్ణ, రాధాకృష్ణ, లక్ష్మీనారాయణ, కృష్ణారావు జి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్ 10న ఢిల్లీ ధర్నాని జయప్రదం చేయాలని, పెన్షన్ వాలిడేషన్ చట్టాన్ని రద్దు చేయాలి. ఉద్యోగ విరమణ తేదీని బట్టి పెన్షనర్లను విభజించే ప్రయత్నం చేయవద్దని, వెంటనే 8వ వేతన సవరణ కమిషన్ ని నియమించాలని, టాప్ర రాష్ట్ర మహాసభలు డిశంబర్ లో జరపాలని, ఎన్‌సీసీపీఏ కార్యక్రమాలు కో ఆర్డినేషన్ కొరకు వి కృష్ణ మోహన్ బాధ్యత వహిస్తారని, కోవిడ్ కాలంలోని 18 నెలల డిఏ బకాయిలను విడుదల చేయాలని, కోవిడ్ సమయంలో రద్దు చేసిన రైల్వే ప్రయాణ రాయితీలను పునరుద్ధరించాలని తీర్మానించారు.

# బిఆర్ఎస్‌లో చేరిన శంషాబాద్ బిజెపి నేత

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (జనంసాక్షి) : శంషాబాద్ మున్సిపాలిటీలో భారతీయ జనతా పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మున్సిపాలిటీలో బీజేపీ సీనియర్ నాయకుడిగా ఉన్న కొలను ప్రదీప్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరారు. తెలంగాణ భవన్‌లో పట్లోళ్ల కార్తీక్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయనకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. శంషాబాద్ ప్రాంతంలో ప్రదీప్ రెడ్డికి ఉన్న మంచి పేరు, ప్రజల్లో ఆయనకు ఉన్న ఆదరణ పార్టీకి మరింత బలం చేకూరుస్తుందని ఈ సందర్భంగా కేటీఆర్ అన్నారు. కొలను ప్రదీప్ రెడ్డితో పాటు ఆయన అనుచరులు, అభిమానులు కూడా బీఆర్ఎస్‌లో చేరారు.


# రాజేంద్రనగర్‌లో వ్యక్తి దారుణహత్య

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (జనంసాక్షి) : రంగారెడ్డి జిల్లాలోని రాజేంద్రనగర్ లో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. వ్యవసాయ వర్సిటీ సమీపంలో బెంగుళూరు జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులో మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. గుర్తు తెలియని మృతదేహం రక్తం మడుగులో పడి ఉంది. అతి కిరాతకంగా కత్తితో గొంతుకోసి హత్య చేసినట్లు ఆనవాళ్లు ఉన్నాయి. ఎక్కడో హత్య చేసి మృతదేహాన్ని ఇక్కడ పడేసినట్లుగా పోలీసుల అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. క్లూస్ టీమ్ సాయంతో ఆధారాల సేకరిస్తున్నారు. వరుస హత్యలతో స్థానికులు బెంబేలెత్తుతున్నారు. గత వారం మహిళను అత్యాచారం చేసి హత్య చేసిన విషయం తెలిసిందే. మంగళవారం మైలార్ దేవుపల్లిలో ఓ వ్యక్తిని హత్య చేసేందుకు సుపారీ తీసుకున్న విషయం విదితమే.

# హాస్టల్‌లో కార్మికుడి అనుమానాస్పద మృతి

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (జనంసాక్షి) : మియాపూర్‌లోని ఓ హాస్టల్‌లో దారుణం చోటు– చేసుకుంది. ప్లంబర్‌గా పని చేస్తూ హాస్టల్‌లో ఉంటున్న ఖమ్మం జిల్లాకు చెందిన గణేష్ అనే యువకుడు హాస్టల్‌లో అనుమానస్పద స్థితిలో మృతి చెందాడు. హాస్టల్‌లో విగతజీవిగా పడి ఉండటంతో హాస్టల్ నిర్వాహకులు పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలిసి హాస్టల్ వద్దకువచ్చిన మృతుడి బంధువులు ఆందోళనకు దిగారు. పోలీసులు నచ్చజెప్పడంతో మృతుడి బంధువులు ఆందోళణ విరమించారు. ఈ ఘటనపై మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. పోస్ట్‌మార్టం అనంతరం గణేష్ మృతికి గల కారణాలు తెలిసే అవకాశం ఉంది.

# అంతరిక్ష వాస్తుశిల్పి సతీష్ ధావన్



## సెప్టెంబర్ 25... సతీష్ ధావన్ జయంతి

భారత దేశం గర్వించదగిన అంతరిక్ష శాస్త్రవేత్త సతీష్ ధావన్. ఆయన్ను భారత ఎక్స్పెరిమెంటల్ ఫ్లూయిడ్ డైనమిక్స్ ప్రయోగాత్మక (ద్రవ డైనమిక్స్ పరిశోధన) కు పితామహుడిగా పరిగణిస్తారు. అల్లకల్లోలం మరియు సరిహద్దు పొరల రంగంలో అత్యంత ప్రసిద్ధ పరిశోధకులలో అగ్రగణ్యుడుగా భావిస్తారు. గణితం, ఏరోస్పేస్ ఇంజనీరింగుల్లో డబల్ పి.హెచ్.డి సాధించి, ధావన్ గ్రామీణ విద్యలోను, రిమోట్ సెన్సింగు, ఉపగ్రహ సమాచారాల లోను పరిశోధనలు చేసాడు. వాటి ఫలితంగానే ఇన్‌శాట్, ఐఆర్ఎస్, పిఎస్ఎల్‌విలు రూపొందాయి.

స్పేస్ కమిషను ఛైర్మనుగా, ఇస్రో ఛైర్మనుగా భారత ప్రభుత్వ అంతరిక్ష శాఖలో సెక్రెటరీగా బాధ్యతలు స్వీకరించాడు. భారత దేశపు మొట్టమొదటి సూపర్‌సోనిక్ విండ్ టన్నెల్‌ను నిర్మించాడు. భారత దేశపు అత్యున్నత పురస్కారాలు పద్మ విభూషణ్, పద్మ భూషణ్, పొందాడు. విశిష్ట పూర్వ విద్యార్థి పురస్కారం, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, విశిష్ట పూర్వ విద్యార్థి కాలిఫోర్నియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, 1969 అవార్డు పొందాడు.

సతీష్ ధావన్ (1920 సెప్టెంబరు 25 - 2002 జనవరి 3) శ్రీనగర్‌లో జన్మించిన ధావన్, భారత దేశం, అమెరికాలో తన విద్యాభ్యాసాన్ని పూర్తి చేసాడు. టర్బులెన్స్, బౌండరీ లేయర్స్ రంగాల్లో ఆయనను అత్యున్నత స్థాయి పరిశోధకుల్లో ఒకరిగా పరిగణిస్తారు. ఆయా రంగాల్లో ఆయన శక్తి సామర్థ్యాలు భారత స్వదేశీ అంతరిక్ష కార్యక్రమ అభివృద్ధికి దోహద పడింది. 1972 లో ఎమ్.జి.కె. మీనన్ తరువాత, ఇస్రో ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించాడు. ప్రొఫెసర్ సతీష్ ధావన్ సమాజాన్ని మార్చే మార్గంగా టెక్నాలజీని, ముఖ్యంగా హై టెక్నాలజీని చూసిన మానవతా వాది. భారతదేశం యొక్క అత్యంత విజయవంతమైన అంతరిక్ష కార్యక్రమానికి వాస్తుశిల్పి సతీష్ ధావన్.

ప్రస్తుతం పాకిస్తాన్‌లో ఉన్న లాహొరు లోని యూనివర్సిటీ ఆఫ్ పంజాబ్ నుండి బాచిలర్ ఆఫ్ సైన్స్ డిగ్రీ, మెకానికల్ ఇంజనీరింగ్ డిగ్రీ, ఇంగ్లీషు సాహిత్యంలో ఎమ్.ఏ డిగ్రీ పొందాడు. 1947 లో మిన్నియా పోలిస్ లోని యూనివర్సిటీ ఆఫ్ మిన్నెసోటా నుండి ఏరోస్పేస్ ఇంజనీరింగులో ఎమ్.ఎస్., కాలిఫోర్నియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుండి ఏరోనాటికల్ ఇంజనీరింగులో డిగ్రీ, ఆ తరువాత 1951 లో డా. హాన్స్ డబ్ల్యు లేప్‌మ్యాన్ మార్గదర్శకుడిగా గణితం, ఏరోస్పేస్ ఇంజనీరింగుల్లో డబుల్ పి.హెచ్.డి పొందాడు.

డా. ధావన్ స్పేస్ కమిషను ఛైర్మనుగా, ఇస్రో ఛైర్మనుగా (1972-1984) భారత ప్రభుత్వ అంతరిక్ష శాఖలో సెక్రెటరీగా పని చేశాడు. స్పేస్ కమిషన్ ఛైర్మన్ గా బాధ్యతలు తీసుకోగానే అణుశక్తి కమిషనులో ఉన్న బ్రహ్మ ప్రకాష్‌ను తిరువనంతపురంలో ఉన్న విక్రం సారాభాయ్ అంతరిక్ష కేంద్రానికి ఛైర్మనుగా నియమించాడు. ఇస్రో శీఘ్రగతిన ఎదగడానికి ఆయన తీసుకున్న నిర్ణయం ఎంతో తోడ్పడింది. ఆ తరువాత భారత తొలి ఉపగ్రహ వాహక నౌక ఎస్ఎల్‌వి అభివృద్ధి కార్యక్రమానికి అబ్దుల్ కలాంను నాయకుడిగా నియమించాడు.

1975 లో ఎ.పి.జె. అబ్దుల్ కలామ్ నాయకత్వంలో ఎస్ఎల్‌వి అభివృద్ధి జరుగగా, దాని మొదటి ప్రయోగం విఫలమైంది. వైఫల్యానికి బాధ్యత వహిస్తూ ఆనాటి పత్రికా సమావేశంలో పాల్గొని ఆ వైఫల్యాన్ని తానే స్వీకరించాడు. రెండవ ప్రయోగం విజయవంత మైనపుడు ఆనాటి పత్రికా సమావేశాన్ని అబ్దుల్ కలాం చేత చేయించాడు.

1951లో ధావన్ భారత్ శాస్త్ర విజ్ఞాన సంస్థలో ఉపాధ్యాయుడిగా చేరాడు. 1962 దానికి డైరెక్టరుగా నియమితుడై, 1962-1981 వరకు ఐఐఎస్‌సి చైర్మన్ గా పని చేశాడు. ఆయన ఇస్రో ఛైర్మనుగా ఉన్నప్పటికీ, బౌండరీ లేయర్ పరిశోధనలో తన శక్తియుక్తులు నియోగించాడు. ఆయన చేసిన పరిశోధనలను హెర్మన్ ష్లిక్టింగ్, తాను రాసిన బౌండరీ లేయర్ థియరీ పుస్తకంలో వివరించాడు. ధావన్ ఐఐఎస్‌సి లో భారతదేశపు మొట్టమొదటి సూపర్‌సోనిక్ విండ్ టన్నెల్‌ను నిర్మించాడు. అయన గ్రామీణ విద్య, రిమోట్ సెన్సింగ్ మరియు ఉపగ్రహ సమాచార మార్పిడిలో మార్గదర్శక ప్రయోగాలు చేశారు. ధావన్ ప్రయత్నాలు INSAT- ఒక టెలి కమ్యూనికేషన్ ఉపగ్రహం, IRS - ఇండియన్ రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహం మరియు పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (PSLV) వంటి కార్యాచరణ వ్యవస్థలకు దారితీశాయి, ఇవి భారతదేశాన్ని అంతరిక్ష వ్యవసాయ దేశాల లీగ్‌లో ఉంచాయి.

2002 లో ధావన్ మరణించాక, నెల్లూరు జిల్లా శ్రీహరికోట లోని అంతరిక్ష ప్రయోగ కేంద్రానికి ఆయన పేరుతో "సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం"గా పేరు పెట్టారు. లూధియానా లోని ప్రభుత్వ కళాశాలను ఆయన పేరిట మార్చారు.

పద్మ విభూషణ్, 1981, పద్మ భూషణ్, 1971, ఇందిరా గాంధీ జాతీయ సమైక్యతా పురస్కారం, 1999 స్వీకరించాడు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, బెంగళూరు సీనియర్ సైంటిఫిక్ ఆఫీసరు, 1951బీ ప్రొఫెసర్ అండ్ హెడ్ అఫ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఏరొనాటికల్ ఇంజనీరింగ్, 1955బీ డైరెక్టరు, 1962-1981 కాలి ఫోర్నియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, అమెరికా విజిటింగ్ ప్రొఫెసరు, 1971-72బీ

నేషనల్ ఏరోస్పేస్ లాబరేటరీస్, బెంగళూరు రీసెర్చి కౌన్సిల్ ఛైర్మను, 1984-93బీ ఇండియన్ అకాడెమీ ఆఫ్ సైన్సెస్ప్రె ప్రెసిడెంట్ 1977-1979 ఇస్రో ఛైర్మన్, 1972-1984 ఇండియన్ స్పేస్ కమిషను ఛైర్మన్, 1972-2002 గా విధులు నిర్వర్తించాడు. 2002 జనవరి 3న 81ఏళ్ళ వయసులో మరణించాడు.


రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

# దేశం గర్వించదగ్గ అణు భౌతిక శాస్త్రవేత్త రాజా రామన్న

రాజారామన్న, (జనవరి 28, 1925) - సెప్టెంబర్ 24, 2004) భారత అణు శాస్త్రవేత్త. భారత దేశం శాస్త్ర, సాంకేతిక రంగాలలో సంచలన విజ యాలు సాధించడంలో, అద్భుతమైన ప్రగతిని సాధించడంలో కీలకపాత్ర వహించిన వారిలో డాక్టర్ రాజారామన్న ఒకరు. భారత దేశం అణుబాంబు ను తయారు చేయడంలో ఆయన కీలకపాత్ర పోషించారు. అణు శాస్త్ర మరియు సాంకేతిక పరిజ్ఞానంలో అభివృద్ధి చెందిన దేశంగా మన దేశానికి గుర్తింపు తేవడంలో రామన్న పాత్ర అద్వితీయం.

కర్ణాటకలోని మైసూర్లో 1925 జనవరి 28నాడు జన్మించిన రాజా రామన్న ప్రాథమిక విద్యాభ్యాసం మైసూర్‌లోనే చేశారు. తరువాత బెంగళూర్, మద్రాసు నగరాలలో ఉన్నత విద్యాభ్యాసం చేసి లండన్లోని కింగ్స్ కాలేజి నుండి మాలిక్యులర్ ఫిజిక్స్‌లో పిహెచ్‌డి చేశారు. 1949లో టాటా ఇన్స్టిట్యూ ట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్‌లో ప్రొఫెసర్‌గా రామన్న తన ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. అక్కడ సుప్రసిద్ధ శాస్త్రజ్ఞుడు, డా.హొమీ జహంగీర్ భాభా సహచర్యం రాజారామన్నను ఎంతగానో ప్రభావితం చేసింది. తారాపూర్ అణు విద్యుత్ కేంద్రం నిర్మాణ బాధ్యతలను డా. హొమీ భాభా డా.రాజా రామన్నకు అప్పగించారు. వాటిని రామన్న సమర్థవంతంగా నిర్వహించారు. భారత ప్రభుత్వం హొమీ భాభా మరణం తరువాత అటామిక్ ఎనర్జీ కమీషన్ ఛైర్మన్ గా, అటామిక్ ఎనర్జీ డిపార్ట్ మెంట్ సెక్రటరీగా డా.రాజారామన్నను నియమించింది. 1972 నుండి 1978 వరకు, మళ్ళీ 1981 నుండి 1983 వరకు బాబా ఆటమిక్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్‌గా పనిచేశారు. 1978 నుండి 1981 వరకు, రక్షణ మంత్రికి శాస్త్రీయ సలహాదారు పదవిలో ఉన్నారు.

ఇందిరా గాంధీ హయాంలో భారత దేశం 1974 మే 18 తేదీన జరిపిన అణు పరీక్ష అప్పట్లో ఒక సంచలనం. దాని వెనక రామన్న కృషి అసమానం. ఇందిరా గాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు భారతదేశపు మొట్టమొదటి భూగర్భ అణు పేలుడులో రాజా రామన్న కీలక పాత్ర పోషించారు. అణు పేలుడు పరికరం తయారీకి వెళ్ళే వివిధ విభాగాలలో నైపుణ్యం ఉన్న అనేక బృందాలను ఆయన కలిసి తీసుకు వచ్చారు. రాజస్థాన్ ఎడారిలో పోఖ్రాన్ వద్ద జరిపిన ఈ అణు పరీక్ష ఫలితంగా అమెరికా, యూరోపియన్ దేశాలు ఇండియాపై ఆంక్షలు విధించాయి. ఇండియా పట్ల అణు అంటరాని తనాన్ని పాటించాయి. తాము ఒక పక్క అణ్వస్త్రాలను గుట్టలుగా పేర్చుకుంటూనే ఇండియాలాంటి మూడో ప్రపంచ దేశాలు అణ్వస్త్రాలు సమకూర్చు కోవడానికి వీలు లేదని శాసించాయి.




భారత దేశ మొట్ట మొదటి అణు బాంబు నిర్మాణం దేశంలో కూడా రహస్యంగానే సాగింది. బాంబు రూపకల్పన, నిర్మాణం, పరీక్షలలో పాల్గొన్న 75 మంది శాస్త్రవేత్తలకు (బార్క్ అధిపతి రాజా రామన్న నాయకుడు) తప్ప భారత మంత్రులకు ఎవరికీ బాంబు నిర్మాణం అవుతున్న సంగతి తెలియదు. శాస్త్రవేత్తలు కాకుండా భారత ప్రధాని ఇందిరాగాంధి, ఆమె సలహాదారు మరియు అప్పటి మాజీ ప్రిన్సిపల్ కార్యదర్శి పి.ఎన్.హక్సర్, అప్పటి ప్రిన్సిపల్ కార్యదర్శి డి.పి.ధర్ లకు తప్ప రక్షణ మంత్రికి కూడా బాంబు సంగతి తెలియదు. 1972 సెప్టెంబరులో బార్క్ సందర్శించిన ఇందిర నోటిమాటతో బాంబు నిర్మాణానికి, పరీక్షకు ఆదేశాలు ఇచ్చారని భావించ బడింది. 1997లో డాక్టర్ రాజా రామన్న స్వయంగా పోఖ్రాన్ లో పేల్చింది అణు బాంబే అని చెప్పేవరకూ అధికారికంగా దాని గురించి తెలియక పోవడం గమనార్హం.

1989 టాటాల ప్రోత్సాహం, ఫ్రాన్స్ నుండి ఆర్థిక సహకారం అందడం వలన డా. రాజారామన్న బెంగుళూర్ లో పరిశోధన సంస్థను స్థాపించారు. రామన్న చేసిన అసమాన కృషికి గుర్తింపుగా పద్మశ్రీ (1968), పద్మభూషణ్ (1973), పద్మ విభూషణ్ (1975) అవార్డులు రామన్నను వరించాయి. 2004, సెప్టెంబర్ 24 న మరణించారు.

రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

### ఆకాశం...



సువిశాల వాకిలి
అద్భుతాల లోగిలి
గర్జిస్తే బెబ్బులి
ప్రశాంతమైతే పున్నమి

డా. తిరునగరి శ్రీనివాస్
9441464764

# ట్రంప్ చర్యలతో - "జ్ఞానోదయం" స్వదేశీకి పిలుపు

భారత ప్రధాని నరేంద్ర మోదీ, రెండు రోజుల ముందు (సెప్టెంబర్ 21, 2025) జాతిని ఉద్దేశించి చేసిన ప్రసంగంలో 'స్వదేశీ'ని మరోసారి పునరుజ్జీవింపు చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన 50 శాతం టారిఫ్‌లు, హెచ్-1బీ వీసా, ఫీజులను %వి%100,000కి పెంచిన నిర్ణయం వల్ల భారతీయ ఐటీ కంపెనీలు, ఉద్యోగులు కష్టాల్లో పడ్డారు. ఈ నేపథ్యంలో మోదీ 'ఆత్మనిర్భర్ భారత్', 'స్వదేశీ 2.0' అని పిలుపునిచ్చారు. "మన పెద్ద శత్రువు విదేశీ వస్తువుల పై ఆధారపడటం" అని చెప్పి, నవరాత్రి నుంచి 'బచత్ ఉత్సవ్' (సేవింగ్స్ ఫెస్టివల్) ప్రారంభిస్తామని ప్రకటించారు. ఇది జీఎస్ టీ 2.0 సంస్కరణలతో కలిపి, విదేశీ వస్తువులను తిరస్కరించి స్వదేశీ ఉత్పత్తులు వాడమని సూచించారు.

కానీ,ఇంటా...బయటా.. "ఈ మోదీ పిలుపు ప్రజలకోసం మా!!" , "తనకోసం (మోదీ కోసం)కాదా !! ? అనే చర్చ ప్రజలు మధ్య రగిలిపోతోంది."

ఎందుకంటే? మోదీ నిత్యం ధరించే దుస్తులు ( ఫారిన్ డిజైన్‌లు), స్పెట్స్ (ఇటలియన్ బ్రాండ్), షూస్, వాచ్ (స్విస్), పెర్ఫ్యూమ్ (స్ప్రేలు - అన్నీ విదేశీలు. తినే ఆహారం (ఇంటర్నేషనల్ బ్రాండ్స్), తాగే పానీయాలు (కోక్, పెప్సీలా, వాటర్), వాడే వాహనాలు (బోయింగ్ జెట్‌లు, మెర్సిడెస్ బెంజ్ కార్లు, ఇతర విదేశీ కంపెనీలకు చెందిన 60 కార్లు) కూడా ఫారిన్. భారత్‌లో కాకుండా విదేశీ పర్యటలు (గత ఏడాది 50o దేశాలు) ఎక్కువగా ఉన్నాయి. ఇప్పుడు ట్రంప్ భారతీయులను అమెరికా ఉద్యోగాల నుంచి తొలగించి, ఇక్కడికి పంపితే ఆ కోపంతో 'స్వదేశీ' మంత్రం జ్ఞాపకం వచ్చిందా!? అందుకే ఈ హిత బోధలు చెస్తున్నారా? ఇది కేవలం ఆయనకు ఆచరణ లో అనుభవం లేని విషయాలను మాత్రమే ప్రజలకు చెబుతున్నారా? అనే సందేహాలు సాధారణ ప్రజలకు కలుగుతున్నాయి. ఎందుకంటే పేదలు, సాధారణ, దిగువ మధ్యతరగతి ప్రజలు ఎలాగూ... అత్యంత ఖరీదైన విలాసవంతమైన వస్తువులు కొనలేరు. విమానాలు ఎక్కలేరు. వ్యాపార ప్రకటన వల్ల ఎంత గాఢమైన కోరికలు వారికి కలిగినా... బలవంతంగా ఆ కోర్కెలు తీర్చుకొనే ఆదాయం కూడా వాళ్ళకు ఉండదు. మన దేశంలో నూటికి 90 శాతం ప్రజలు ఉప్పు, పప్పు, వంట నూనె, కూరగాయలు, గ్యాస్,మందులు, ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం మొదలైనవి అందుబాటు ధరల్లో దొరికితే చాలు అనుకునే పేదలు,దిగువ మధ్యతరగతి వారే అధిక సంఖ్యలో ఉన్నారు. వారికి మేలు జరుగుతే చాలు గత 8 ఏళ్ళుగా జీ.ఎస్.టీ. సామాన్య ప్రజలు మీ ఆర్థిక, పరిపాలనా గానుగలో నలిగి పోయారు. ప్రజల రక్త, మాంసాలు వివిధ ట్యాక్స్ ల రూపంలో పిండి... అదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ కంపెనీల ఓనర్లకే సకలం సమకూర్చి తరించి పోయారు.మీ... జీ.ఎస్.టీ. తో రాష్ట్రాల ఆదాయాన్ని నిలువు దోపిడి చేసి మీ గవర్నర్ల పాలనా కిరికిరీలతో రాష్ట్ర ప్రభుత్వాలను భ్రష్టు పట్టించారు. ఇప్పుడు మీ అనుంగు మిత్రుడు ట్రంప్ దయవల్ల మీకు ఇంతకాలానికి స్వదేశీ వస్తువులను మాత్రమే వాడాలి అనే సోయి ప్రధాన మంత్రి మోదీకి, దేశ ఆర్థిక మంత్రి, నిర్మలా సీతారామన్ కి జ్ఞానోదయం కలిగించినందుకు భారత ప్రజలు ట్రంప్ కు కృతజ్ఞతలు చెప్పాలి.

బహుశా...ఇంత కాలానికి మోదీ స్వదేశీ పిలుపు వ్యూహాత్మకంగా సరైనది. ట్రంప్ టారిఫ్‌లతో భారత్ ఎగుమతులు (ముఖ్యంగా ఐటీ, ఫార్మా) ఎగుమతులు 20-30 శాతం తగ్గిపోవచ్చు. హెచ్-1బీ వీసా ఫీజు ఐటీ సంస్థల మార్జిన్‌లు దెబ్బతీస్తాయి. స్వదేశీ ప్రచారం ద్వారా భారతీయ కంపెనీలు (జోహో, పేటీఎం) పెరిగి, ఉద్యోగాలు సృష్టించవచ్చు. కానీ,మన దేశ ప్రధాని నాయకత్వ వ్యక్తి గత జీవితం ప్రజలకు ఉదాహరణగా, మార్గదర్శకంగా ఉండాలి కదా!!. మోదీ తన జీవనశైలిని మార్చుకోకపోతే, ఇది కేవలం "డొల్ల" మాటలుగానే మిగిలిపోతాయి.

గాంధీజీ " స్వదేశీ" విధానంలో తాను స్వయంగా నూలు వడికారు. నేత ఖద్దరు దుస్తులు జీవితాంతం తయారు చేసుకుని ధరించారు. ఆయన ప్రజలకు ఏమి చెప్పారో ...అంతకంటే ముందు స్వయంగా ఆచరించి, ఆ తర్వాత నే ఇతరులకు బోధించే వారు. అందుకే, ఆయన మాటలకు...చేతలకు మధ్య వైరుధ్యాలు ఉండేవి కావు. అది నిజమైన ప్రేరణ. ఇప్పుడు, ప్రభుత్వం ఫారిన్ లగ్జరీ బ్రాండ్స్‌పై ట్యాక్స్ పెంచి, స్వదేశీ పరిశ్రమలకు సబ్సిడీలు ఇస్తే మంచిది. లేకపోతే, ఇది కేవలం ఒక రాజకీయ నినాదంగా మిగిలి పోతుంది. ప్రజలకు విదేశీ వస్తువులు మన దేశీయ మార్కెట్లో, అంగళ్ళలో అందుబాటులో లేకుండా ప్రభుత్వం చేయగలిగితే బాగుంటుంది. అప్పుడే విదేశీ వస్తువుల పై వ్యామోహం కలగకుండా కొంత మేరకు అయినా కోర్కెలు అదుపులో పెట్టుకొనేందుకు అలవాటు పడే అవకాశం ఉంటుంది. మన దేశంలో మీడియా, ఇంటర్నెట్ ద్వారా, విదేశీ వస్తువుల వ్యాపారం జరగకుండా చూడాలి. వ్యాపార ప్రకటనలు నిలుపుదల చేయాలి.మరి మన మోదీ ఆ పని చేయగలరా? మన మహాత్మాగాంధీ వలే స్వయంగా స్వదేశీ వస్తువులను మాత్రమే వాడి, పరోక్షంగా విదేశీ వస్తువుల బహిష్కరణలకు తోడ్పాటు అందించి , ప్రజలకు స్ఫూర్తిని ఇచ్చే పని చేయగలరా? వేచి చూద్దాం ఏం జరుగుతుందో.

**మోదీ, "స్వదేశీ" పిలుపు మేరకు మీడియా, విపక్షాల ప్రతిస్పందన:**

భారతదేశంలో మీడియా స్పందన మిశ్రమంగా ఉంది. సానుకూలంగా, న్యూస్18లోని ఒక ఆర్టికల్‌లో రచయిత అభిజిత్ మజుందర్, మోదీ స్వదేశీ పిలుపును 'వ్యూహాత్మక ప్రతిస్పందన'గా చెప్పారు. ట్రంప్ టారిఫ్‌లకు భారత్ స్వదేశీతో సమాధానం ఇస్తోందని, ఇది ఆర్థిక స్వాతంత్ర్యానికి దారితీస్తుందని అన్నారు. హిందుస్తాన్ టైమ్స్‌లోని ఒక ఆర్టికల్, జీ.ఎస్.టీ. సంస్కరణలను స్వదేశీతో జోడించి, 'బచత్ ఉత్సవ్'ను సానుకూలంగా చూపింది. మంత్రి అశ్వినీ వైష్ణవ్ జోహొకు మారి, "అందరూ స్వదేశీలో చేరండి" అని ట్వీట్ చేశారు, ఇది (ఎన్.డీ.టీ.వీ. ) లో వచ్చింది.

అయితే, విమర్శలు కూడా ఎక్కువగానే కన్పించాయి. టైమ్స్ ఆఫ్ ఇండియాలోని ఒక ఆర్టికల్‌లో "ఆప్" నేత అరవింద్ కేజ్రీవాల్, "మీరు విదేశీ జెట్‌లో తిరుగుతూ స్వదేశీ మాట్లాడతారా?" అని ప్రశ్నించారు."ఆప్ "ఎంపీ సంజయ్ సింగ్, మోదీ ఇటలీ గ్లాసెస్, స్విస్ వాచ్, అమెరికన్ ఫోన్ ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. ఎకనామిక్ టైమ్స్‌లో కూడా ఈ విమర్శలను హైలైట్ చేశారు. శివసేన (యూ.బీ.టీ.) నేత సంజయ్ రౌత్, మోదీ ప్రసంగం 'ఇండియా వర్సెస్ పాక్ మ్యాచ్' సమయంలో జరిగిందని విమర్శించారు. ది హిందూ ఆర్టికల్‌లో కాంగ్రెస్, "ఆప్" నేతలు, మోదీ 'ట్రంప్ స్నేహితుడు' అయినప్పటికీ మోదీ నుండి బలమైన ప్రతీ స్పందన లేకపోవడాన్ని తప్పుపట్టారు.

డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్. 9849328496.

## తెలంగాణ సంస్కృతికి సంప్రదాయాలకు నిలువెత్తు రూపం, నిలువెత్తు నిదర్శనం.. తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాలను ప్రతిబింబిం మన బతుకమ్మ పండుగ వాతావరణం.. బతుకమ్మ కవిత రచనలు..

### బతుకమ్మ పాట సంబరాల పూట!!

బతుకమ్మ పండుగ ఉయ్యాలో
మన తెలంగాణలో ఉయ్యాలో
వాడ వాడ లోన ఉయ్యాలో
పల్లె పల్లె లోన ఉయ్యాలో
పూలన్ని జమ చేసి ఉయ్యాలో
బతుకమ్మ పేర్చేము ఉయ్యాలో
ముదితలంతా గూడి ఉయ్యాలో
ముద్దు ముద్దుగా నడిచి ఉయ్యాలో
ఊరి కోవెల చేరి ఉయ్యాలో
ఉయ్యాల పాటలు ఉయ్యాలో
పాడుతూ ఆడేరు ఉయ్యాలో
పెత్రామాస మొదలు ఉయ్యాలో
సద్దుల బతుకమ్మ దాక ఉయ్యాలో
నవరాత్రి దినములు ఉయ్యాలో
పండుగే అతివలకు ఉయ్యాలో
తీరొక్క సద్దులతో ఉయ్యాలో
నైవేద్యమే పెట్టి ఉయ్యాలో
పసుపుతో గౌరమ్మ ఉయ్యాలో
బతుకమ్మలో పెట్టి ఉయ్యాలో
ఆఖరి దినమున ఉయ్యాలో
నీళ్లల్ల విడిచేరు ఉయ్యాలో
పోయిరా బతుకమ్మ ఉయ్యాలో
పోయిరా అంటూనే ఉయ్యాలో
పసుపు గౌరమ్మను ఉయ్యాలో
ముత్తైదువలకు పంచి ఉయ్యాలో
మహాలక్ష్మిలా తిరిగే ఉయ్యాలో
మగువలంతా కలిసి ఉయ్యాలో
మన తెలంగాణలో ఉయ్యాలో
బతుకమ్మ పండుగ ఉయ్యాలో
బహు బాగా జరిగేను ఉయ్యాలో

**బతుకమ్మ పాట!!!**

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో
నా తెలంగాణ లోన ఉయ్యాలో
పల్లె పల్లె లోన ఉయ్యాలో
పడుతులంతా గూడి ఉయ్యాలో
ఆడేరు బతుకమ్మ ఉయ్యాలో
పాటలెన్నో పాడి ఉయ్యాలో
పిల్ల పెద్దలంతా ఉయ్యాలో
పూలన్ని కలబోసి ఉయ్యాలో
బతుకమ్మ కే పూవు ఉయ్యాలో
పనికి రాదు అనరు ఉయ్యాలో
అన్ని రంగుల పూలు ఉయ్యాలో
ఆమెకే సొంతము ఉయ్యాలో
కాకతీయుల నాటి ఉయ్యాలో
వాగులు,
చెరువులు ఉయ్యాలో పూడికలు
తీయించే ఉయ్యాలో
పాడి పంటల తోటి ఉయ్యాలో
పల్లెలు పచ్చంగా ఉయ్యాలో
నీటి లోని కలువ ఉయ్యాలో
నిలువెల్లా పులకించే
ఉయ్యాలో
స్వంత ఇల్లు చూసి
ఉయ్యాలో
అన్నదాత కంట్ల
ఉయ్యాలో
నీళ్లు
రావద్దంటూ ఉయ్యాలో
మెరుగైన వ్యవసాయం ఉయ్యాలో
తెలంగాణ ఐతే ఉయ్యాలో
ప్రథమంగా ఉండాలె ఉయ్యాలో
పిల్లల చదువులు ఉయ్యాలో
చక్కంగా సాగాలే ఉయ్యాలో
ఇంగ్లీషు చదువులు ఉయ్యాలో
చదువుకున్న గాని ఉయ్యాలో
తెలుగు భాష మరిచి ఉయ్యాలో
మనమెప్పుడుండదు ఉయ్యాలో
తెలివి తేటలలోన ఉయ్యాలో
తెలంగాణ వాళ్లు ఉయ్యాలో
మేధావులని చెప్పి ఉయ్యాలో
దేశమే పొగడాలే ఉయ్యాలో!!

**బతుకమ్మ పాట!!!**

నాగేటి సాల్లల్ల ఉయ్యాలో..
సీతమ్మా పుట్టింది ఉయ్యాలో..
జనకమారాజింట ఉయ్యాలో..
పెరిగింది సీతమ్మ ఉయ్యాలో..
పెరిగినా సీతమ్మ ఉయ్యాలో..
పెల్లిళ్లు గోరింది ఉయ్యాలో..
ఏడిండ్ల సందునా ఉయ్యాలో..
ఎలబద్రి చెట్టుంది ఉయ్యాలో..
ఆ ఎలబద్రి చెట్టుకూ ఉయ్యాలో..
ఏడే మొగ్గలూ ఉయ్యాలో..
ఏడు మొగ్గల పత్తి ఉయ్యాలో..
తక్కెడూ అయ్యింది ఉయ్యాలో..
ఆ తక్కెడూ పత్తికీ ఉయ్యాలో..
వొక్కటే ఏకుంది ఉయ్యాలో..
ముసలోళ్లు వడికిరీ ఉయ్యాలో..
ముత్యాల పోగు ఉయ్యాలో..
పడుసోళ్లు వడికిరీ ఉయ్యాలో..
పగడాల పోగు ఉయ్యాలో..
ఆ పోగు ఈ పోగు ఉయ్యాలో..
కలె పడుగు జుట్టిందీ ఉయ్యాలో..
చింతకింది శాలయ్య ఉయ్యాలో..
చీరె నెయ్యవయ్య ఉయ్యాలో..
నేసెనే శాలయ్య ఉయ్యాలో..
నెలకొక్క గజమునూ ఉయ్యాలో..
అంచుకు ఏసింద్రు ఉయ్యాలో..
అర్ధనాల పోగు ఉయ్యాలో..
కొంగుకూ ఏసింద్రు ఉయ్యాలో..
బంగారు ఆ పోగు ఉయ్యాలో..
ఆ సీర నైతేనే ఉయ్యాలో..
సీతమ్మా మెచ్చెనే ఉయ్యాలో..
సీతమ్మా మెచ్చిన సీర ఉయ్యాలో..
సీతమ్మా కట్టిందే ఉయ్యాలో..!!

రైటర్ రాజు
(యువ కవి - అరుణ రైటింగ్స్)
తెలంగాణ యూనివర్సిటీ, నిజామాబాద్.



# బతుకమ్మ అంటే - మహిళల బతుకు కోరే పండుగ

స్వేచ్ఛా భావన - గాంధీ చెప్పిన మాటలు..దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని గర్వంగా చెప్పు కుంటున్నాం. కానీ నిజమైన స్వేచ్ఛ ఏమిటి అన్న ప్రశ్నకు సమాధానాన్ని గాంధీజీ అప్పుడే చెప్పారు - "మహిళలు అర్ధరాత్రి సురక్షితంగా నడవగలిగిన రోజే నిజమైన స్వాతంత్ర్యం".నేటి పరిస్థితి చూస్తే, ఇంకా ఆ స్వేచ్ఛ మనకు దూరంగానే ఉందని అంగీకరించక తప్పదు. భద్రత లేకుండా పెద్దలు, పిల్లలు, ముఖ్యంగా మహిళలు వీధిలో నిర్భయంగా తిరగలేని స్థితి మన సమాజానికి చేదు వాస్తవం.

**పండుగల వెనుక సమాజ పాఠం**

మన సంస్కృతిలో పండుగలు కేవలం ఉత్సవం కాదు - అవి విలువలు గుర్తుచేసే సందర్భాలు. బతుకమ్మ, దసరా పండుగలు ఒకవైపు, గాంధీ జయంతి మరోవైపు వస్తున్నాయి.బతుకమ్మ అంటే మహిళల బతుకు కోరే పండుగ. పూలను సమర్పించే ఆచారంలో మనం స్త్రీ శక్తిని గుర్తించాలి. పువ్వు రేపటి అడవికి విత్తనం ఇస్తే, స్త్రీ భావితరాలను మోస్తుంది. అలాంటి స్త్రీల గౌరవం, రక్షణ సమాజం అందించకపోతే ఈ పండుగల అర్థమే ఏమిటి?

**స్త్రీ శక్తి అమోఘం. .**

ప్రపంచంలో పదునైన ఆయుధం స్త్రీ గొంతుక. దాన్ని మూయించాలని కాకుండా, వినిపించుకోవాలని మనం అంగీకరించాలి. సామాజిక వివక్ష నుంచి బయటపడాలంటే మహిళలు ధైర్యంగా మాట్లాడటం అలవర్చుకోవాలి. అయితే వాస్తవం ఏమిటి? - కుటుంబం కోసం సర్వస్వం ధారపోసే స్త్రీలు, తమ అవసరాలు, తమ ఆరోగ్యంపై మాత్రం మౌనం వహిస్తున్నారు.

ఆరోగ్య సమస్యలు - ఆందోళన కలిగించే వాస్తవాలు స్త్రీల ఆరోగ్యం నేడు



అత్యంత ఆందోళనకరమైన పరిస్థితిలో ఉంది.5వ జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం 15-49 ఏళ్ల మహిళల్లో 57% రక్తహీనతతో బాధపడుతున్నారు.తల్లులలో ఎనీమియా ఉంటే పుట్టబోయే శిశువుల ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం చూపుతుందని పరిశోధనలు చెబుతున్నాయి.అదేవిధంగా హైబీపీ, మధుమేహం, ముందస్తు మెనోపాజ్, గుండె జబ్బులు, ఎముకల బలహీనత, PCOS, మానసిక ఒత్తిడి వంటి సమస్యలు పెరుగుతున్నాయి.

రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వేగంగా వ్యాపిస్తున్నాయి. మహిళల్లో గుండెపోటు లక్షణాలు భిన్నంగా ఉండడం వల్ల నిర్ధారణలో ఆలస్యం జరుగుతుందని వైద్య అధ్యయనాలు వెల్లడించాయి. పౌష్టికాహారం లోపం, జీవనశైలిలో మార్పులు, పర్యావరణ ప్రభావం - ఇవన్నీ కలిసి పరిస్థితిని మరింత సంక్లిష్టం చేస్తున్నాయి.

ప్రభుత్వ ప్రయత్నాలు - అమలు అవసరం ఈ నేపథ్యంలో కేంద్రం ప్రారంభించిన స్వస్థ నారీ - సశక్తి పరివార్ అభియాన్ ఒక ముఖ్యమైన అడుగు. లక్షల సంఖ్యలో వైద్య శిబిరాల ద్వారా ఆరోగ్య పరీక్షలు, ఉచిత మందులు అందించడానికి సంకల్పించారు. కానీ ఈ కార్యక్రమం కేవలం పత్రాలకే పరిమితం కాకుండా, గ్రామీణ ప్రాంతాల వరకు చేరేలా రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలి. సంచార వైద్యాలయాలు, గ్రామ స్థాయి ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేయడం తప్పనిసరి. సామాజిక వివక్ష - ఇంకా తీరని సమస్య ఆరోగ్యంతో పాటు మరో పెద్ద సమస్య - పితృస్వామ్య భావజాలం. నేటికీ అనేక కుటుంబాల్లో స్త్రీల పట్ల వివక్ష కొనసాగు తోంది.విద్య, ఉపాధి, ఆర్థిక స్వావలంబనలో వెనుకబాటు గృహ హింస, వేధింపులు, భద్రత సమస్యలు నిర్ణయాధికారంలో భాగస్వామ్యం లేకపో వడం ఇవన్నీ స్త్రీ-పురుష సమానత్వాన్ని దూరం చేస్తున్నాయి. బతుకమ్మ సందేశం - నేటి అవసరం..బతుకమ్మ పండుగలో పూలను సమర్పించడం, స్త్రీ శక్తిని గౌరవించడం ఒక సంకేతం. కానీ ఈ సంకేతాన్ని ఆచరణలో పెట్టకపోతే పండుగల విలువ ఏమిటి? నేటి మహిళలు స్వేచ్ఛ కోసం, సమానత్వం కోసం, ఆర్థిక స్వావలంబన కోసం పోరాడుతున్నారు.అడగడం అజ్ఞానం కాదు-అడగడం జ్ఞానం, సమాధానం ఇవ్వడం గొప్పతనం. స్త్రీలు సాహసించి అడిగినప్పుడే సమాజం మారుతుంది.

స్త్రీ చైతన్యం, ఆరోగ్యం, సమానత్వం - ఇవే జాతికి మహాభాగ్యం.ఈ బతుకమ్మ సందర్భంగా, ప్రతి స్త్రీ బతుకు, భద్రత, గౌరవం కోసం మనం కోరుకుందాం. పండుగల్లో పూలను పూజించడమే కాకుండా, పువ్వుల్లాంటి స్త్రీలను నిజంగా గౌరవించే సమాజాన్ని నిర్మిద్దాం.



మేకిరి దామోదర్
సామాజిక విశ్లేషకులు
వరంగల్ 9573666650

# కోట్లు విలువ చేసే పార్క్ స్థలం కబ్జా

- తనకు స్థలం దక్కలేదన్న అక్కసుతో కోర్టును ఆశ్రయిస్తోన్న ప్రతాప్ సింగ్

**బోడుప్పల్, సెప్టెంబర్ 24 (జనంసాక్షి) :** కోట్లు విలువచేసే పార్కు కబ్జాను అడ్డుకోవాలని కమిషనర్కు వినతి పత్రం ఇచ్చారు. పూర్తి వివరాల్లోకి వెళితే,,, పీర్జాదికూడా మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఓం విహార్ కాలనీలో సుమారు 700 గజాల స్థలాన్ని పార్కు పక్కనే నివసిస్తున్న ప్రతాప్ సింగ్ కబ్జా చేయాలని ప్రయత్నిస్తున్నాడని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు గుండెబోయిన అయోధ్య యాదవ్, బుచ్చిరెడ్డి, మాట్లాడుతూ 2018లో ఏర్పాటు చేసుకున్న కమిటీలో తాను అధ్యక్షునిగా కొనసాగుతూ ఇప్పటివరకు కమిటీ నిబంధనల ప్రకారం ఎలాంటి నిబంధనలు పాటించకుండా, కమిటీ సభ్యులను సంప్రదించకుండా తానే అధ్యక్షున్ని అంటూ కాలనీవాసులను భయభ్రాంతులకు గురిచేస్తూ ఉన్నాడు. గతంలో ఇదే కాలనీ పార్కు స్థలాన్ని కాపాడాలని అతనే మున్సిపల్ అధికారులకు వినతి పత్రం ఇచ్చి. ఇప్పుడు తానే కబ్జా చేయాలని ప్రయత్నిస్తున్నాడు, పారుకు స్థలం తనకు దక్కకపోవడంతో కోర్టులను ఆశ్రయిస్తున్నాడని మండిపడ్డారు. ఓం విహార్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్గా ఉన్న కమిటీని రద్దుచేసి తాము కాలనీవాసుల అందరి సమక్షంలో నూతన కమిటీ ఓం విహార్ వెల్ఫేర్ అసోసియేషన్ గా ఏర్పాటు చేసుకోవడం జరిగింది. పాత కమిటీ సభ్యులు కమిటీ రద్దు అయ్యింది అని కమీషనర్కు ఫిర్యాదు కూడా చేశారు. పార్కు కబ్జా అడ్డుకుంటున్న కాలనీలోని కొంతమంది సభ్యులను కులం పేరుతో దూషించడం, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో స్థానిక మేడిపల్లి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడం జరిగింది. దానికి స్పందించి నేను మీపై వేసిన హైకోర్టులో ఉన్న కేసును వాపసు తీసుకుంటాను, మీరు నాపై పెట్టిన కేసును వెనక్కి తీసుకోవాలని ఒప్పంద పత్రాన్ని కూడా రాసుకున్నాడు. అయినా ప్రేమ్ సింగ్ ప్రవర్తనలో మార్పు రాకుండా కాలనీ ప్రజలను అనేక విధాలుగా ఇబ్బంది పెడుతూ ఉన్నాడు. దీనిపైన అధికారులు దృష్టి సారించి అతనిపై న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కృష్ణారెడ్డి, సంగారెడ్డి, వీరారెడ్డి, బిక్షపతి గౌడ్, కొండలరావు, శ్రీనాథ్ గౌడు, నరసింహమూర్తి, కాలనీవాసులు పాల్గొన్నారు.



# వరి ధాన్యం సేకరణకు అధికార యంత్రాంగం సంసిద్ధులు కావాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్




**మెదక్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 24 (జనం సాక్షి) :** 2025-26 ఖరీఫ్ వరి ధాన్యం సేకరణకు అధికార యంత్రాంగం సంసిద్ధులు అవ్వాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. అక్టోబర్ మొదటి వారం నుంచి ఖరీఫ్ వరి ధాన్యాన్ని సేకరించుటకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ ప్రజావాణి హాల్లో 2025- 26 ఖరీఫ్ వరి ధాన్య సేకరణ సన్నద్ధతపై జిల్లా సేకరణ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ధాన్యం కొనుగోలులో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పటిష్ట ప్రణాళిక ద్వారా కొనుగోలు ప్రక్రియ జిల్లాలో కొనసాగేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. గ్రేడ్ ఏ రకానికి క్వింటాకు 2,389 రూపాయలను, సాధారణ రకానికి క్వింటాకు 2,369 రూపాయలను కనీస మద్దతు ధరగా నిర్ణయించినట్లు చెప్పారు.. వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం ఖరీఫ్ లో 04 లక్షల 23 వేల మెట్రిక్ టన్నుల వరి ఉత్పత్తి కానుందని చెప్పారు. మిల్లులు సిద్ధంగా ఉన్నాయని సర్టిఫికెట్ తీసుకోవాలన్నారు. మిల్లుల టాగింగ్, తనిఖీ పై దృష్టి సారించాలన్నారు. ధాన్యం తరలించే వాహనాలన్నిటికీ జిపిఎస్ తప్పనిసరిగా ఉండాలన్నారు. ధాన్యం తరలించే విషయంలో లారీల కొరత లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. గోదాముల కొరత లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. గత సీజన్లో మిల్లులకు 5,67,841 మెట్రిక్ టన్నుల ధాన్యం చేరగా, 3,82,502 మెట్రిక్ టన్నుల సీ ఏం ఆర్ బియ్యం మాత్రమే వారి నుంచి వచ్చిందని, ఇంకా 1,58,497 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యం రావాల్సి ఉందని దీనిని త్వరితగతిన రికవరీ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్,ఏడి అగ్రికల్చర్ దేవ్ కుమార్, లీగల్ మెట్రాలజీ అధికారి, సుధాకర్ రవాణా శాఖ అధికారి, వెంకన్న కో-ఆపరేటివ్ అధికారి కరుణాకర్, జిల్లా పౌర సరఫరాల అధికారి, నిత్యానంద్, డిఎం సివిల్ సప్లై జగదీష్, అడిషనల్ డిఆర్డిఓ, సరస్వతి మెదక్ డిఎస్పి ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వికారాబాద్ మున్సిపల్లో డ్రైనేజీ సమస్య పరిష్కరించాలి

- లేని పక్షంలో మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం
- వికారాబాద్ బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుభాన్ రెడ్డి



**వికారాబాద్, సెప్టెంబర్ 24 (జనంసాక్షి) :** వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని మెజారిటీ వార్డులలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బిఆర్ఎస్ పార్టీ వికారాబాద్ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ సుభాన్ రెడ్డి ప్రజలు పడుతున్న అవస్థలను చూసి ఆవేదన వ్యక్తం చేశారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు నెలలుగా వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలో డ్రైనేజీ వ్యవస్థ రోడ్లపై పొంగి పొర్లుతూ విలయతాండవం చేస్తుందని, వర్షాలు కారణంగా సమస్య తీవ్రత మరింత పెరిగిపోయిందని, ప్రదానంగా పట్టణంలోని ఆర్ఎస్ఎస్ కార్యాలయం గుట్ట నుండి బిటిఎస్ కాలనిలో మురుగు రోడ్లపై ప్రవహిస్తుండటంతో మున్సిపల్ అధికారులకు సమాచారం అందించి సమస్యకు పరిష్కరించాలని కోరగా వాహనాల కొరత ఉందంటూ తదితర పొంతనలేని నిర్లక్ష్యపు సమాదానాలు రావడం సరైన పద్ధతి కాదని, అధికారులు ప్రజాప్రతినిధుల కళ్లకు వికారాబాద్ ప్రజల సమస్యలు కనిపించడం లేదా అంటూ.. పట్టణ ప్రజలను ప్రధానమైన మేజర్ సమస్యల పట్ల స్పందించి పరిష్కారం చేయని క్రమంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముట్టడిస్తామన్నారు.

# జీవో నెంబర్ 68 వెంటనే రద్దు చేయాలి



**యాచారం, సెప్టెంబర్ 24 (జనం సాక్షి) :** జీవో నెంబర్ 60 వెంటనే రద్దు చేయాలని మత్స్య కార్మికుల సంఘం యాచారం మండలం అధ్యక్షుడు నీలం శ్రీకాంత్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జీవో 60ని వెంటనే రద్దు చేయాలని, ఎన్నికల ద్వారా పర్సనల్ ఇన్చార్జిల నియామకాన్ని జరపాలని తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా మత్స్య శాఖ అధికారులును కలిసి వినతి పత్రం అందచేసినట్లు తెలిపారు. 200 మత్స్య సహకార సంఘాలు జిల్లా లో ఉన్నాయని, సెప్టెంబర్ నెల గడిచి, చెరువులు అలుగు వెళ్తున్న ఉచిత చేప పిల్లల పంపిణీ జరగలేదని, ప్రభుత్వం టెండర్ల పేరుతో కాలయాపన చేస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మంచాల మండల మత్స్య కార్మికుల సంఘం అధ్యక్షుడు తలారి సతీష్ చంద్ర, కందుకూరు అధ్యక్షుడు పులగజుల లింగం, ప్రధాన కార్యదర్శి ఉదయ్, పులగజుల పాండు, ఎఫ్ సీ ఎస్ నేదునూర్ అధ్యక్షుడు లక్ష్మణ్, మిరఖాన్ పేట్ రాములు, తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ సంఘం నాయకులు అభివృద్ధిలో పాలుపంచుకోవాలి



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 24 (జనం సాక్షి) :** సంక్షేమ సంఘం నాయకులు కాలనీల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ అన్నారు. బుధవారం కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని గణేష్ నగర్ లో నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు కాలనీలో నెలకొన్న పలు మౌలిక సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన గణేష్ నగర్ కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. గణేష్ నగర్ లో నెలకొన్న మౌలిక సమస్యల పరిష్కారం కోసం వెంటనే పనులను ప్రారంభించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక సమస్యలను అభివృద్ధి పరచాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఉప కమిషనర్ నరసింహ, ఈ ఈ లక్ష్మీ గణేష్, వాటర్ వర్క్స్ మేనేజర్ రవి, ఎలక్ట్రికల్ ఏఈ రవీందర్, వివిధ విభాగాల అధికారులు, గణేష్ నగర్ కాలనీ అధ్యక్షులు శరత్ కుమార్ గౌడ్, అడ్వైజర్ వెంకటయ్య, కృష్ణారెడ్డి, చంద్రశేఖర్ గుప్తా, బాలకృష్ణ, కుమారస్వామి, సంజీవరెడ్డి, రాజేందర్, సాయి రెడ్డి, సత్యనారాయణ చారి, ప్రవీణ్ కుమార్ చారి, వైస్ ప్రెసిడెంట్ సోమేశ్ పటేల్, రామకృష్ణ పటేల్, శ్యాంసుందర్రావు, నరసింహులు, అశోక్ యాదవ్, సాయికుమార్, శ్రీనివాస్ పటేల్, స్థానిక నాయకుడు తదితరులు పాల్గొన్నారు.

# రైతులు పంటల వివరాలు త్వరితగతిన నమోదు చేసుకోవాలి

- జిల్లా వ్యవసాయ అధికారి రాజరత్నం

**కొడంగల్, సెప్టెంబర్ 24 (జనం సాక్షి) :** కొడంగల్ మండలంలోని రుద్రారం గ్రామంలో నిర్వహించిన పంటల నమోదు కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయ అధికారి రాజ రత్నం పర్యవేక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని రైతులు తమ పంటల వివరాలను అక్టోబర్ 31, 2025 లోగా తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు.రైతులు వేసిన పత్తి, మొక్కజొన్న, పెసలు వంటి పంటల వివరాలను గ్రామాల వారీగా, సర్వే నంబరు వారీగా నమోదు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు.ప్రభుత్వ పథకాల అమలులో కీలకంగా నిలుస్తుందని, పంటల కొనుగోలు, పంట నష్టం పరిహారాలు, రైతు భరోసా వంటి పథకాలు ఈ నమోదు ఆధారంగానే అమలవుతాయని ఆయన వివరించారు.అనంతరం పొలంలో పత్తి పంటను పరిశీలించారు. రైతులకు పలు సుచనలు చేశారు.రైతులు తమ గ్రామాల వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి, తమ పంటల వివరాలను త్వరితగతిన నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి రాజ రత్నం తోపాటు ఏవో,జి. తులసి, ఏఈఓ శ్రీపతి రెడ్డి, రైతులు వెంకటయ్య, మొయినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

- అల్లాదుర్గం సీఐ రేణుక రెడ్డి



**అల్లాదుర్గం, సెప్టెంబర్ 24 (జనంసాక్షి) :** విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని, సిఐ రేణుక రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, క్రమశిక్షణ తో కూడిన విద్య జీవితంలో ఉన్నత స్థాయికి చేరుస్తుందని అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ,ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ప్రెషర్ డే పార్టీ ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఎంచుకొని దానిని నిజం చేసుకోవడానికి చదువుకోవాలని సూచించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ సత్తయ్య మాట్లాడుతూ విద్యార్థులు ఇంటర్మీడియట్ లో క్రమశిక్షణతో కూడిన చదువును అలవర్చుకోవాలని, మంచి నడవడి తో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై శంకర్, మాజీ జెడ్పిటిసి మమతా బ్రహ్మం, మాజీ సర్పంచ్ రాణి నర్సింలు, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ పవిత్ర నాగరాజు, కళాశాల అధ్యాపకులు తుకారం, రవికుమార్ ,రవీందర్, శ్యామ్ రావు, నర్సింహారెడ్డి, శివకుమార్, స్రవంతి, శంకర్, ప్రవీణ్ కుమార్ తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# లంబాడీల ఆత్మగౌరవ శాంతి ర్యాలీని విజయవంతం చేయండి



**నారాయణపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 24 (జనం సాక్షి) :** నారాయణపేట జిల్లా కేంద్రంలో సెప్టెంబర్ 29న నిర్వహించ తలపెట్టిన లంబాడీల ఆత్మగౌరవ శాంతి ర్యాలీని విజయవంతం చేయాలని బంజారా నాయకులు కోరారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని ప్రెస్క్లబ్లో లంబాడీల ఆత్మగౌరవ శాంతి ర్యాలీ కి సంబంధించిన గోడపత్రికలను బంజారా నాయకులు, విద్యార్థులతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించే కుట్ర జరుగుతుందని... ఇది లంబాడీల హక్కులకు పూర్తిగా విరుద్ధమన్నారు. ఆర్థికంగా రాజకీయంగా వెనకబడిన లంబాడీలు అన్ని రంగాల్లో రాణించాలంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు లంబాడీల సంక్షేమం కోసం మరికొన్ని చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లంబాడీల ఆత్మగౌరవం దెబ్బతీసేలా కుట్ర జరిగితే సహించేది లేదని... తమ హక్కుల సాధన కోసం పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామన్నారు. లంబాడీల ఆత్మగౌరవ శాంతి ర్యాలీని నారాయణపేట జిల్లాలోని గిరిజనులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బంజారా నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జీహెచ్ఎంసీ కమిషనర్ను కలిసిన ఉప్పల్ ఎమ్మెల్యే



**ఉప్పల్, సెప్టెంబర్ 24 (జనం సాక్షి) :** జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్ ఐఏఎస్ ని తన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శ్రీ నగర్, కృష్ణారెడ్డి నగర్లో 550 మీటర్ల స్టార్మ్ వాటర్ డ్రైన్ నీ ఏర్పాటు చేయాలని కోరారు. వెంటనే సానుకూలంగా స్పందించిన జిహెచ్ఎంసి కమిషనర్ 2 కోట్ల 85 లక్షల రూపాయ లు మంజూరు చేసారు. సాయి నగర్ ఆర్చ్ నుండి టి ఎఫ్ ఐ ఆర్ కాంపౌండ్ వాల్ కృష్ణారెడ్డి నగర్ రోడ్డు నంబర్ 1, రోడ్ నంబర్ 2.ఎస్టిమేషన్ వేయాల్సిందిగా జోనర్ కమిషనర్ ని ఆదేశించగా నేడు అక్కడికి వెళ్ళడం జరిగింది.చర్లపల్లి డివిజన్ పరిధిలో ఎడతెరిపిలేని భారీ వర్షాల కారణంగా కాలనీలు ముంపుకు గురికాకుండా తక్షణ చర్యలు చేపట్టుట గురించి చర్చించడం జరిగింది. అని ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నేమూరి మహేష్ గౌడ్ , సప్పిడి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వం వైఫాల్యాలపై బీఆర్ఎస్ ధర్నా

- కాంగ్రెస్ ఆన్ని రంగాల్లో విఫలం
- మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి

**కృష్ణ, సెప్టెంబర్ 24 (జనం సాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం అన్నిరంగాల్లో విఫలం అయిందని అ వైఫల్యాలకు నిరసనగా బుధవారం కృష్ణ మండలం గుడెబల్లూరు గ్రామ శివారులో టైరోడ్ వద్ద బిఆర్ ఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి, బిఆర్ ఎస్ మండల యువ నాయకుడు గురుజాల్ శివరాజ్ పాటిల్, మాట్లాడుతు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు రెండు ఏళ్ళు అవుతున్న చేసిన అభివృద్ధి శూన్యమని విమర్శించారు.ఇంతవరకు ఆసరా పింఛన్లు 4 వేలకు పెంచలేదని,ప్రతి గృహిణికి 2వేల 5వందలు, వ్యవసాయ కూలీలకు 12 వేల రూపాయలు ఇస్తామని అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందనీ విమర్శించారు. అరకొర ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి అవి కూడా అధికార పార్టీకి చెందిన వాటికే ఇస్తున్నారని ఆరోపించారు. అంతే కాకుండా రైతులకు కనీసం ఎరువులు ఇవ్వలేని చేతకాని ప్రభుత్వమని విమర్శించారు. ఈ ప్రభుత్వానికి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు రాజుల ఆశిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ వెంకట్ రెడ్డి, మాగనూరు మండలం అధ్యక్షులు ఎల్లారెడ్డి, కృష్ణ మండల అధ్యక్షుడు శివరాజ్ పటేల్, అశోక్ గౌడ్, మాజీ సర్పంచ్ శివప్ప, మ్యాకల్ భీమ్, రామకృష్ణ, మాజీ సర్పంచ్ చెవిటోళ్ళ అమ్రేష్, శంకరప్ప, చెవిటోళ్ల సురేష్, బుడ్డ మోళ్ళ మహేష్, తదితరులు పాల్గొన్నారు.



# జాగృతితోనే సామాజిక తెలంగాణ సాధ్యం

**మహేశ్వరం, సెప్టెంబర్ 24 (జనంసాక్షి) :** జాగృతి తోనే సామాజిక తెలంగాణ సాధ్యమవుతుందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. బుధవారం మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కప్పాటి పాండు రంగారెడ్డి,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అందుగుల సత్యనారాయణ, బడంగ్ పేట్ కు చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు బొల్లారం వెంకట్రామ్ రెడ్డి,ఆధ్వర్యంలో కాంగ్రెస్,బీఆర్ఎస్ పార్టీలకు చెందిన 200 మంది కార్యకర్తలు హైదారాబాద్ బంజారాహిల్స్ లోని జాగృతి కార్యాలయంలో కవిత సమక్షంలో జాగృతిలో చేరారు.ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ...జాగృతి బలోపేతం కోసం నాయకులు,కార్యకర్తలు కృషి చేయాలన్నారు.కవిత ఆదేశాల మేరకు సామాజిక తెలంగాణ సాధన కోసం కృషి చేస్తామన్ని నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జాగృతి నాయకులు నవీన్ చారి, కోల శ్రీనివాస్,కంచర్ల శివారెడ్డి,సంపంత్ కుమార్,రవీందర్ ముదిరాజ్, భూషణ్ గౌడ్,జంగయ్య గౌడ్,కిరణ్ కుమార్,యాదగిరి,శ్రీనివాస్, నవీన్ గౌడ్,అమ్రీన్, సుల్తానియా,లావణ్య,వేద భవాని,సభావత్ గణేష్ నాయక్, పలువురు జాగృతి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
25 సెప్టెంబర్ 2025

# సరిహద్దులో ఎలాంటి అక్రమ రవాణాకు అవకాశం ఉండకూడదు

- జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు

**గద్వాల నడిగడ్డ, సెప్టెంబర్ 24 (జనం సాక్షి) :** ఫిర్యాదుదారుల నుండి వచ్చే పాజిటివ్ స్పందనే పోలీస్ పని తీరుకు నిదర్శనంగా నిలుస్తుందని ఆ దిశగా పోలీస్ అధికారులు,సిబ్బంది మరింత బాధ్యత తో విధులు నిర్వహించాలని, సరిహద్దులలో ఎలాంటి అక్రమ రవాణాకు అవకాశం ఉండరాదని ఎస్పీ టి. శ్రీనివాస రావు అధికారులకు, సిబ్బందికి సూచించారు.వార్షిక తనిఖీలలో భాగంగా జిల్లా ఎస్పీ బుధవారం కె.టి.దొడ్డి పోలీసు స్టేషన్ ను సందర్శించి సిబ్బంది యూనిఫామ్ టర్న్ ఔట్, స్టేషన్ రికార్డ్స్, పరిసరాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కె.టి. దొడ్డి పోలీసు వందనం స్వీకరించిన అనంతరం స్టేషన్ పరిసరాల శుభ్రత, సిబ్బంది బ్యారక్స్, స్టేషన్ రికార్డుల మెంటేనేన్స్ ను పరిశీలించారు. సిబ్బంది కిట్ ఆర్టికల్స్ తనిఖీ చేస్తూ, కిట్ ఆర్టికల్స్ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న స్వాధీనం చేసుకున్న, కేసులో ఉన్న వాహనాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ రికార్డులను తనఖీ చేస్తూ ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తును చేయాలని, ఆస్థి సంబంధిత నేరాలకు సంబంధించి,అధిక నేరాలు జరుగుతున్న ప్రాంతాలను బ్లాక్ స్పార్ట్సులుగా గుర్తించి, పగలు, రాత్రి బీట్ డ్యూటీల ద్వారా నిఘా కట్టుదిట్టం చేయాలని సూచించారు. కర్ణాటక సరిహద్దు పోలీస్ స్టేషన్గా ఉన్నందున ఎలాంటి ఇల్లీగల్ రవాణా జరుగకుండా చెక్ పోస్ట్ల దగ్గర పటిష్ట నిఘా ఉండాలని ఎస్సై శ్రీనివాస్‌కు సూచించారు. రిసీప్షన్ సిబ్బంది స్టేషన్ కు వచ్చిన ప్రతి దరఖాస్తును ఆన్లైన్‌లో నమోదు చేయాలని, ఫిర్యాదిదారులతో మర్యాదగా మాట్లాడాలని అన్నారు. విపిఓ అడిగికారులు గ్రామాలపై పూర్తి అవగాహనా ఉండాలని,



రౌడీ షిటర్స్, సస్పెక్ట్‌లపై నిఘా ఉంచాలని, గ్రామాలలో తిరుగుతూ ప్రజలతో మమేకం అవ్వాలని, తద్వారా గ్రామాలలో ఎలాంటి సమాచారం కావాల్లన్న ముందస్తుగా తెలుసుకునేందుకు అవకాశం ఉంటుందని అన్నారు.గ్రామాలలో అనుమానిత వ్యక్తులను పాపిలోన్ డివైస్ ను వినియోగించి, వేలిముద్రాలను చెక్ చేస్తూ పాత నేరస్తులను గుర్తించాలని అన్నారు. నేరాల అదుపులో జరిగిన నేరాలను ఛేదించడంలో ఉపయోగపడే సిసి కెమెరాల ప్రాధాన్యతను ప్రజలకు వివరిస్తూ ప్రజలే స్వచ్ఛందంగా సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని అన్నారు. స్టేషన్ రికార్డులైన పార్ట్ 1 - 5 పెండింగ్ లేకుండా చూడాలని, సిబ్బందికి వర్టికల్ వారీగా విధులను కేటాయించాలని ఎస్.హెచ్.ఓ కు సూచించడం జరిగింది. రోడ్డు ప్రమాదాల నివారణకు, సైబర్ నేరాల నివారణకు వివిధ స్కూల్స్ కళాశాలలు, పని ప్రదేశాలలో కమ్యూనిటీ పోలిసింగ్ ద్వారా అవగాహన కల్పించాలని అన్నారు.విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా ప్రతి రోజు వాహనాల తనిఖీ నిర్వహిస్తూ, ట్రాఫిక్ నియమాలు పాటించని వాహణదారులపై చర్యలు తీసుకోవాలని, అనుమానిత వాహనాలను అదుపులోకి తీసుకోవాలని అన్నారు. బ్లూ కోల్ట్స్ సిబ్బంది ప్రతి పాయింట్‌ను తనిఖీ చేయాలని, డైల్ - 100 కాల్స్ కు త్వరితగతిన స్పందించాలని సూచించారు. మారుతున్న సమాజానికి అనుగుణంగా తెలంగాణ రాష్ట్ర పోలీసుశాఖ అందుబాటులోకి తీసుకువచ్చిన సీసీటీఎన్ఎస్ - 2.0, పిటిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్,టీఎస్-కాప్, హెచ్ఆర్ఎంఎస్, ఈ-సాక్ష్య,టెక్ డాటం, ఐరాడ్ దర్పణ్, సీఈఐఆర్,సైబర్ క్రైమ్ నేరాల నియంత్రణ, సీడీఆర్,సిఇఐఆర్ పోర్టల్, పోర్టబుల్ ఫింగర్ ప్రింట్ డివైస్,బాడీ ఓన్ కెమెరాల వంటి సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లు నేరాల అదుపునకు, జరిగిన నేరాలను ఛేదించడానికి ఉపయోగకరంగా ఉన్నాయని,అన్ని అప్లికేషన్లపై పూర్తి స్థాయిలో పట్టు సాధించి, నేరాల నియంత్రణలో కీలకంగా వ్యవహించాలని సిబ్బందికి సూచించడం జరిగింది, ఇప్పుడు నేర్చుకున్న పని మీ సర్వీస్ మొత్తం ఉపయోగపడుతుందన్నారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ విధి నిర్వాహణలో అంకిత భావంతో పని చేయాలని, ఎవరికీ కేటాయించిన విధులను వారు సక్రమంగా నిర్వర్తించినప్పుడే పోలీసు శాఖకు మంచి పేరు వస్తుందని అన్నారు.డ్యూటీ పరంగా లేదా వ్యకిగతంగా ఎలాంటి సమస్య ఉన్న నేరుగా నా దృష్టికి తీసుకురావొచ్చు అన్నారు. ఒకే చోట పని చేస్తున్నప్పుడు ఫ్రెండ్స్ లాగా కలిసి మెలసి ఉండాలని, పాజిటివ్ ఆలోచనలతో పని చెయ్యాలని అన్నారు. ప్రజలు పోలీస్ యూనిఫామ్‌కు ఎంతో గౌరవం ఇస్తారో అంతే గౌరవం తో బాధ్యతగా విధులు నిర్వహించాలని అన్నారు. విధులను, పర్సనల్ లైఫ్ ను బాలన్స్ చేసుకొని ముందుకెళ్లాలని సూచించారు. ఈ తనిఖీలలో ఎస్పీ వెంబడి డి. ఎస్పీ మొగిలయ్య, గద్వాల సీఐ టంగాటూరి శ్రీను, ఎస్సై శ్రీనివాసులు ఉన్నారు.

## తెలకపల్లి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ



**నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 24 (జనంసాక్షి) :** నాగర్ కర్నూల్ జిల్లా లో ఉన్న తెలకపల్లి పోలీస్ స్టేషన్ ని వార్షిక తనిఖీలో భాగంగా నాగర్ కర్నూల్ జిల్లా ఎస్పీ తనిఖీ చేసి వివిధ రికార్డులను పరిశీలించి సిడి ఫైల్స్ మరియు వివిధ రికార్డ్స్ సక్రమంగా ఉన్నాయని తెలకపల్లి ఎస్ఐ ని ప్రశంసించారు. విలేజ్ పోలీస్ ఆఫీసర్లుగా ఉన్న కానిస్టేబుల్ అందరిని మీ మీ విలేజ్ వాళ్ళ కి అందుబాటులో ఉండాలని ఎలాంటి విషయాలు ఉన్న మీ యొక్క సబ్ ఇన్స్పెక్టర్ కి తెలియజేయాలని చెప్పారు. అలాగే తెలకపల్లి పోలీస్ ఆఫీసర్స్ అందరికీ దిశా నిర్దేశాలు చేయడం జరిగింది. అలాగే తెలకపల్లి పోలీస్ స్టేషన్ నందు చెట్లను నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ డిఎస్పి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలి



**అమీన్పూర్, సెప్టెంబర్ 24 (జనం సాక్షి) :** బ్యాంకులు ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలని మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి పేర్కొన్నారు. అమీన్పూర్ లో యాక్సిస్ బ్యాంక్ నూతనంగా ఏర్పాటు చేసిన బ్యాంకు శాఖను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేగంగా అభివృద్ధి చెందుతున్న అమీన్పూర్ మున్సిపల్ పరిధిలో నూతన బ్యాంకులు ఏర్పాటు కావడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కృష్ణ, బిజిలి రాజు, సీనియర్ నాయకులు, నందారం రమేష్ గౌడ్, చౌటకూరి మహిపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పోషకాహార, తల్లిపాలపై అవగాహన



**సంగారెడ్డి, సెప్టెంబర్ 24 (జనం సాక్షి) :** గర్భిణీలు, బాలింతలు, కిషోర్ బాలికలు, పిల్లలకు పోషకాహార, తల్లిపాలపై అవగాహన కల్పించడానికే పోషణ అభియాన్ కార్యక్రమం ప్రభుత్వం చేపట్టిందని ఐసిడిఎస్ సిడిపిఓ చంద్రకళ తెలిపారు. ఎనిమిదవ జాతీయ పోషణ అభియాన్ మాసం కార్యక్రమంలో భాగంగా ఈనెల 17 నుండి వచ్చేనెల 16 వరకు జరగనున్న ఎనిమిదవ జాతీయ పోషణ అభియాన్ మాసం సందర్భంగా సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలంలోని బుదేరా కాలనీలో పోషణ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు శ్రీమంతాలు, చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్న ప్రసన్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐసిడిఎస్ సిడిపిఓ చంద్రకళ హాజరై మాట్లాడారు..పోషకాహార, కిషోర్ బాలికలకు, గర్భిణులకు, తల్లి పాలపై అవగాహన కోసమే పోషణ అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోషకాహార నిపుణులు సహాయం తీసుకుని ప్రతిరోజు ఎన్ని క్యాలరీలు పోశాకహారం తీసుకోవాలి. చిరుధాన్యాలు ఏ విధంగా తీసుకోవాలి , వంటల రూపంలో అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. అనంతరం అంగనవాడి ఉపాధ్యాయులతో కలిసి బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు. పోషణ అభియాన్ కార్యక్రమంలో మునిపల్లి మండలం సూపర్వైజర్లు శైలజ, నాగరాణి, వివిధ అంగన్వాడి కేంద్రాల ఉపాధ్యాయులు, గర్భిణులు, బాలింతలు, కిషోర్ ఆ బాలికలు పాల్గొన్నారు.

## పలు రైస్ మిల్లుల ఆకస్మిక తనిఖీ

**శ్రీరంగాపూర్, సెప్టెంబర్ 24 (జనం సాక్షి) :** శ్రీరంగపూర్ మండలంలో పలు రైస్ మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో ఆయన వెంట జిల్లా మేనేజర్ (సివిస్) శ్రీ జగన్మోహన్, డీసీఎస్ఓ శ్రీకాశీ విశ్వనాథ్, ఎంఆర్ఓ రాజు, డీటీ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు. ఖరీఫ్ 2024-2025, రబీ 2024-2025 సీజన్‌లకు సంబంధించిన కస్టమ్ మిల్లింగ్ రైస్ (సిఎంఆర్) డెలివరీని వెంటనే పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ మిల్లుల యజమానులను ఆదేశించారు. అల్ అజీజ్ నాగరాల రైస్ మిల్లు, లక్ష్మీ వారాహి రైస్ మిల్లు, లక్ష్మీ నరసింహ రైస్ మిల్లులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మిల్లులలో నిల్వ ఉన్న వేలం ధాన్యం ప్రాణాలిక పాడి వివరాలను కూడా తనిఖీ చేశారు.మిల్లు యజమానులతో మాట్లాడిన అదనపు కలెక్టర్, ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా సీఎంఆర్ డెలివరీ పూర్తి



చేయాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతుల నుండి సేకరించిన ధాన్యాన్ని సకాలంలో మిల్లింగ్ చేసి, ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం సీఎంఆర్‌ను పౌర సరఫరాల సంస్థకు అప్పగించాలని ఆదేశించారు. ఈ తనిఖీలు సీఎంఆర్ డెలివరీ ప్రక్రియలో జాప్యాన్ని నివారించడానికి, రైతుల ప్రయోజనాలను కాపాడటానికి ఉద్దేశించబడ్డాయని ఆయన తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడానికి మిల్లర్లు సహకరించాలని ఆయన కోరారు.

## విద్యార్థుల సమగ్రాభివృద్ధికి పెద్దపీట



**పటాన్‌చెరు, సెప్టెంబర్ 24 (జనంసాక్షి) :** తరగతి గదిలోనే కాకుండా, ఇతరత్రా కార్యకలాపాలలో కూడా చురుకుగా పాల్గొనడం ద్వారా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధిని పెంపొందించడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం బుధవారం ప్రత్యేకంగా కొంత సమయాన్ని కేటాయించింది. సాంకేతికత, స్థిరత్వం, చర్చ, సామాజిక సేవ, సృజనాత్మక వ్యక్తీకరణ వంటి విభిన్న కార్యక్రమాలతో ప్రాంగణం సజీవంగా మారింది. ఈఈసీఈ విద్యార్థులకు రోబోటిక్స్ 2.0 కార్యశాలతో పాటు, జీ-ఎలక్ట్రా (స్మార్ట్ సిస్టమ్స్ క్లబ్) కొత్త సభ్యుల నియామకాన్ని ప్రారం భించారు. సృజనాత్మకత, కెరీర్ సంసిద్ధత కోసం శిక్షణ, సామర్థ్య అభివృద్ధి చొరవ (టీఎఫ్ సీ) విద్యార్థులను వాస్తవ ప్రపంచ నైపుణ్యాలతో సన్నద్ధం చేయడం ద్వారా విద్య-పరిశ్రమల మధ్య వారధిని నిర్మించడానికి రూపొందించిన బియాండ్ నంబర్స్ లఘు చిత్రాన్ని ప్రదర్శించింది. బీటెక్ లో మేజర్, మైనర్ సబ్జెక్టులను ఎంపిక చేసుకోవడంపై నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థులకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆవిష్కరణ, సేవ, వ్యక్తిగత వృద్ధి ద్వారా గీతం హైదరాబాదు విద్యార్థులను భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న నిపుణులుగా, బాధ్యతాయుత పౌరులుగా పెంపొందించడానికి తన నిబద్ధతను మరోసారి పునరుద్ఘాటించింది.

## బాల కార్మిక నిర్మూలన వ్యవస్థపై అవగాహన




**గట్టు, సెప్టెంబర్ 24 (జనం సాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా, జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ ఆదేశాల మేరకు గట్టు మండలం ముచ్చోని పల్లె గ్రామంలో పౌర సంబంధాల శాఖ అధికారి,మండల విద్యాధికారి ఆధ్వర్యంలో ముచ్చోనిపల్లి గ్రామంలో బాల కార్మిక నిర్మూల వ్యవస్థపై, బాల్యవిహాల నిర్మూలన వ్యవస్థపై ప్రజలకు,గ్రామ పెద్దలకు, విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు,యువతకు తమ ఆటపాట మాటలతో అవగాహన కల్పించారు.పత్తి రైతులు విద్యార్థులను బడి మాన్పిచ్చి పొలాలకు మరియు పనులకు వెంట తీసుకుపోయిన మరియు వారితో పని చేయించిన అట్టి వారిపై చట్టపరంగా చర్యలు మరియు వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని జిల్లా కలెక్టర్ ఆదేశించమని కళాకారులు తెలియజేశారు.అట్లాగే జిల్లా కార్మిక శాఖ అసిస్టెంట్ అధికారి వేణుగోపాల్ బాలలను పనిలో ఎవరైనా పెట్టుకుంటే వారిపై బాల కార్మిక చట్టం కింద కేసులు నమోదు చేస్తామని జరిమానా విధిస్తామని తల్లిదండ్రులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారధి ఉద్యోగులు హజరత్,కేశవులు,భూపతి, కృష్ణ,రాహుల్,స్వామి ముచ్చంపల్లి గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు.

# పటాన్‌చెరు కేంద్రంగా రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ క్రీడలు

- అక్టోబర్ 16, 17, 18 తేదీలలో వాలీబాల్, కబడ్డీ రాష్ట్ర స్థాయి క్రీడలు
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్‌చెరు, సెప్టెంబర్ 24 (జనం సాక్షి) :** మరో మారు రాష్ట్ర స్థాయి క్రీడలకు పటాన్చెరు కేంద్రంగా నిలవబోతోంది. 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి కబడ్డీ, వాలీబాల్ క్రీడలను పటాన్చెరు కేంద్రంగా నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడలను నిర్వహించేందుకు



పటాన్చెరు అవకాశం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరగా ఇందుకు సమ్మతించినట్లు ఆయన తెలిపారు. అండర్ 17 బాలుర వాలీబాల్, అండర్ 14 బాలురు, బాలికల కబడ్డీ పోటీలను అక్టోబర్ 16, 17, 18 తేదీలలో పటాన్చెరు పట్టణంలోని మైత్రి మైదానంలో నిర్వహించబోతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని 33 జిల్లాల నుండి 420 మంది క్రీడాకారులతో పాటు వందమంది వ్యాయామ ఉపాధ్యాయులు, సిబ్బంది క్రీడలలో పాల్గొనబోతున్నారని తెలిపారు. వీరందరికి మూడు రోజులపాటు భోజనం, వసతి, బహుమతులు సొంత నిధులతో అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలలో విజేతలుగా నిలిచిన జట్లను సైతం సొంత నిధులతో జాతీయస్థాయి పోటీలకు పంపిస్తున్నట్లు తెలిపారు. పటాన్చెరు నియోజకవర్గాన్ని రాష్ట్ర, జాతీయ క్రీడలకు కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, ఎస్ జి ఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, గౌసుద్దీన్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు విడుధల చేయాలి

- టియుసిఐ డిమాండ్



**కృష్ణ, సెప్టెంబర్ 24 (జనం సాక్షి) :** కృష్ణ మండలంలోని వివిధ గ్రామపంచాయతీ లలో పనిచేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలని టీయుసిఐ నారాయణ పేట జిల్లా ఉపాధ్యక్షులు ఏజీ భుట్టో , ఆనంద్,డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కృష్ణ మండల ఎంపీడీవో కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ కు వినతీపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు చాలిచాలని వేతనాలతో కేవలం తొమ్మిది వేల ఐదు వందలకు ఇరవై నాలుగు గంటలు పని చేస్తున్నారు. అవికూడా ప్రతి నెల క్రమం తప్పకుండ రావడం లేదు. ఇలా రాకపోవడం తో కార్మికుల కుటుంబాలు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో ఉంటున్నాయి. రెండు నెలల వేతనాలు రాకపోవడంతో ఈ దసరా పండగకు కార్మికులు పస్తులు ఉండాల్సి వస్తున్నది. మీ అకౌంట్‌లో డైరెక్ట్‌గా వేతనాలు వేస్తామని కార్మికులతో ఇప్పటి వరుకు మూడు దపాలు ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ లు సేకరించారు. ఇప్పుడు అప్పుడూ అంటూ కార్మికులను ఊరిస్తున్నది ప్రభుత్వం కాని అసలు వేతనాలే ఇవ్వడం లేదు అన్నారు.ఎన్నికల ముందు మీరే దేవుళ్ళు అని ఒంగి ఒంగి మొక్కిన నాయకులు అధికారం లోకి వచ్చిన తరువాత వారిని నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇరవై నాలుగు గంటలు రాష్ట్ర పరిశుభ్రత కోసం పని చేసే కార్మికుల మీద ఏ మాత్రం ప్రేమ ఉన్న వెంటనే రెండు నెలల వేతనాలు ఈ దసరా పండగ సందర్భంగా వెంటనే విడుదల చేయాలనీ డిమాండ్ చేశారు. లేనిచో జిల్లా వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, కార్మికులు, జిందప్ప, అంజప్ప, వెంకటేష్, దేవమ్మ సాబిమ్మ , వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలి

- ఎస్పీ యోగేష్ గౌతం

**నారాయణపేట జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 24 (జనం సాక్షి) :** జిల్లాలో పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని జిల్లా ఎస్పి.యోగేష్ గౌతం ఆదేశించారు. బుధవారం ఎస్పీ పోలీస్ అధికారులతో నెలవారి నేర సమీక్ష సమావేశం నిర్వహించి పెండింగ్ కేసులను తగ్గించాలని, ప్రాపర్టీ నేరాల నియంత్రణపై దృష్టి సారించాలని, ముందస్తు నేరాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనిఆదేశించారు.సమావేశంలో ఎస్పి మాట్లాడుతూ కేసు నమోదైన వెంటనే నిందితుల ను అరెస్టు చేయాలి, నింది తులను అరెస్టు చేసే విషయంలో ఎలాంటి జాప్యం ఉండకూ డదన్నారు.లాంగ్ పెండింగ్ కేసులు త్వరగా డిస్పోజల్ చేయాలి, రోడ్డు ప్రమాదాల నివారణ గురించి తగు జాగ్ర త్త చర్యలు తీసుకోవా లన్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వారి సమస్యను పరిష్కరించాలి, రాబోవు స్థానిక సంస్థల ఎన్ని కల సందర్భంగా ఎన్ఫోర్స్మెం ట్ విధులు నిర్వహించాల న్నారు.లాంగ్ పెండింగ్



కేసులు త్వరగా డిస్పోజల్ చేయాలి. రోడ్డు ప్రమాదాల నివారణ గురించి తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. పెండింగ్ లో ఉన్న కేసులలో అన్ని కోణాలుల్లో పరిశోధన చేసి కేసులు ఫైనల్ చేయాలని సూచించారు. దొంగతనాల నివారణ గురించి ప్రత్యేక చర్యలు చేపట్టాలి రాత్రి సమయాలలో బ్లూ కోల్ట్స్, పెట్రో కార్ అధికారులు సిబ్బంది నిరంతరంగా విధులు నిర్వహించాలి. డయల్ 100 కాల్ రావాలి వెంటనే రెస్పాండ్ అయి సాధ్యమైనంత త్వరగా సంఘటన స్థలానికి వెళ్లి సమస్యలు పరిష్కరించాలని సూచించారు.నాన్ బేలబుల్ వారెంట్ సాధ్యమైనంత త్వరగా ఎగ్జిక్యూట్ చేయాలని సూచించారు.రోడ్డు ప్రమా దాల గురించి రోడ్ సేఫ్టీ కమి టీ, సంబంధిత డిపార్ట్మెంట్ అధికారులతో రోడ్డు ప్రమా దాలు జరిగే ప్రదేశాలను సందర్శించి నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు ప్రతిరోజు ఉదయం సాయం త్రం విజబుల్ పోలీస్ సింగ్ విధులు నిర్వహించాలన్నారు. యంఓ అపెండర్స్, సస్పెక్టు, కేడీలు, డిసీలు, రౌడీలపై నిఘా ఉంచి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని సూచించారు. సీసీటీఎన్ఎస్‌లో ఎఫ్ఐఆర్, సిడిఎఫ్, పార్ట్ వన్, పార్ట్ టూ, రిమాండ్ డైరీ, చార్జిషీట్ సీసీ నెంబర్ డాటాను ఏరోజు కారోజు ఎంట్రీ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డీఎస్పీలు నల్లపు లింగయ్య, మహేష్, సిఐలు శివశంకర్, రామ్ లాల్, రాజేందర్ రెడ్డి, సైదులు, ఎస్సై రాజు, భాగ్యలక్ష్మీ రెడ్డి, విజయ్ కుమార్, రాము, బాలరాజు, అశోక్ బాబు, గాయత్రి, రేవతి, స్టేషన్ రైటర్లు, తదితరులు పాల్గొన్నారు.

# నర్సంపేటలో అభివృద్ధి అధోగతి పాలైంది

- నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి
- చెన్నారావుపేట బిఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం
- స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండాను ఎగురవేయాలి




**చెన్నారావుపేట, సెప్టెంబర్ 24 (జనంసాక్షి) :** నర్సంపేట నియోజకవర్గంలో అభివృద్ధి అధోగతి పాలైందని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో బిఆర్ఎస్ మండల పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు.అలాగే పార్టీ కార్యాలయం ముందు పార్టీ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికల కోసం పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని కోరారు.మార్పులో భాగంగా నర్సంపేట నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అవకాశం కల్పించి ఎమ్మెల్యేగా దొంతి మాధవ రెడ్డిని గెలిపిస్తే నియోజకవర్గం అభివృద్ధి అదోగతిపాలైందన్నారు. బిఆర్ఎస్ పార్టీ కెసిఆర్ ముఖ్యమంత్రిగా అధికారంలో ఉన్నప్పుడు శాసనసభ్యునిగా నేను స్థానిక సంస్థల ఎన్నికలలో ఎంపీటీసీలు, సర్పంచులు, జెడ్పిటిసిలు గెలిపించుకోవడంతో పాటు చెన్నారావుపేట మండల సమగ్ర అభివృద్ధికి ఒక విజన్‌తో ప్రణాళిక బద్ధంగా పనిచేసినట్లు తెలిపారు. మండలంలోని అనేక గిరిజన తండాలు, గ్రామాలకు బీటీ రోడ్లు, సీసీ రోడ్లు, రైతువేదికలు, హెల్త్ సబ్ సెంటర్స్ లాంటి సౌకర్యాలు కల్పించడంతో పాటు గ్రామాల మౌలిక వసతులను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ప్రత్యేక నిధులతో చెన్నా రావుపేట మండలంలో బ్రిడ్జిలు, చెక్ డ్యాములు, డబుల్ రోడ్లు, సెంట్రల్ లైటింగ్ మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. మండల అభివృద్ధి కోసం ప్రత్యేక చొరవతో ఎస్ డిఎఫ్ నిధుల తీసుకువస్తే గెలిచిన ఎమ్మెల్యే వాటిని రద్దు చేయడం చాలా బాధాకరమన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక నర్సంపేట నియోజకవర్గంలో దాడులు, దౌర్జన్యాలు కబ్జాలు, కమిషన్లు కేసులు, కార్ల కాన్వాయ్ తప్ప అభివృద్ధి శూన్యం అని విమర్శించారు.రైతులకు 50 శాతం సబ్సిడీ పై వ్యవసాయ పరికరాలను అందించే పథకం తీసుకువస్తే నా పైన కాంగ్రెస్ నాయకులు కేసులు పెట్టారని విమర్శించారు.నేను తీసుకువచ్చిన నిధులతోనే నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని ఆ నిధులతోనే కొత్త జీవోలు తీసుకువస్తున్నారని ఎద్దేవా చేశారు. రైతులకు యూరియాను అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని యూరియా బస్తాల కోసం చిన్నపిల్లలు, మహిళలు, రైతులను నెలల తరబడి క్యూలైన్ లో నిలబడడం చూస్తుంటే చాలా బాదేస్తుందన్నారు. రైతులకు యూరియా సరిపడ అందక పంటల దిగుబడి కోల్పోయారని పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ 25 వేల వరకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ శ్రేణులు, కార్యకర్తలు నాయకులు సమన్వయంతో పనిచేసి చెన్నారావుపేట మండల పై గులాబీ జెండా ఎగరవేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ స్టేట్ మాజీ డైరెక్టర్ రాయిడి రవీందర్ రెడ్డి, మండల అధ్యక్షులు బాల్నె వెంకన్న, మాజీ ఎంపీపీ జక్క అశోక్, మాజీ జడ్పిటిసి బానోతు పత్తి నాయక్, సొసైటీ చైర్మన్లు చింతకింది వంశీ, మురహరి రవి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు అమ్మ రాజేష్, కొండవీటి ప్రదీప్ కుమార్, అనుముల కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి భూక్య రవీందర్ నాయక్, యూత్ మండల అధ్యక్షులు మంచోజు మనోజ్ కుమార్, భూక్య శ్రీనివాస్ నాయక్, మాజీ సర్పంచులు కుండె మల్లయ్య, పెరుమాండ్ల శ్రీధర్ రెడ్డి, హంస విజయరామరాజు, గ్రామ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## భవిష్యత్తులో వరదలకు ముందస్తు చర్యలు



- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్ రూరల్, సెప్టెంబర్ 24 (జనం సాక్షి):** నిర్మల్ పట్టణంలో భవిష్యత్తులో వరదలు రాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో లేక్ ప్రొటెక్షన్ పై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల భారీ వర్షాల కారణంగా పలు కాలనీల్లో వరదలు సంభవించి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న విషయాన్ని ప్రస్తావించారు. ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని,ముఖ్యంగా డ్రైనేజీ వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. వరదల నియంత్రణలో సర్వే, రెవెన్యూ,మున్సిపల్, నీటిపారుదల శాఖలు సంయుక్తంగా సమన్వయంతో ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పట్టణంలో వరదలు సంభవించడానికి గల ప్రధాన కారణాలను గుర్తించి, వాటి నివారణకు శాశ్వత పరిష్కారాలు చూపాలని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ క్రమంలో పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు,కాల్వలు, చెరువులు, నదీ వాగుల ప్రవాహ మార్గాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.అలాగే అవసరమైతే మాస్టర్ ప్లాన్ ఆధారంగా సవరణలు చేసి, శాశ్వత రీతిలో వరద నియంత్రణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్(రెవెన్యూ)కిషోర్ కుమార్,ఏడి సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఆర్. సుదర్శన్,మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, తహసిల్దార్లు రాజు, సంతోష్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణాన్ని ప్రారంభించాలని సబ్ కలెక్టర్‌కు వినతి

**కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో సెప్టెంబర్ 24 (జనం సాక్షి) :** కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ పట్టణంలోని సంజీవయ్య కాలనీలో రైల్వే శాఖ ఆధ్వర్యంలో మంజూరైన రైల్వే అండర్ బ్రిడ్జ్ నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించాలని మాజీ కౌన్సిలర్లు సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్ల కు వినతి పత్రం అందజేశారు. బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో కాగజ్ నగర్ మున్సిపల్ లోని వార్డ్ నెంబర్ 6, 7 లకు చెందిన మాజీ కౌన్సిలర్లు పి రిసింగుల జయ చందర్, ఎల్లేసులు కాలనీ వాసులతో కలిసి సబ్ కలెక్టర్ కు వివరించారు. కొంతమంది రాజకీయ నాయకులు, ఇతరులు బ్రిడ్జి నిర్మాణాన్ని అడ్డుకోడానికి కుయుక్తులు చేస్తున్నారని అన్నారు. ఈ అండర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే ముఖ్యంగా పట్టణంలోని చాలామందికి పెద్దవాగు, స్మశాన వాటికలకు వెళ్లడానికి సౌకర్యవంతంగా ఉంటుందని సబ్ కలెక్టర్‌కు వివరించారు. అలాగే మున్సిపల్ కమిషనర్ రాజేందర్ కు సైతం వినతిపత్రం అందజేశారు.

# యూరియా అక్రమ రవాణాపై నిఘా పెట్టాలి

- జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** యూరియా అక్రమ రవాణా పై పటిష్ట నిఘా పెట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడిఓసీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో యూరియా సరఫరా, క్రాప్ బుకింగ్, ఉద్యాన పంటలు సాగు తదితర అంశాలపై వ్యవసాయ, ఉద్యాన వన శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో యూరియా సరఫరాపై టాస్క్ ఫోర్స్ టీములు పటిష్టమైన నిఘా పెంచాలని సూచించారు. మండలాల వారిగా యూరియా ఎక్కువగా విక్రయాలు జరుగుతున్న మండలాల నివేదిక అందించాలని ఆదేశించారు. పిఏసిఎస్ కేంద్రాల వద్ద రైతులకు సరిపడేంత యూరియా నిల్వలు ఉంచాలని స్పష్టం చేశారు. యూరియా అక్రమ రవాణా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో టాస్క్ ఫోర్స్ టీం లను ఏర్పాటు చేయడం జరిగిందని టాస్క్ ఫోర్స్ టీంలు ఆకస్మికంగా రిటైల్ షాపులలో తనిఖీలు చేపట్టాలని, ప్రైవేటు డీలర్లు కొన్ని చోట్ల బ్లాక్ చేసే అవకాశం ఉందని పకడ్బందీగా తనిఖీలు చేపట్టాలని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. యూరియాకు కొరత లేదని, రాబోయే 15 రోజులు చాలా కీలకమని పర్యవేక్షణ పెంచాలని సూచించారు. వ్యవసాయ, ఉద్యాన పంటలు క్రాప్ బుకింగ్ వేగవంతం చేయాలని ఆదేశించారు. మొగుళ్లపల్లి మండలంలోని కొన్ని గ్రామాలలో గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణానికి భూ సేకరణ చేయడం జరిగిందని భూసేకరణ చేపట్టిన భూమిలో పంటలు సాగు చేపట్టకుండా అలాగే సాగులో ఉన్న పంటలు త్వరితగతిన పూర్తి చేసేందుకు రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. యూరియా నిల్వలు, విక్రయాలపై నివేదికలు ఏ రోజుకారోజు అందచేయాలని ఆదేశించారు. రైతు బీమా క్లెయిమ్స్ లో జాప్యం జరుగకుండా సత్వరమే విచారణ చేయాలని సూచించారు. రానున్న రోజుల్లో అవసరమైన యూరియా కొరకు నివేదికలు అందజేయాలని స్పష్టం చేశారు. అదనపు సేల్స్ పాయింట్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు, ఉద్యానవన అధికారి సునీల్ కుమార్, వ్యవసాయ శాఖ ఏడిఏలు, హార్టికల్చర్ అధికారులు పాల్గొన్నారు.

## చేపల వలలో చిక్కిన మొసలి!



- పాపయ్య పేటలో చోటు చేసుకున్న సంఘటన

**చెన్నారావుపేట, సెప్టెంబర్ 24 (జనం సాక్షి):** చేపల వలలో మొసలి చిక్కిన సంఘటన మండలంలోని పాపయ్యపేట గ్రామంలో బుధవారం వెలుగులోకి వచ్చింది. ఇదే గ్రామానికి చెందిన ముదిరాజులు గ్రామంలోని ఊర చెరువులో చేపలు పట్టడానికి వలలను వేశారు. ముత్యాల రాంబాబు చేపల కోసం వేసిన కచ్చు వలను బయటకి తీస్తుండగా మొసలి పిల్ల బయటికి వచ్చింది. దీంతో ముదిరాజులు ఒక్కసారిగా భయభ్రాంతులకు గురయ్యారు. వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించినట్లు తెలిపారు.

## రామప్ప దేవాలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ పదవి యాదవులకు కేటాయించాలి

- అఖిల భారత యాదవ యువజన విభాగం జిల్లా కార్యదర్శి మొర్రి రాజుయాదవ్



**ములుగు ప్రతినిధి, సెప్టెంబర్ 24(జనంసాక్షి) :** జిల్లా లోని వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామం లో గల రామప్ప దేవాలయం ట్రస్ట్ బోర్డ్ కు చైర్మన్ గా యాదవులను నియమించాలని అఖిల భారత యాదవ యువజన విభాగం ములుగు జిల్లా కార్యదర్శి మొర్రి రాజు యాదవ్ ప్రభుత్వ అధికారులను కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం ములుగు మల్లంపల్లి మండల కేంద్రంలో ఆ సంఘం సమావేశం జరుగగా ఆయన పాల్గొని మాట్లాడారు. కాకతీయులు నిర్మించిన రామప్ప దేవాలయం కట్టడం వెనుక యాదవుల పాత్ర ఎంతో ముఖ్యమని అన్నారు. ఎలాంటి శాసనాలు చూసిన గుడి నిర్మాణ సమయంలో యాదవుల పాత్ర చాలా కీలకమనేది తెలుస్తుందని పేర్కొన్నారు. అందుకోసమే యాదవ సామాజిక వర్గానికి రామప్ప ట్రస్ట్ బోర్డు చైర్మన్ పదవీ కేటాయించాలని కోరటం జరుగుతుందని అన్నారు. అదేవిధంగా కొమురవెల్లి మల్లన్న, ఐనవోలు మల్లన్న టెంపుల్స్ కి కూడా ఆలయ కమిటీ చైర్మన్ గా యాదవులను కేటాయించాలని ఆయన కోరారు. వివిధ పార్టీలు యాదవులను కేవలం ఓటు బ్యాంకు గానే చూడకుండా తమతమ పార్టీలలో పనిచేస్తున్న యాదవులకు సముచిత స్థానాలు కల్పించాలని ఆయన కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో యాదవ్ సంఘం జిల్లా నాయకులు మేర్గు రాజు యాదవ్, పెంట శ్రీనివాస్, మేరుగు శ్రీను, ఇమ్మడి ప్రవీణ్, బోయిని సాంబయ్య, కొమ్ము అశోక్, యువజన సంఘం నాయకులు ఇమ్మడి నరేష్, బోయిని రంజిత్, నన్నబోయిన శ్రీకాంత్ పాల్గొన్నారు.

## బతుకమ్మ సంబరాల గోడపత్రిక ఆవిష్కరణ

- తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహణ



**ములుగు ప్రతినిధి, సెప్టెంబర్ 24(జనంసాక్షి) :** ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తన ఛాంబర్లో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ బతుకమ్మ సంబరాల నేపథ్యంలో రూపొందించిన గోడ పత్రికను ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీక అని, ఈ పండుగలో సమాజంలోని అన్ని వర్గాల మహిళలు ఒక్కటిగా కలసి జరుపుకోవడం ప్రత్యేకత అని అన్నారు. ములుగు జిల్లాలో సెప్టెంబర్ 27వ తేదీన సాయంత్రం 3.00 గంటలకు ములుగు కలెక్టరేట్ లో జరగబోయే బతుకమ్మ సంబరాలలో మహిళా ఉద్యోగులు, మహిళా సంఘాలు, ప్రజలందరూ విశేషంగా పాల్గొని పండుగ వైభవాన్ని మరింతగా పెంచాలని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం సంపత్ రావు (అడిషనల్ కలెక్టర్ స్థానిక సంస్థలు) మాట్లాడుతూ ప్రతి మహిళా ఉద్యోగి ఈ బతుకమ్మ సంబరాలలో తప్పనిసరిగా పాల్గొనాలనీ తెలంగాణ సంప్రదాయాన్ని ప్రతిబింబించే ఈ పండుగలో సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించబడతాయని, బతుకమ్మను ఉత్సాహభరితంగా జరుపుకోవడానికి జిల్లా సంఘం తరఫున అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షురాలు కె శిరీష ఆధ్వర్యంలో ఈ బతుకమ్మ సంబరాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ కందుల జీవన్ కుమార్, ఉపాధ్యక్షురాలు కె శిరీష, జిల్లా నాయకులు ఆర్ రామకృష్ణ, రఫిక్, శైలజ, నాగశ్రీ, భగవత్ గీత, అనంతలక్ష్మి, కమరున్నిసా బేగం, రమాదేవి, కావ్య తదితరులు పాల్గొన్నారు.

## ఏటీసీ భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

- హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్



**వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 24 (జనం సాక్షి) :** ములుగు రోడ్డు లోని ఐటిఐ ప్రాంగణంలో నిర్మిస్తున్న అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (ఏటిసి) భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేసి సదుపాయాలను సిద్ధం చేసి ఉంచాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు.బుధవారం ములుగు రోడ్డు లోని ఐటిఐ ప్రాంగణంలో పురోగతిలో ఉన్న ఏటీసీ భవనం నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. అదేవిధంగా ఏటీసీకి వెళ్లేందుకు ఉన్న అంతర్గత రహదారిని పరిశీలించారు. భవన నిర్మాణ పనుల పురోగతి, అప్రోచ్ రోడ్డు నిర్మాణం గురించి అధికారులను, నిర్మాణ పనులు చేస్తున్న గుత్తేదారుతో కలెక్టర్ మాట్లాడి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ఏటీసీ కి సంబంధించిన అన్ని పనులు త్వరగా పూర్తి చేయాలని అన్నారు. అప్రోచ్ రోడ్డును వారం రోజుల్లో పూర్తిచేయాలని గుత్తేదారును ఆదేశించారు. ఏటీసీ ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లను సిద్ధం చేయాలన్నారు.ఈ సందర్భంగా వరంగల్ బాలుర ఐటిఐ ప్రిన్సిపల్ ఎం.చందర్, హనుమకొండ ఐటిఐ ప్రిన్సిపల్ జి. సక్రు, తదితరులు పాల్గొన్నారు.

# టీఆర్ఎస్ ఓటు బ్యాంక్‌కు పూర్వ వైభవం తేవాలి

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు



**పర్వతగిరి, సెప్టెంబర్ 24 (జనం సాక్షి) :** త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయ శంఖం మోగించాలని, లేనిపోని ప్రగల్బాలు పలికి గొప్పలకు పోయి, కాంగ్రెస్ పార్టీ శతకల పడింది ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానిక సంస్థల ఎన్నికల్లో టిఆర్ఎస్ భారీ స్థాయిలో బలపడాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం బి ఆర్ ఎస్ పార్టీ మండల ముఖ్య నాయకుల, పర్వతగిరి గ్రామ అందరికులస్తులు, గ్రామ ముఖ్య నాయకులతో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సమావేశం నిర్వహించినారు.ఈ సమావేశంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ మండల నాయకులు, కార్యకర్తలకు రానున్న స్థానిక ఎన్నికల జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ల గురించి ముఖ్య సూచనలు కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో తన నమ్మకాన్ని ఉనికిని కోల్పోయి చతికిలబడి లేవలేని పరిస్థితిలో ఉందని. రాబోయే స్థానిక జడ్పిటిసి ఎంపిటిసి ఎన్నికల్లో ప్రతి కార్యకర్త, విజయ లక్ష్యంగా పని చేయాలని.బీ. ఆర్.ఎస్ పూర్వ ఓటు బ్యాంకింగ్ ను తిరిగి ఎన్నికల్లో తీసుకురావాలని మండలంలో విస్తృతస్థాయి సమావేశాల ద్వారా కార్యకర్తలకు దిశానిర్దేశం చేయాలని మండల ముఖ్య నాయకులకు సూచనలు చేసారు.ప్రతి ఒక్క కార్యకర్త అంతిమ లక్ష్యం విజయంగా పనిచేయాలని జరగబోయే ఎన్నికల్లో విజయ శంఖం మోగించాలని, కాంగ్రెస్ పార్టీ లేనిపోని ప్రగల్బాలు పలికి ఎన్నికల హామీలు ఇచ్చి గొప్పలకు పోయి చతిగలపడి లేవలేని పరిస్థితిలో ఉందని, ప్రజల అవసరాలు తీర్చే పరిస్థితిలో ప్రభుత్వం లేదని స్పష్టం చేశారు, ఎంపీటీసీ జడ్పిటిసి స్థానిక ఎన్నికల్లో బిఆర్ ఎస్ భారీ స్థాయిలో మెజారిటీ సాధించాలని అందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థుల గెలుపు కోసం కష్టపడిన కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందని తెలిపారు. బోగస్ 420 కమీలు ఇచ్చి రైతు లను నిరుద్యోగులను ప్రజలను కష్టం పెడుతున్న ఘనత కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం దే అని అన్నారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ఎర్రబెల్లి రాజేశ్వర్ రావు, మండల నాయకులు మెడిశెట్టి రాములు,పర్వతగిరి పిఎసిఎస్ చైర్మన్ ఎం మనోజ్ కుమార్,మాజీ జడ్పీటీసీ పంతులు, మాజీ ఏ యం సి. డైరెక్టర్ బోయినపల్లి యుగేందర్ రావు, మాజీ రైతు బంధు మండల అధ్యక్షులు చిన్నపాక శ్రీనివాస్, మాజీ జిల్లా రైతు బంధు సభ్యులు చింతపట్ల సోమేశ్వర్ రావు, మాజీ సర్పంచ్ ఏర్పుల శ్రీనివాస్, మట్టపల్లి చిన్న మాధవరావు,మాజీ ఎంపీటీసీ మాడుగుల రాజు,బిఆర్ఎస్ మండల ఉపాధ్యక్షులు చింతల శ్రీనివాస్ ఎంపీటీసీ కరిమిల్ల మోహన్ రావు మాజీ సర్పంచులు గొనె సంపత్, ఆమడగాని, రాజు యాదవ్,సూర అశోక్, బానోత్ వెంకన్న నాయక్, సంపెల్లి పరమేశ్వర్ రావు, బిఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షులు బూర శ్యాం, సోషల్ మీడియా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు రావొద్దు

- అదనపు కలెక్టర్ అశోక్ కుమార్



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ తెలిపారు. బుధవారం ఐడిఓసి కార్యాలయంలో ఖరీఫ్ సీజన్ 2025-26 దాన్యం కొనుగోలు సంసిద్ధతపై వివిధ శాఖల విభాగాలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు ముఖ్యమైన సూచనలు జారీ చేశారు. వరి సేకరణ కార్యకలాపాలు సజావుగా సాగడానికి అన్ని విభాగాలు పూర్తిస్థాయి సిద్ధతతో ఉండాలని ఆదేశించారు. పిపిసి ఇన్‌ఛార్జీలకు శిక్షణ కార్యక్రమాలను ఈ వారంలోపుగా నిర్వహించాలని సూచించారు. జిల్లా మార్కెటింగ్ అధికారి దాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. ఖరీఫ్ దాన్యం సేకరణ ప్రారంభానికి ముందు రైస్ మిల్లర్లు అవసరమైన బ్యాంక్ గ్యారెంటీలు సమర్పించాలని స్పష్టం చేశారు. అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో పౌర సరఫరాల అధికారి కిరణ్ కుమార్, డిఎం రాములు, సహకార అధికారి వాలియా నాయక్, తూనికలు కొలతల శాఖ అధికారి శ్రీలత పాల్గొన్నారు.

# పేదల ఆత్మగౌరవానికి చిహ్నంగా ఇందిరమ్మ ఇండ్లు

**ఖమ్మం రూరల్, సెప్టెంబర్ 24 (జనం సాక్షి) :** పేదల ఆత్మగౌరవానికి చిహ్నంగా రాష్ట్ర ప్రభుత్వంచే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టడం జరిగిందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు బుధవారం రూరల్ మండలంలో పర్యటించి పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఆరెంపుల గ్రామంలో నిర్మించి పూర్తి చేసిన జెల్ల విజయ కుమారి, చెన్నబోయిన నరేష్, షేక్ నాగుల్ పాషా, చిర్ర రాజ్యం, సమర్థపు మమత, షేక్ రంజాన్ పాషా లకు చెందిన ఇందిరమ్మ ఇళ్లను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి లబ్ధిదారులతో కలిసి గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొని, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు చిర్ర రాజ్యం ఇంట్లో మంత్రి, కలెక్టర్, సిపి లు భోజనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ అధికారం, స్వార్థం కోసం కాకుండా పేద ప్రజల ఆత్మగౌరవం కోసం ఉపయోగపడాలనే తాపత్రయంతో రేవంత్ రెడ్డి నాయకత్వంలో గృహ నిర్మాణ శాఖను తనకు కేటాయించడం జరిగిందని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యంలో దివంగత వైఎస్ఆర్ హయాంలో 25 లక్షల ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తే, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో గత పాలకులు హౌసింగ్ కార్పోరేషన్ ను రద్దు చేశారని మంత్రి విమర్శించారు. పేద ప్రజలకు భరోసా, ధైర్యం అందించేలా ఇందిరమ్మ ఇండ్లను ప్రజా ప్రభుత్వం నిర్మిస్తుందని అన్నారు. గత పాలకులు పేదల సొంతింటి నిర్మాణాలను పూర్తి స్థాయిలో నిర్లక్ష్యం చేశారని, ధనార్జన కోసం చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు వారి హయంలోనే



కూలిపోయిందని అన్నారు. గత పాలకులు చేసిన భారీ అప్పులు, కుదేలైన ఆర్థిక వ్యవస్థ ఉన్న సమయంలో తమ ప్రభుత్వం ఏర్పడినప్పటికీ పేద ప్రజలకు ఇచ్చిన మాట మేరకు మొదటి దఫాలోనే ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 3500 చొప్పున రాష్ట్రంలో మొత్తం 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు ప్రభుత్వం మంజూరు చేసిందని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునే పేదలు ఎక్కడా ఇబ్బంది పడకుండా ప్రతి సోమవారం డబ్బులు విడుదల చేస్తున్నామని అన్నారు. గిరిజన ప్రాంతంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశం జరిగిందని, తర్వాత రాష్ట్రంలోనే పాలేరు నియోజకవర్గంలో నేడు గృహ ప్రవేశాలు జరుగుతున్నాయని మంత్రి హర్షం వ్యక్తం చేశారు. పేద ప్రజల ముఖాలలో సంతోషం చూస్తే తనకు చాలా సంతృప్తి కలుగుతుందని అన్నారు. అర్హులైన ప్రతి పేదవాడికి ఇచ్చిన మాట ప్రకారం ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల లోపు మరో మూడు విడతలలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు.

అనంతరం ఆరెంపుల నుండి ఖమ్మం - వరంగల్ ఆర్ అండ్ బి రోడ్డు వయా యన్.డి.ఆర్. గోదాము వరకు 77 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు, 20 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న పశు సంవర్ధక ఉప కేంద్రం నూతన భవనం, ప్రహరీ గోడ, మరుగుదొడ్ల నిర్మాణాలకు, ఎం.పి.పి.ఎస్. ఆరెంపులలో 13.50 లక్షలతో నిర్మించనున్న అదనపు తరగతి గది నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపనలు చేసారు. తదనంతరం ఆరెంపుల జెడ్పీ హెచ్.ఎస్. పాఠశాల ఆవరణలో ఖమ్మం రూరల్ మండలం, ఎదులాపురం మున్సిపాలిటీ ప్రాంత లబ్ధిదారులకు సి.ఎం.ఆర్.ఎఫ్. చెక్కులను, మంజూరైన నూతన రేషన్ కార్డులను మంత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్, రాష్ట్ర ఇరిగేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, జిల్లా బీసీ సంక్షేమ అధికారిణి జి. జ్యోతి, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, మార్కెట్ కమిటీ చైర్మన్ లు హరినాథ బాబు, వెన్నపూసల సీతారాములు, ఖమ్మం రూరల్ మండల తహసీల్దార్ రాంప్రసాద్, ఎంపిడివో శ్రీదేవి, ఎంఇఓ శ్రీనివాసరావు,ఆర్ఐ లు క్రాంతి,ప్రసాద్, బండి జగదీష్, చింతమళ్ల రవి,తమ్మినేని నవీన్,అంబటి సుబ్బారావు,ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## బస్తీ దవాఖాన ద్వారా నాణ్యమైన వైద్య సేవలందించాలి



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 24 (జనం సాక్షి) :** బుధవారం జిల్లా కలెక్టర్ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డా.చంద్రశేఖర్ తో కలిసి కామారెడ్డి పట్టణంలోని హరిజనవాడ బస్తీ దవాఖానను సందర్శించి బస్తీ దవాఖానాలో అందిస్తున్న వైద్య సేవలను పర్యవేక్షించారు. వైద్యులు మరియు వైద్య సిబ్బంది హాజరు రిజిస్టర్ ను పరిశీలించి వైద్యులు మరియు వైద్య సిబ్బంది సమయపాలన పాటించి రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. బస్తి దావకానకు వచ్చినటువంటి రోగులను బస్తీ దావకానాలో అందుతున్నటువంటి సేవలను అడిగి తెలుసుకుని వారికి బస్తీ దవాఖాన యొక్క ప్రాధాన్యతను వివరించి ఎలాంటి వైద్యసేవలు అవసరమైన తక్షణమే బస్తీ దవాఖానను సంప్రదించి వైద్య సేవలు పొందాలని సూచించారు. అలాగే అధిక వర్షాల వలన సీజన్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున సిబ్బంది అప్రమత్తంగా ఉండి వైద్య సేవలు అందించాలని, ఆసుపత్రితో పాటు ఆసుపత్రి పరిసరాలను ఎప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.బస్తీ దవఖానకు పక్కన నిర్మిస్తున్న బాలసదనం భవన నిర్మాణం పరిశీలించి నాణ్యతగా, వేగంగా భవన నిర్మాణం పూర్తయ్యేలా పర్యవేక్షించాలని మున్సిపల్ కమిషనర్ రాజేందర్ రెడ్డిని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కామారెడ్డి తాహసిల్దార్ జనార్ధన్ తదితరులు ఉన్నారు.

## బాన్సువాడ అసెంబ్లీని అభివృద్ధి చేసింది నేనే..

- **బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం**



**నిజామాబాద్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 24 (జనం సాక్షి) :** బాన్సువాడ అసెంబ్లీ నియోజకవర్గాన్ని అద్దంలా అభివృద్ధి చేసింది తానేనని, తన కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు ఇంకా అభివృద్ధి చేస్తానని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ శాసనసభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండల కేంద్రంలోని ఎస్సీ కాలనిలో 65 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు మరియు డ్రైనేజీ నిర్మాణ పనులకు అయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా అయన ఏర్పాటు చేసిన సభలో మండల ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 119 నియోజకవర్గాలు ఉన్నాయని, అందులో బాన్సువాడ నియోజకవర్గం అభివృద్ధిలో అగ్ర భాగాన ఉన్నదంటే తాను ఎంతగా అభివృద్ధి చేశానో మీరే తెలుసుకోవాలని, దానికి మీరు నన్ను ఎమ్మెల్యేగా గెలిపించడమేనని అన్నారు. తనలాగా రాష్ట్రంలోని మిగతా జిల్లాలలోని నియోజకవర్గాలలోని కానీ, పోనీ మన ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని తొమ్మిది నియోజకవర్గాలలో ఎక్కడ అభివృద్ధి జరిగిందో మన నియోజకవర్గ ప్రజలు గమనించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బోయిని శంకర్, బీర్కూర్ సోసైటీ చైర్మన్ ఇంగు రాములు, ఏఎంసీ వైస్ చైర్మన్ యామ రాములు, మాజీ ఎంపీపీ రఘు, మాజీ ఎంపీటీసీ సందీప్ పటేల్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఖాలేక్, బస్వరాజ్ పటేల్, మియాపూర్ శశికాంత్, కోరిమె రఘు, రాచప్ప పటేల్, కాంత్ రెడ్డి, లింగమయ్య, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు సంసిద్ధం కావాలి

- **జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్**

**సూర్యాపేట ప్రతినిధి, సెప్టెంబర్ 24 (జనంసాక్షి) :** అక్టోబర్ మొదటి వారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు సంసిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ లో 2025-26 ఖరీఫ్ ధాన్యం కొనుగోలుపై సన్నద్ధత సమావేశాన్ని నిర్వహించారు.రాష్ట్ర ప్రభుత్వం ఈ ఖరీఫ్ కు సంబంధించి గ్రేడ్ ఏ ధాన్యానికి క్వింటాకు రూ.2389, సాధారణ రకానికి రూ.2369 మద్దతు ధరను ప్రకటించిందని, సన్నరకం ధాన్యానికి క్వింటాకు రూ.500 అదనంగా బోనస్ ను ప్రకటించినట్లు వెల్లడించారు.ఈ సంవత్సరం సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా పది లక్షల 30 వేల 868 మెట్రిక్ టన్నుల దాన్యం ఉత్పత్తి రాగలదని అంచనా వేయడం జరిగిందని తెలిపారు.ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 430880 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనేందుకు ప్రణాళిక రూపొందించాలని వివిధ ప్రభుత్వ ఏజెన్సీలను ఆదేశించారు. మిగిలిన ధాన్యాన్ని మిల్లర్లు, ట్రేడర్ల ద్వారా కొనుగోలు చేసేందుకు ఆస్కారం ఉన్నట్లు వెల్లడించారు. అక్టోబర్ 20 నుంచి ధాన్యం వచ్చేందుకు ఆస్కారం ఉన్నందున అక్టోబర్ మొదటి వారంలోనే జిల్లా వ్యాప్తంగా నిర్దేశించిన 336 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు సంసిద్ధంగా ఉండాలని ఐకెపి, పిఎసిఎస్, సివిల్ సప్లై తదితర శాఖల అధికారులను ఆదేశించారు.గత సంవత్సరం ఖరీఫ్ లో జిల్లాలో 118681 మెట్రిక్ టన్నుల సన్నధాన్యాన్ని, 107501 మెట్రిక్ టన్నుల దొడ్డు దాన్యాన్ని మొత్తం రెండు లక్షల ఇరవై ఆరువేల 182 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందని, రబీలో 337747 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు వెల్లడించారు.ధాన్యం కొనుగోలుకు కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని, మండలాల వారిగా వచ్చే ధాన్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఏర్పాటు చేయాలన్నారు. సన్నధాన్యానికి, దొడ్డు ధాన్యానికి వేరు వేరుగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించి ఏ గ్రామంలో ఏ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారో స్పష్టంగా తెలియజేస్తూ ముందే ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. సమావేశంలో 2025-26 సంవత్సరానికి గాను పత్తి కొనుగోలుపై సమీక్షించారు.ఈ సంవత్సరం 83927 క్వింటాళ్ల పత్తి కొనుగోలుకు రానుందని,ప్రభుత్వం పత్తికి క్వింటాలు కు 8110 రూపాయల మద్దతు ధర ప్రకటించిందని,జిల్లాలో 6 కోనుగోలు కేంద్రాలు ఉన్నాయని,గత సంవత్సరం 3033689 క్వింటాళ్ల కొనుగోలు చేశామని సీసీఐ అధికారి,మార్కెటింగ్




అధికారులు కలెక్టర్ కు వివరించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పత్తి రాకను బట్టి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా స్లాట్ బుకింగ్ ప్రకారం షెడ్యూల్ తయారు చేయాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి మార్కెటింగ్ అధికారులు సమావేశాన్ని నిర్వహించి షెడ్యూల్ రూపొందించాలన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం జిన్నింగ్ మిల్లులో ఎలాంటి ప్రమాదం జరగకుండా రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో పౌరసరఫరాల జిల్లా అధికారి మోహన్ బాబు, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ రాము, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, డిఆర్డిఓ పిడి అప్పారావు, జిల్లా కోపరేటివ్ అధికారి పద్మ ,జిల్లా మార్కెటింగ్ అధికారి సతీష్, లీగల్ మెట్రోలజీ అధికారి చిట్టిబాబు, ట్రాన్స్ పోర్ట్ అధికారులు ప్రకాష్ రెడ్డి, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

## వరి ధాన్యం సేకరణ కోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

**నిజామాబాద్ జిల్లా బ్యూరో సెప్టెంబర్ 24 (జనం సాక్షి) :** ప్రస్తుత వానాకాలం సీజన్ లో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించే ప్రక్రియ సజావుగా కొనసాగేలా సంబంధిత అధికారులు, కేంద్రాల నిర్వాహకులు, రైస్ మిల్లర్లు అంకిత భావంతో కృషి చేయాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. ఎక్కడ కూడా రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పకడ్బందీ చర్యలు చేపట్టాలని అన్నారు. 2025-2026 వానాకాలం సీజన్ వరి ధాన్యం సేకరణకు సంబంధించి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలోని కాన్ఫరెన్సు హాల్ లో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ తో కలిసి కలెక్టర్ బుధవారం సంబంధిత శాఖల అధికారులతో, ఐకేపీ మహిళా సంఘాల ప్రతినిధులు, రైస్ మిల్లర్లతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వచ్చే నెల అక్టోబర్ నెలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులకు అందుబాటులోకి తేనున్న నేపథ్యంలో, ముందస్తుగానే అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. రైతులను నష్టపర్చే చర్యలను ఎంతమాత్రం ఉపేక్షించబోమని, అక్రమాలకు పాల్పడే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని కలెక్టర్ స్పష్టమైన హెచ్చరికలు చేశారు. జిల్లాలో ఈసారి ఖరీఫ్ సీజన్ లో లక్షా 76 వేల హెక్టార్ల విస్తీర్ణంలో వరి సాగు చేశారని, సుమారు 12.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి చేతికందుతుందని అంచనా వేశామన్నారు. ఇందులో సన్న రకం ధాన్యం అత్యధికంగా 11 లక్షల మెట్రిక్ టన్నులు ఉంటుందని అన్నారు. రైతులు తమ సొంత అవసరాల




కోసం, ఇతర ప్రైవేట్ వ్యాపారులకు విక్రయాలు జరిపే ధాన్యాన్ని మినహాయిస్తే, ప్రభుత్వ పరంగా ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాలకు సుమారు 9 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యాన్ని తరలించే అవకాశం ఉన్నట్టు భావిస్తున్నామని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని జిల్లాలో 663 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. సన్న రకం, దొడ్డు రకం ధాన్యానికి వేర్వేరుగా కొనుగోలు కేంద్రాలు నెలకొల్పుతామని అన్నారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియ, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావి, డీఆర్డీఓ సాయాగౌడ్, డీఎస్ఓ అరవింద్ రెడ్డి, సివిల్ సప్లయిస్ డీ.ఎం శ్రీకాంత్ రెడ్డి, డీసీఓ శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవిందు, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారిణి గంగూబాయి, జిల్లా రవాణా శాఖ అధికారి ఉమా మహేశ్వర్ రావు, రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులు, సహకార సంఘాల సీ.ఈ.ఓలు, మహిళా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## అభాగ్యుల పాలిట ఆపద్బాంధవుడు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ

**మునుగోడు, సెప్టెంబర్ 24 (జనం సాక్షి) :** అభాగ్యుల పాలిట ఆపద్బాంధవుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ.పెన్షన్ దారులకు న్యాయం చేయలేని అసమర్ధ ముఖ్యమంత్రినీ,రేవంత్ రెడ్డి సర్కార్ ని నిలదీసిన కృష్ణ మాదిగ.మంగళవారం రోజున మునుగోడు నియోజకవర్గ చేయూత పెన్షన్ దారుల సన్నహాక సభ మునుగోడు లోని పి ఆర్ ఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్లో జరిగింది.ఈ సభకు ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ హాజరై మాట్లాడుతూ చేయూత పెన్షన్లు పెంచకుండా రేవంత్ రెడ్డి మోసం చేశాడనీ,2023 ఎన్నికల సమయం లో నాకు ఓటు వేయండి డిసెంబర్ లో పెరిగే పెన్షన్లు తీసుకోమని మాట్లాడిన రేవంత్ రెడ్డి ఓట్లు దండుకున్నాక దారుణంగా మోసం చేశాడని అన్నారు. చేతగాని స్థితిలో ఉన్న పెన్షన్ దారులకు న్యాయం చేయాలేని ముఖ్యమంత్రి అసమర్థుడిగా మిగిలిపోతున్నారని అన్నారు.పెన్షన్లు పెంచడమా లేదా ముఖ్యమంత్రి పీఠం మీద నుండి దిగిపోవడమో తేల్చుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అలాగే పెన్షన్ల గురించి మాట్లాడకుండా కేసీఆర్ మౌనం వహించడం దుర్మార్గమని అన్నారు. ప్రభుత్వం ఏర్పడి 21 నెలలు కావస్తున్న ప్రతిపక్ష పార్టీగా బిఆర్ఎస్ పార్టీ పెన్షన్ దారుల పక్షాన నిలవడంలో విఫలమైందని అన్నారు. రేవంత్,కేసీఆర్ పేద వర్గాలకు చెందిన వాళ్లు కాదు కనుక పేద వర్గాలకు చెందిన పెన్షన్ దారుల గోడు పట్టడం లేదని అన్నారు.అందువల్ల పేద వర్గాలకు చెందిన బిడ్డగా పెన్షన్



దారులకు న్యాయం జరగాలనే ఉద్దేశంతో ఈ పోరాటాన్ని ముందుకు నడిపిస్తామని అన్నారు. వికలాంగులకు 6000, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలతో పాటు మిగతా పెన్షన్ దారులకు 4000 ఇవ్వాలని అలాగే ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారికి 6 నూతన పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.ఈ డిమాండ్లను సాధించే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. అక్టోబర్ 6 నుండి నవంబర్ 6 వరకు నెల రోజుల పాటు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండలాల్లో దీక్షలు చేపడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్,ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీశైలంమాదిగ, ఎంఎస్పి జిల్లా అధ్యక్షుడు బకరం.శ్రీనివాస్,వీహెచ్పీఎస్ జిల్లా గౌరవాధ్యక్షుడు మత్స్యగిరి,విహెచ్పిఎస్ మండల అధ్యక్షుడు తలారి సహదేవులు,ఎమ్మార్పీఎస్ మునుగోడు నియోజకవర్గ ఇన్చార్జి మేడి శంకర్,ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పందుల అంజయ్య, ఎమ్మార్పీఎస్ మండల సీనియర్ నాయకులు దుబ్బ గోపాల్,పందుల మల్లేష్,పందుల సంపత్, పందుల లక్ష్మణ్,పందుల వెంకన్న,బోయపర్తి యాదయ్య,నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాల నుండి అన్ని మండలాల నుండి పెన్షన్ దారులు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# రైతును రాజు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వ కార్యాచరణ

- **మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**ఖమ్మం రూరల్, సెప్టెంబర్ 24 (జనం సాక్షి) :** రైతును రాజు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం కార్యాచరణ అమలు చేస్తుందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం రూరల్ మండలం యం. వెంకటాయపాలెం గ్రామంలో 15 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న 9 వేల 700 మెట్రిక్ టన్నుల శీతల గోదాముల నిర్మాణానికి జిల్లా కలెక్టర్, సిపి లతో కలిసి శంకుస్థాపన చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత 10 సంవత్సరాల కాలంలో గత పాలకులు గిడ్డంగుల సామర్థ్యం 3 లక్షల మెట్రిక్ టన్నుల పెంచితే, మన ప్రజా ప్రభుత్వం 5 లక్షలకు పైగా మెట్రిక్ టన్నుల గోదాముల నిర్మాణ పనులు చేపట్టిందని, రాబోయే 3 సంవత్సరాలలో వీటిని పూర్తి చేస్తామని అన్నారు. గిడ్డంగుల సంస్థ ద్వారా గతంలో ఎన్నడు లేని విధంగా మొట్టమొదటిసారిగా జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్ గా కోల్డ్ స్టోరేజ్ నిర్మాణానికి శ్రీకారం చుట్టామని, 9700 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో కోల్డ్ స్టోరేజ్ ను 15 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్నామని, సంవత్సర కాలంలో కోల్డ్ స్టోరేజ్ నిర్మాణం పూర్తి



చేసి, వాణిజ్య పంటలు పండించే రైతన్నలకు ప్రైవేటు కంటే అతి చౌకగా కోల్డ్ స్టోరేజ్ అందుబాటు లోకి తీసుకుని వస్తామని అన్నారు. రైతు భరోసా కింద పెట్టుబడి సహాయం ఎకరానికి 12 వేల రూపాయలకు పెంచడం జరిగిందని, 9 రోజులలో 9 వేల కోట్ల రూపాయలను రైతుల ఖాతాలో జమ చేయడం జరిగిందని, 25 లక్షల మంది రైతులకు 21 వేల కోట్ల రూపాయలు రైతుల రుణమాఫీ పూర్తి చేసామని, సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు 500 రూపాయల బోనస్ అందించామని అన్నారు. రైతులను రాజు చేయడమే లక్ష్యంగా నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేస్తున్నామని అన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి వల్ల యూరియా సమస్య ఏర్పడితే ఢిల్లీలో రైతుల పక్షాన పోరాటం చేసి రైతులకు యూరియా సరఫరా చేసామని, రాబోయే వారం రోజులలో యూరియా సమస్య పరిష్కారం అవుతుందని అన్నారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు మాట్లాడుతూ స్థానిక రైతులకు ఉపయోగపడే విధంగా కార్పోరేషన్ చరిత్రలో మొట్టమొదటి సారిగా కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేయడం జరుగుతున్నదని, దీనిని రైతులు పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవాలని అన్నారు. మంత్రి సూచనల మేరకు రాష్ట్రంలో మరో 5 లక్షల టన్నుల గోదాములు నిర్మించి గిడ్డంగుల సంస్థ సామర్థ్యం 10 లక్షల టన్నులకు పెంచేందుకు కృషి చేస్తున్నామని, ఇప్పటికే మూడు లక్షల టన్నుల గోదాములు నిర్మాణానికి అవసరమైన స్థల కేటాయింపు జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఎండి కొర్ర లక్ష్మి, ఆర్ అండ్ బి ఎస్ఇ యాకోబు, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, పీఆర్ ఇఇ మహేష్ బాబు, ఖమ్మం రూరల్ మండల తహసీల్దార్ రాంప్రసాద్,మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మి నారాయణ, బొర్రా రాజశేఖర్, మద్ది మల్లా రెడ్డి,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కళ్లెం వెంకట రెడ్డి, కాంగ్రెస్ మహిళా నాయకురాలు మందపల్లి నాగమణి, పుచ్చకాయల కమలాకర్, లింగా వెంకటనారాయణ, వివిధ శాఖల అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను వెంటనే లబ్ధిదారులకు కేటాయించాలి

- **జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి**



**చందంపేట, సెప్టెంబర్ 24 (జనం సాక్షి) :** చందంపేట మండలం, గగిలిపురంలో పూర్తయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల ను వెంటనే లబ్ధిదారులకు కేటాయించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజ్ కుమార్ ను ఆదేశించారు.బుధవారం, చందంపేట మండలం, గగిలిపురం లో నిర్మాణంలో ఉన్న 2బి హెచ్కె ఇండ్లను పరిశీలించారు. కాగా గ్రామానికి 25 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు కాగా దాదాపు అన్ని ఇల్లు పూర్తి అయ్యాయని గృహ నిర్మాణ శాఖ పీడీ జిల్లా కలెక్టర్ కు వివరించగా, తక్షణమే వాటిని లబ్ధిదారులకు కేటాయించి గృహప్రవేశాలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అనంతరం జిల్లా కలెక్టర్ చందంపేట ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రోగులకు చేస్తున్న వైద్య పరీక్షలు, ప్రసవాలు, ఎనీమియా రోగులకు ఇస్తున్న చికిత్స, గ్రామీణ ప్రాంతంలోని మహిళలు పిల్లలకు, పిల్లలకు మధ్య ఎడం పాటించడం, పౌష్టికాహారం, గర్భిణీ స్త్రీలకు అందించే చికిత్స,తదితర అంశాలను ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ ప్రవల్లికతో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో నిర్వహిస్తున్న స్వస్త్ నారి స్వశక్తి పరివార్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు.




# నాలుగో రోజూ డీలానే..

## పడిపోయిన సెన్సెక్స్

**న్యూఢిల్లీ:**భారతీయ స్టాక్ మార్కెట్లు వరుసగా నాల్గవ రోజు అమ్మకాల ఒత్తిడిలో ఉన్నాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 386 పాయింట్లు లేదా 0.47 శాతం తగ్గి 81,716 వద్ద, ఎన్ఎస్ఈ నిఫ్టీ 50 సూచీ 113 పాయింట్లు లేదా 0.45 శాతం పడిపోయి 25,057 వద్ద స్థిరపడ్డాయి .టాటా మోటార్స్, భారత్ ఎలక్ట్రానిక్స్, అదానీ ఎంటర్ప్రైజెస్ విప్రో, జియో ఫైనాన్షియల్ సర్వీసెస్, బజాజ్ ఆటో, ఇండస్ఇండ్ బ్యాంక్, హీరో మోటోకార్ప్, అల్ట్రాటెక్ సిమెంట్, యాక్సిస్ బ్యాంక్, టెక్ ఎం షేర్లు 1 శాతం నుంచి 2.6 శాతం వరకు పడిపోయాయి.నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 0.98 శాతం, నిఫ్టీ స్మాల్ క్యాప్ ఇండెక్స్ 0.67 శాతం క్షీణించాయి. నిఫ్టీ రియాల్టీ ఇండెక్స్ 2.5 శాతం, నిఫ్టీ ఆటో ఇండెక్స్ (1.15 శాతం), నిఫ్టీ ప్రైవేట్ బ్యాంక్ ఇండెక్స్ (0.8 శాతం) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. దీనికి విరుద్ధంగా నిఫ్టీ ఎఫ్ఎంసీజీ ఇండెక్స్ 0.18 శాతం పెరిగింది.



## బ్రాండెడ్ రిటైల్ క్రెడిట్, ప్రీపెయిడ్ కార్డులు ప్రారంభం

### ఎయు స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ - జాగిల్ వ్యూహాత్మక భాగస్వామ్యం

ముంబై (జనంసాక్షి):భారత్‌లో అతిపెద్ద చిన్న ఫైనాన్స్ బ్యాంక్ అయిన ఏయూ చిన్న ఫైనాన్స్ బ్యాంక్(ఏయూ ఎస్ఎఫ్‌బి), అలాగే దశాబ్దంలో యూనివర్సల్ బ్యాంక్ గా మారడానికి ప్రాథమిక అనుమతి పొందిన తొలి బ్యాంక్, నేడు ఒక కీలక భాగస్వామ్యాన్ని ప్రకటించింది.
భారతదేశంలోఅగ్రగామి వ్యయ నిర్వహణ సంస్థ అయిన జాగిల్ ప్రీపెయిడ్ ఓషన్ సర్వీసెస్ లిమిటెడ్ తో ఈవ్యూహాత్మక ఒప్పందం కుదిరింది. ఈ భాగస్వామ్యం ద్వారా, ప్రత్యేకమైన తృతీయ పక్ష అనువర్తన ప్రదాత (టి.పి.ఎ.పి.) అనుసంధానం, వ్యక్తిగత సిఫార్సుల యంత్రాంగం సౌకర్యంతోకూడిన సహ-బ్రాండెడ్ చిల్లర రుణ, ప్రీపెయిడ్ కార్డుల కార్యక్రమంను ప్రారంభించేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. క్రొత్త రీటైల్ క్రెడిట్కార్డు వినియోగదారులకు మరింత విలువనిచ్చేలా రూపొందించబడింది. ఈ క్రమంలో, ఎయు ఎస్.ఎఫ్.బి. తన క్రెడిట్ మూల్యాంకన నైపుణ్యాన్ని వినియోగించుకోగా, జాగిల్ తన విస్తృత సంస్థాగత నెట్‌వర్క్ను ఉపయోగించి అర్హతగల కార్పొరేట్ ఖాతాదారులను చేర్చనుంది. ఈ ఖాతాదారులు జాటిక్స్ అనే జాగిల్ యొక్కకేంద్రీకృత ఎస్.ఎ.ఎ.ఎస్. వేదికను ఉపయోగించుకునే అవకాశంపొందుతారు. ఇది సంస్థ ఖర్చులపై తక్షణ అవగాహన, సంపూర్ణ నియంత్రణ మరియు అమలు చేయగల సూచనలు అందిస్తుంది.ఈ కార్యక్రమంతో, సంస్థలు ఖర్చుల నిర్వహణ, తిరిగి చెల్లింపుల ట్రాకింగ్ సులభతరం చేసుకోవచ్చు. అంతేకాక, జాగిల్ మొబైల్ యాప్ ద్వారా సహాయం పొందే సౌకర్యం కూడాఉంటుంది. ఈ ఆలోచన వెనుక ఉద్దేశ్యం, ఏయూ చిన్న ఫైనాన్స్ బ్యాంక్ (ఎయుఎస్.ఎఫ్.బి.) దాని కార్పొరే ట్ ఖాతాదారులుతమ వాణిజ్య కార్డు కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించి, విస్తరించుకునేలా శక్తినివ్వడం. "రిటైల్ క్రెడిట్ కార్డు వ్యాపారంలో ప్రవేశించేందుకు ఎయుబ్యాంక్‌తో భాగస్వామ్యం చేయడం మాకు ఎంతో ఆనందంగా ఉంది. ఈ భాగస్వామ్యం ద్వారారిటైల్ మరియు కార్పొరేట్ ఖాతాదారులకు వినూత్నమైన, సాంకేతిక ఆధారిత చెల్లింపు పరిష్కారాలను అందించడమే మాఉద్దేశ్యం" అని జాగిల్ వ్యవస్థాపకుడు %డ%ఎగ్జిక్యూటివ్ చైర్మన్డాక్టర్ రాజ్ పి. నారాయణంతెలిపారు. "జాటిక్స్, సేవ్ (ఎస్.ఎ.వి.ఇ.) వంటి సమగ్ర వేదికలతో, వ్యాపార సంస్థలకు మరింత ఖర్చుల పారదర్శకత, మెరుగైన నియమావళి అనుసరణ, మరియు అన్ని విభాగాలలో ఉన్నత స్థాయి కార్యాచరణ సామర్థ్యంకల్పిస్తున్నాం" అని ఆయన పేర్కొన్నారు.ఎయు స్మాల్ ఫైనాన్స్బ్యాంక్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ మరియు సీఈఓ శ్రీ సంజయ్ అగర్వాల్ ఇలా తెలిపారు: "ఈ భాగస్వామ్యం మా దృష్టికోణానికి పూర్తిగా అనుగుణంగా ఉంది.వ్యాపారాలు మరియు వినియోగదారులు ఇద్దరికీ మరింత తెలివైన, సమర్థవంతమైన ఆర్థిక పరిష్కారాల ద్వారా శక్తినివ్వడమే మాలక్ష్యం. జాగిల్ యొక్క శక్తివంతమైన ఎస్.ఎ.ఎ.ఎస్. సామర్థ్యాలు మరియు విస్తృతమైన సంస్థాగత నెట్‌వర్క్ మాక్రెడిట్ సేవలను సమర్థవంతంగా పూరకంగా నిలబెడుతున్నాయి.



## భారీగా వేతనాలు .. అయోమయంలో కంపెనీలు

హెచ్-1బీ వీసా వార్షిక రుసుమును పెంచుతున్నట్లు అమెరికా ప్రకటించిన నేపథ్యంలో బహుళజాతి కంపెనీల్లోని ఉద్యోగుల వేతనాలపై చర్చ సాగుతోంది. యూఎస్ కార్పొరేట్ కంపెనీలు విదేశాల్లోని తమ ఉద్యోగులకు దేశీయంగా ఎంత వేతనాలు ఆఫర్ చేస్తున్నాయనే ప్రశ్నలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రముఖ ఐటీ సర్వీసులు అందిస్తున్న మైక్రోసాఫ్ట్ కంపెనీ హెచ్1-బీ వీసాపై ఉన్న తమ నిపుణులకు యూఎస్‌లో ఎంత పే చేస్తుందో వివరాలు వెల్లడయ్యాయి. అయితే వీటిని కంపెనీ అధికారికంగా ధ్రువీకరించలేదని గమనించాలి.

# వరదలో చిక్కుకుపోయిన రోల్‌రాయిస్

### రూ.10 కోట్ల రోల్స్‌రాయిస్ కంటే రూ.10 లక్షల కారే నయం కదా!



**న్యూఢిల్లీ:**రూ.కోట్లు పెట్టి వస్తువులు కూడా కొన్ని సందర్భాల్లో పనికిరాకుండా పోతుంటాయి. సాధారణ సగటు వస్తువులే మేలనిపిస్తాయి. అలాంటి సంఘటనే ఇది. సుమారు రూ.10 కోట్ల ధర ఉండే రోల్స్‌రాయిస్ కారు.. వరద నీటిలో చిక్కుకుని ఇక నావల్ల కాదంటూ ముందుకెళ్లకుండా మొరాయిస్తే.. రూ.10 లక్షల లోపుండే మామూలు కార్లు రయ్‌మంటూ దూసుకెళ్లాయి. కోల్‌కతాలో అత్యంత భారీ వర్షాలు కురుస్తున్నాయి. నగరంలోని చాలా ప్రాంతాలు నీట మునిగిపోయాయి. రోడ్లపై పెద్ద ఎత్తున వరద నీరు నిలిచి ఉంది. ఈ క్రమంలో ఓ రోల్స్ రాయిస్ కారు ఆ వరద నీటిలో నిలిచిపోయిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.ఈ వీడియోలో టాటా వాహనంలో ప్రయాణిస్తున్న ఒక వాహనదారుడు రూ .10 కోట్లకు పైగా విలువైన లగ్జరీ రోల్స్ రాయిస్ ఘోస్ట్ కారు వరద నీటిలో ఎలా చిక్కుకుపోయిందో పేర్కొన్నారు. తన రూ .10 లక్షల టాటా కారే లగ్జరీ వాహనం కంటే చాలా మెరుగ్గా ఉందంటూ ఈ క్లిప్‌లో ఆ వాహనదారుడు వ్యాఖ్యానించారు. ఈ ఘటన దక్షిణ కోల్‌కతాలోని బాలీగంజ్ ప్రాంతంలో చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. వైరల్‌గా మారిన ఈ వీడియోపై పలువురు ఇన్‌స్టాగ్రామ్ యూజర్లు ప్రతిస్పందించారు. రోల్స్ రాయిస్ లగ్జరీ కారని, నీటితో నిండిన వీధుల్లో నడపడానికి ఉద్దేశించినది కాదని కొందరు వ్యాఖ్యానించగా, కోల్‌కతా నగర రోడ్ల దుస్థితిని మరికొంతమంది ప్రశ్నిస్తూ కామెంట్‌లు పెట్టారు.



## ఒక్కసారి చార్జ్ చేస్తే 172 కి.మీ.!

### మార్కెట్లోకి కొత్త ఈవీ బైక్..

**ముంబై:**ఎలక్ట్రిక్ వాహనాల తయారీ సంస్థ మ్యాటర్ తాజాగా తమ ఎరా మోటర్‌సైకిల్‌ను హైదరాబాద్ మార్కెట్లో ప్రవేశపెట్టింది. ఎరా 5000ప్లస్ వెర్షన్ ప్రారంభ ధర రూ.1,93,826గా (హైదరాబాద్ ఎక్స్‌షోరూం) ఉంటుంది. ఒక్కసారి చార్జ్ చేస్తే 172 కి.మీ. రేంజి, బ్యాటరీపై లైఫ్‌టైమ్ వారంటీ తదితర ప్రత్యేకతలు ఇందులో ఉన్నాయి. ప్రస్తుతమున్న 15 డీలర్‌షిప్‌లను మరింతగా విస్తరిస్తున్నామని, హైదరాబాద్‌లో ఒకటి ఉండగా, ఖమ్మంలో మరొకటి ప్రారంభిస్తున్నామని సంస్థ వ్యవస్థాపకుడు, సీటీవో కుమార్ ప్రసాద్ తెలికెపల్లి చెప్పారు. త్వరలో మరో 200 మిలియన్ డాలర్లు సమకూర్చుకునే ప్రణాళికల్లో ఉన్నట్లు తెలిపారు.కొత్త ప్లాంటు ఏర్పాటు, ఇతరత్రా అవసరాలకు ఈ నిధులను వినియోగించుకోనున్నట్లు ప్రసాద్ చెప్పారు. ఇప్పటివరకు సుమారు 75 మిలియన్ డాలర్లు సమీకరించగా, కంపెనీకి ప్రస్తుతం సాణంద్‌లో 1.2 లక్షల వాహనాల వార్షిక ఉత్పత్తి సామర్థ్యంతో ఓ ప్లాంటు ఉంది.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 1,05,750 (22 క్యారెట్లు) | ₹ 1,15,370 (24 క్యారెట్లు) |
|---|---|

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 1,50,000



# 15వ ఇండియా క్లైమేట్ పాలసీ, బిజినెస్ కాన్‌క్లేవ్ ప్రారంభం

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):
ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ) తన సెంటర్ ఫర్ సస్టైనబిలిటీ లీడర్‌షిప్ ఆధ్వర్యంలో 15వ ఇండియా క్లైమేట్ పాలసీ అండ్ బిజినెస్ కాన్‌క్లేవ్ బేగంపేటలోని హోటల్ వివంతలో నిర్వహించింది. ఈ కార్యక్రమాన్ని భారత ప్రభుత్వం పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ, జపాన్ పర్యావరణ మంత్రిత్వ శాఖల భాగస్వామ్యంతో నిర్వహించారు. ఈ కాన్‌క్లేవ్‌లో క్లైమేట్ పాలసీ, కార్బన్ మార్కెట్ రంగంపై చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా ఫిక్కీ ఎన్విరాన్మెంట్, క్లైమేట్ చేంజ్ కమిటీ కో చైర్మన్, గ్రీన్కో గ్రూప్ చీఫ్ సస్టైనబిలిటీ ఆఫీసర్ డాక్టర్ రాంబాబు పరవస్తు మాట్లాడుతూ.. భారతదేశ వాతావరణ చర్యల్లో చారిత్రక నాయకత్వాన్ని గుర్తుచేశారు. ముఖ్యంగా క్యోటో ప్రోటోకాల్ క్లీన్ డెవలప్‌మెంట్ మెకానిజం (సీడీఎం)లో భారత్ ప్రాజెక్ట్ యాక్టివేషన్‌లో ముందుందన్నారు. క్యోటో ప్రోటోకాల్, పారిస్ ఒప్పందం మధ్య జపాన్ చేపట్టిన జాయింట్ క్రెడిట్ మెకానిజం ప్రాధాన్యతను ప్రశంసించారు. ఇది ఆర్టికల్ 6ని ముందుగానే ఊహించిందన్నారు. దాని కోసం రూపకల్పన చేయబడిందన్నారు. జపాన్ నిరంతర కృషి ఫలితంగా ఇప్పుడు భారత్, దక్షిణ కొరియా, సింగపూర్, స్వీడన్ వంటి దేశాలతో ద్వైపాక్షిక ఒప్పందాలు చేసుకునే దశకు చేరిందన్నారు. జాతీయ స్థాయిలో తీసుకున్న లక్ష్యాలు ప్రతిష్ఠాత్మకమైనవన్నారు. వీటిని స్వయంగా సాధించాల్సి ఉందన్నారు. ఆర్టికల్ 6 వంటి మెకానిజం అధిక వ్యయ ప్రాజెక్టుల ఆచరణలో ఉన్న అంతరాన్ని తగ్గించడంలోనూ, విదేశీ పెట్టుబడులు, సాంకేతికతను ఆకర్షించడంలోనూ కీలకమని చెప్పారు. ఈ సందర్భంగా జపాన్ పర్యావరణ మంత్రిత్వ శాఖ గ్లోబల్ ఎన్విరాన్‌మెంటల్ బ్యూరో జేసీఎం ప్రాజెక్టులు, ఇంటర్నేషనల్ మార్కెట్ మెకానిజం ప్రిన్సిపల్ మేనేజర్ కోహే కినామే మాట్లాడుతూ వాతావరణంలో మార్పులు కొత్త వ్యాపారాలకు, పెట్టుబడులకు అవకాశం అందిస్తుందన్నారు. జేసీఎం అనేది పారిస్ ఒప్పందంలోని ఆర్టికల్ 6 క్రింద కార్బన్ మార్కెట్ సాధనమన్నారు. ఇందులో జపాన్ భాగస్వామ్య దేశాలతో కలిసి డీకార్బనైజేషన్ ప్రాజెక్టులపై పని చేస్తుందన్నారు.



### మేకిన్ ఇండియా నినాదంలో భాగంగా

## భారీ నౌకల తయారీకి ఇన్‌ఫ్రా హోదా

**ముంబై:**
మేకిన్ ఇండియా నినాదంలో భాగంగా దేశీయంగా భారీ నౌకల తయారీని మరింతగా ప్రోత్సహించే దిశగా ఈ పరిశ్రమకు మౌలిక రంగ హోదాను కల్పిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది.ఇన్‌ఫ్రాలో భాగమైన రంగాల మాస్టర్ లిస్ట్‌లో రవాణా, లాజిస్టిక్స్ కేటగిరీలో దీన్ని కూడా చేర్చింది. ఈ మేరకు సెప్టెంబర్ 19న ఆర్థిక శాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది.ఈ నోటిఫికేషన్ ప్రకారం 10,000 పైగా టన్నుల స్థూల టన్నేజ్ ఉండి, భారతీయ ఓనర్‌షిప్, జెండా గల వాణిజ్య నౌకలకు ఇన్‌ఫ్రా హోదా లభిస్తుంది. అలాగే దేశీయంగా తయారై, భారతీయ ఓనర్‌షిప్, ఫ్లాగ్‌తో 1,500 పైగా స్థూల టన్నేజీ గల వాణిజ్య నౌకలు కూడా ఈ కేటగిరీ కింద వస్తాయి. ఇన్‌ఫ్రా హోదా గల పరిశ్రమల్లోని సంస్థలకు .. రుణాల సమీకరణకు సంబంధించి వెసులు బాట్లు లభిస్తాయి. పన్నులపరమైన రాయితీలు మొదలైన ప్రయోజనాలు కూడా ఉంటాయి.

# భారత్‌కు యూఏఈ వీసా నిలిపేసిందా?

**దుబాయ్(జనంసాక్షి):**
యూఏఈ విదేశాల నుంచి తమ దేశం వస్తున్న టూరిస్ట్‌లు, వర్కింగ్ వీసాదారులను తాత్కాలికంగా నిలిపేసిందని కొన్ని అంతర్జాతీయ వార్తా సంస్థలు కథనాలు ప్రచురించాయి.అయితే దీనిపై యూఏఈ అధికారికంగా వివరణ ఇవ్వాల్సి ఉంది. కథనాల్లోని వివరాల ప్రకారం.. యూఏఈ తొమ్మిది దేశాల టూరిస్ట్ వీసాలు, వర్కింగ్ వీసాలజారీని తాత్కాలికంగా నిలిపివేసింది. ఆ జాబితాలో భారత్ లేదని గమనించాలి. యూఏఈ వీసాలు నిలిపేసిన దేశాల వివరాలు కింది విధంగా ఉన్నాయి. ఈ సస్పెన్షన్ కొత్త వీసా దరఖాస్తులకు మాత్రమే వర్తిస్తుంది. పైన తెలిపిన దేశాల నుంచి వచ్చి ప్రస్తుతం యూఏఈలో ఉంటున్న వీసా హోల్డర్లకు ఎలాంటి సమస్య లేదు.

### ఈ నిర్ణయానికి కారణం..

భద్రతా ఆందోళనలు: ఇంటెలిజెన్స్ నివేదికలు ఉగ్రవాదానికి సంబంధించిన సంభావ్య ప్రమాదాలను సూచిస్తున్నాయి. దౌత్యపరమైన ఉద్రిక్తతలు: కొన్ని దేశాలకు యూఏఈ, గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్ (జీసీసీ) సభ్య దేశాలతో ఉన్న సంబంధాలు దెబ్బతిన్నాయి. ఇది వీసా విధాన నిర్ణయాలను ప్రభావితం చేస్తుంది.ప్రజారోగ్య ప్రోటోకాల్స్: కరోనా నియంత్రణలో ఉన్నప్పటికీ యూఏఈ కఠినమైన ఆరోగ్య పరీక్షలు, ప్రయాణ భద్రతా చర్యలను అమలు చేస్తూనే ఉంది. తక్కువ టీకా రేట్లు లేదా అస్థిరమైన ఆరోగ్య డేటా రిపోర్టింగ్ ఉన్న దేశాలు దీని వల్ల ప్రభావితం అవుతున్నాయి.మైగ్రేషన్ మేనేజ్‌మెంట్: కార్మికుల రాకపోకలను మరింత సమర్థవంతంగా నిర్వహించడానికి యూఏఈ తన ఇమ్మిగ్రేషన్ వ్యవస్థను పునసమీక్షిస్తోంది.




## నీట్‌లో 99.99 పర్సంటైల్, 1475 ర్యాంక్.. కానీ..



**న్యూఢిల్లీ:**ఈ ఫొటోలోని కుర్రాడు పేరు అనురాగ్ అనిల్ బోర్కర్. నీట్ యూజీ 2025 పరీక్షలో 99.99 పర్సంటైల్‌తో నీట్ విభాగంలో 1475 ఆల్ ఇండియా ర్యాంక్ సాధించాడు. కానీ విచిత్రం ఏమిటంటే ఈ కుర్రాడు డాక్టర్ కావాలనుకోలేదు.అందుకే మెడిసిన్‌లో చేరడానికి ముందే ప్రాణాలు తీసుకున్నాడు. మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లాకు 19 ఏళ్ల అనురాగ్ ఇష్టం లేని చదువు కారణంగా ప్రాణాలు కోల్పోయాడు. తల్లిదండ్రులకు తీరని వేదన మిగిల్చాడు.సిందేవాహి తాలూకాలోని నవర్గావ్ ప్రాంతంలో అనురాగ్ కుటుంబం నివసిస్తోంది. ఇటీవల జరిగిన నీట్ యూజీ పరీక్షలో మంచి ర్యాంక్ సాధించడంతో ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ మెడికల్ కాలేజీ లో అతడికి సీటు వచ్చింది. కోర్సులో చేరడానికి గోరఖ్‌పూర్ వెళ్లడానికి సిద్ధమవుతున్న క్రమంలో అనురాగ్ అనూహ్యంగా తనువు చాలించాడు. ఇంట్లో ఉరేసుకుని చనిపోయాడు. ఘటనా స్థలం నుంచి పోలీసులు అనురాగ్ రాసిన లేఖను స్వాధీనం చేసుకున్నారు. అయితే ఆ లేఖను మీడియాకు చూపించలేదు. డాక్టర్ కావడం ఇష్టం లేకనే అతడు ప్రాణాలు తీసుకున్నట్టు పోలీసు వర్గాలు వెల్లడించాయి. నవర్గావ్ పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. అనురాగ్ మరణంతో అతడి తల్లిదండ్రులు విషాదంలో మునిగిపోయారు. అనురాగ్ తెలివైన విద్యార్థి అని పొరుగువారు తెలిపారు. అతడి చెల్లి గత సంవత్సరం 12వ తరగతి పరీక్షల్లో జిల్లా టాపర్‌గా నిలిచిందని వెల్లడించారు. చదువుల విషయంలో చాలా మంది టీనేజర్లు ఒత్తిడికి గురవుతున్నారని విశ్లేషకులు అంటున్నారు. తల్లిదండ్రుల ఇష్టాలను కాదనలేక, తమకు ఇష్టంలేని చదువు చదవలేక నలిగిపోతున్నారు. చదువు కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, జీవితంలో అది ఒక భాగం మాత్రమేనని నిపుణులు సూచిస్తున్నారు. ఒకవేళ ఒత్తిడికి గురైతే తమ సమస్య గురించి కుటుంబ సభ్యులు, స్నేహితులతో పంచుకోవాలి. ఒంటరితనం నుంచి బయటపడటానికి మార్గాలు వెతకాలి. మీకు దగ్గరలోని మానసిక ఆరోగ్య నిపుణులను సంప్రదించాలి. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నడిచే హెల్ప్‌లైన్ నంబర్లలోనూ సంప్రదించి సహాయం పొందవచ్చు.

### భారత్‌పై టారిఫ్‌లను సరిచేసేందుకు

# సానుకూలంగా ఉన్నాం

విధించే ఆప్షన్‌ను ట్రంప్ పరిశీలిస్తున్నారని రూబియో చెప్పారు. "ఒక దశకు వచ్చాక ఆయన కొత్త ఆంక్షలను అమలు చేయవచ్చు. చాలా చేయగల సత్తా ట్రంప్‌నకు ఉంది. ఆయన మారుతున్న పరిణామాల ఆధారంగా నిర్ణయం తీసుకొంటున్నారు" అని తెలిపారు. అలాస్కా సదస్సు తర్వాత పుతిన్ చర్యలపై ట్రంప్ తీవ్ర నిరాశలో ఉన్నారు. ట్రంప్ ఈ యుద్ధాన్ని ప్రారంభించలేదని.. ఆయనకు, గత అధ్యక్షుడి నుంచి ఈ బాధ్యతలు వచ్చాయన్నారు. దీనిని ముగించాలని ఆయన భావిస్తున్నారు.అమెరికా, భారత విదేశాంగ మంత్రులు మార్కో రూబియో, జై శంకర్‌లు భేటీ అయ్యారు. న్యూయార్క్ ప్యాలెస్‌లో 80వ ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం నేపథ్యంలో వీరి భేటీ జరిగింది. యూఎన్‌జీఏలో భారత విదేశాంగ మంత్రి జైశంకర్‌తో సమావేశమయ్యాను. వాణిజ్యం, రక్షణ, ఔషధాలు వంటి కీలకమైన అంశాలపై మేము ద్వైపాక్షిక చర్చలు జరిపాం' అని రూబియో ఎక్స్‌లో పోస్టు చేశారు.అమెరికా పర్యటనలో భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ ట్రంప్ కార్యవర్గంలోని కీలక వ్యక్తులతో భేటీ అవుతున్నారు. తాజాగా భారత్‌కు రాయబారిగా రానున్న సెర్గియో గోర్‌తో కూడా భేటీ అయ్యారు. మరోవైపు అమెరికా - భారత్‌ల మధ్య వాణిజ్య చర్చలు కూడా సాఫీగా జరుగుతుండటంతో.. ఈ ఏడాది చివర్లో జరగాల్సిన క్వాడ్ కూటమి సదస్సుకు డొనాల్డ్ ట్రంప్ హాజరయ్యే అవకాశాలున్నాయి. న్యూఢిల్లీలో చర్చలు సానుకూలంగా జరుగుతున్నాయని ట్రంప్ కార్యవర్గంలోని కీలక వ్యక్తులు చెబుతున్నారు.

## రష్యా విమానాలను కూల్చేయాలి

అవసరమైతే రష్యా విమానాలను కూల్చేస్తామన్నారు. ఆయన ఐరాస జనరల్ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో భేటీ అయ్యారు. ఆ తర్వాత ఓ విలేకరి "అలాంటి పరిస్థితుల్లో నాటో సభ్యదేశాలు రష్యా విమానాలను కూల్చేయాలా?" అని ప్రశ్నించారు. దీనికి ట్రంప్ 'అవును.. కూల్చేస్తాం' అని బదులిచ్చారు. ఇటీవల కాలంలో నాటో దేశాలైన పోలాండ్, ఎస్తోనియా సహా పలు నాటో సరిహద్దుల్లోకి రష్యా ఫైటర్‌జెట్లు చొరబడిన విషయం తెలిసిందే. ఆ తర్వాత ట్రంప్ రష్యా, ఉక్రెయిన్‌పై ట్రూత్‌లో ఓ పోస్టు పెట్టారు. ఉక్రెయిన్ 2014 నుంచి కోల్పోయిన తన భూభాగం మొత్తం తిరిగి పొందగలదని తాను అభిప్రాయానికి వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ యుద్ధం రష్యాను ఓ 'పేపర్ టైగర్'గా మార్చేసింది. ఈ యుద్ధం వల్ల దానికి భారీగా డబ్బు ఖర్చవుతోంది..

## క్లాసులకు వెళ్తున్న ఇషా అంబానీ..



**ముంబై:**రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత, భారత అపర సంపన్నుడు ముకేశ్ అంబానీ నీతా అంబానీల ముద్దుల తనయ ఇషా అంబానీ. వీరి నుంచే వ్యాపార పటిమను అలవరచుకున్న ఈమె రిలయన్స్ ఇండస్ట్రీస్ గ్రూప్‌లోని పలు అనుబంధ విభాగాలను విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఇద్దరు పిల్ ్లలకు తల్లి అయిన ఆమె చాలా కాలంగా వీక్లీ క్లాసులకు వెళు ్తున్నారు.ఇషా అంబానీ క్లాసులకు వెళ్తున్నది తన కోసం కాదు.. తన ఇద్దరు కవల పిల్లలు కృష్ణ, ఆదియా శక్తి కోసం. పిల్లల మెదడు సంపూర్ణ ఎదుగుదల ?కోసం వారిని ప్రత్యేక తరగతులకు పంపుతున్నారు. పిల్లలతో తానూ ఓపిగ్గా ఆ తరగతులకు హాజరుతున్నారు. ఈ విషయాన్ని క్లాసులు నిర్వహించే టాకిల్ రైట్ అనే సంస్థ వ్యవస్థాపకురాలు వెల్లడించారు.టికిల్ రైట్ ఫౌండర్ మునీరా సాహెబ్ దత్తానీ మాట్లాడుతూ ఇషా అంబానీ తన కవలలు ఆరు నెలల వయస్సు నుండి తమ తరగతులకు హాజరవుతున్నారని వెల్లడించారు. పిల్లల కోసం సమయాన్ని కేటాయించి ఇషా చూపుతున్న చొరవను ఆమె ప్రశంసించారు. ఈ సందర్భంగా తరగతుల గురించి ఆమె అనుభవాన్ని ఇషా అంబానీ వివరించారు. తనతోపాటు పిల్లలు ఆదియా, కృష్ణ క్లాస్‌లను ఆస్వాదిస్తారని చెప్పారు.ప్రస్తుతం రిలయన్స్ రిటైల్ వ్యాపారాలకు, ఫౌండేషన్‌కు డైరెక్టర్‌గా ఉన్న ఇషా అంబానీ, 2018 డిసెంబరులో ఆనంద్ పిరమల్‌ను వివాహ మాడారు. ఈ జంట 2022 నవంబర్ 19న కవలలకు జన్మనిచ్చారు. వీరికి ఆదియా శక్తి, కృష్ణ అని పేర్లు పెట్టారు. వీరికి ఐవీఎఫ్ ద్వారా ఈ పిల్లలు కలిగారు. ఈ విషయాన్ని ఎటువంటి సంకోచం లేకుండా ఇషా అంబానీ చెబుతుంటారు.

## గిరిజన బాలికలు విద్యాభ్యాసంలో ముందుండాలి

**రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం**



**నిజామాబాద్ జిల్లా బ్యూరో సెప్టెంబర్ 24 (జనం సాక్షి) :**
గిరిజన బాలికల విద్యాభ్యాసానికి ప్రభుత్వం అధిక నిధులు కేటాయిస్తోందని, గిరిజన బాలికలు విద్యాభ్యాసంలో ముందుండాలని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్ మండలం దుర్కి శివారులో నూతనంగా నిర్మించిన గిరిజన బాలికల ఇంటర్, డిగ్రీ వసతి గృహాన్ని ఆయన బుధవారం రాష్ట్ర ఆగ్రోస్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాలరాజ్ తో కలిసి రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ శాసనసభ్యులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పోచారం మాట్లాడుతూ దూర ప్రాంతాల నుంచి చదువు కోసం బాన్సువాడకు వచ్చే గిరిజన బాలికలకు వసతి లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఈ వసతి గృహ నిర్మాణంతో సమస్యలు తీరనున్నాయని స్పష్టం చేశారు. అనంతరం బాన్సువాడ, నస్రుల్లాబాద్ మండల బంజారా నాయకులు ఏర్పాటు చేసిన బోగ్ బండార్ కార్యక్రమంలో పాల్గొని జగదంబా మాత, సేవాలాల్ మహరాజ్ చిత్రపటాలకు పూజలు చేశారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన అధికారి సతీష్, బీర్కూర్ మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు దుర్గం శ్యామల, మాజీ ఎంపీపీ విఠల్, బద్యానాయక్, మోహన్ నాయక్, బలరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో నిర్లక్ష్యం తగదు

**నిజామాబాద్ జిల్లా కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి**



**నిజామాబాద్ జిల్లా సెప్టెంబర్ 24 (జనం సాక్షి) :**
ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలలో స్పష్టమైన పురోగతి కనిపించేలా క్షేత్ర స్థాయిలో చిత్తశుద్ధితో కృషి చేయాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. లక్ష్యసాధనకు కృషి చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జక్రాన్పల్లి మండల పరిషత్ కార్యాలయంలో కలెక్టర్ బుధవారం ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై ఎంపీడీఓ, ఎంపీఓ, హౌసింగ్ ఏ.ఈ, గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సుదీర్ఘ సమీక్ష జరిపారు. మండలంలోని ఒక్కో గ్రామం వారీగా మంజూరైన ఇందిరమ్మ ఇళ్లు ఎన్ని, వాటిలో ఎన్ని గ్రౌండింగ్ అయ్యాయి, ఎన్ని ఇండ్లు ఏ దశలో నిర్మాణంలో ఉన్నాయి తదితర వివరాలను కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణాలలో వెనుకంజలో ఉన్న గ్రామ కార్యదర్శులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. క్రమం తప్పకుండా సమీక్ష నిర్వహిస్తూ నిర్దేశిత లక్ష్యాల సాధన కోసం స్పష్టమైన దిశానిర్దేశం చేస్తున్నప్పటికీ, ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని నిలదీశారు. ఈ తరహా వైఖరిని ఎంతమాత్రం ఉపేక్షించబోమని, ఇళ్ల నిర్మాణాలలో స్పష్టమైన పురోగతి సాధించాల్సిందేనని స్పష్టం చేశారు. మంజూరీలు పొందిన వారందరూ తక్షణమే ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా లబ్ధిదారులను ప్రోత్సహిస్తూ క్షేత్రస్థాయిలో పక్కాగా పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఉచిత ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇళ్ల నిర్మాణాలకు దరఖాస్తు చేసుకున్న వారికే, అర్హతను పరిశీలించి ఇళ్లను మంజూరు చేశామని కలెక్టర్ గుర్తు చేశారు. అలాంటప్పుడు ఇంటి నిర్మాణం పనులు చేపట్టేలా లబ్ధిదారులను ప్రోత్సహించడానికి ఇబ్బంది ఏమిటని ప్రశ్నించారు. దసరా పండుగ లోపు అన్ని ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభం అయ్యేలా చొరవ చూపాలని అన్నారు. ఆయా నిర్మాణ దశలను బట్టి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు నేరుగా వారి ఖాతాలలో బిల్లులు జమ చేస్తున్నామని గుర్తు చేశారు. ఇంటి నిర్మాణానికి సుముఖంగా లేని లబ్దిదారుల నుండి ఇదివరకే లిఖిత పూర్వకంగా లేఖలు తీసుకుని, వారి స్థానంలో అర్హులైన ఇతర లబ్ధిదారులకు ఇళ్లను మంజూరు చేశామని గుర్తు చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరూ ఇంటి నిర్మాణం పనులు చేపట్టేలా చూడాలని, ఇందిరమ్మ కమిటీల సహకారం తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. బిల్లుల చెల్లింపులలో సాంకేతిక సమస్యలు ఉత్పన్నం కాకుండా ఉండేందుకు లబ్ధిదారుల వివరాలు ఆధార్ కార్డు వివరాలతో సరిపోలి ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలని, ఎవైనా తేడాలు ఉంటే ఆధార్ అప్డేట్ చేయించాలని అన్నారు. ఈ సందర్భంగా పలువురు గ్రామ పంచాయతీ కార్యదర్శులు సాంకేతిక సమస్యలను కలెక్టర్ దృష్టికి తేగా, అప్పటికప్పుడే కలెక్టర్ రాష్ట్ర హౌసింగ్ ప్రధాన కార్యాలయం అధికారులను ఫోన్ ద్వారా సంప్రదించి సమస్యలను పరిష్కరింపజేశారు. దసరా పండుగ తరువాత తాను ఇందిరమ్మ ఇళ్ల ప్రగతిపై మళ్ళీ సమీక్ష నిర్వహిస్తానని అన్నారు. సమీక్షలో జక్రాన్పల్లి ఎంపీడీఓ సతీష్, ఎంపీఓ యూసఫ్ పాల్గొన్నారు.



## జమ్మికుంట నాయని చెరువు గండిని పూడ్చండి

**జమ్మికుంట, సెప్టెంబర్ 24 (జనం సాక్షి):**
జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని నాయిని చెరువుకు వర్షాకాలం ప్రారంభ దశలో వర్షాలు ఎక్కువ కురిసి వరద నీరు రావడంతో చెరువు నిండి కట్ట తెగిపోయే ప్రమాదం ఉన్నదని, అలాగే చెరువు నిండడం వలన గృహ సముదాయాలకు నీరు వచ్చే ప్రమాదం ఉన్నందున మున్సిపల్ అధికారులు చెరువు కట్టకు గండి కొట్టారు. ఇప్పుడు వర్షాలు తగ్గుముఖం పట్టి మీద నుండి వచ్చే వరద నీరు తగ్గడంతో చెరువులో ఉన్నటువంటి నీరు పూర్తిగా బయటకు వెళ్లే ప్రమాదం ఉన్నదని,తక్షణమే అట్టి గండిని పూడ్చివేయాలని లేకుంటే నీరు పూర్తిగా బయటకు వెళుతుందని రైతులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అట్టి ప్రదేశాన్ని పరిశీలించి గండిని పూడ్చాలని వారు కోరుకుంటున్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మీటర్లు మంజూరు చేయాలి

**మాజీ మంత్రి జీవన్ రెడ్డి**



**రాయికల్ సెప్టెంబర్ 24(జనం సాక్షి):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల మంజూరి లబ్ధిదారుల ఇంటి నిర్మాణానికి విద్యుత్ మీటర్లు మంజూరు చేయాలని మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు.బుధవారం రాయికల్ పట్టణం పర్యటనలో భాగంగా ఇందిరమ్మ లబ్ధిదారులు తాము ఇంటి నిర్మాణం చేపడుతున్నామని విద్యుత్ మీటర్లకు దరఖాస్తు చేసుకోగా విద్యుత్ శాఖ అధికారులు ఆంక్షలు పెడుతున్నారని విద్యుత్ మీటర్ల మంజూరు చేయించాలని ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు మాజీమంత్రి జీవన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. సత్వరం స్పందించిన మాజీ మంత్రి జీవన్ రెడ్డి సంబంధిత జగిత్యాల జిల్లా విద్యుత్ శాఖ ఉన్నతాధికారి సుదర్శనం,రాయికల్ విద్యుత్ శాఖ ఏఈ నవీన్‌తో చరవాణిలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల విద్యుత్ మీటర్ల సమస్యను అడిగి తెలుసుకున్నారు. నిరుపేదలైన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు విద్యుత్ మీటర్ల మంజూరుకై నిబంధనలలో సడలింపుతో అర్హులైన వాళ్లకు విద్యుత్ మీటర్లు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు మ్యాకల రమేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోపి రాజారెడ్డి, నాయకులు కొయ్యేడి మహిపాల్, బాపురపు నర్సయ్య, షాకీర్, బత్తిని భూమయ్య, దాసరి గంగాధర్, రాకేష్, సింగని రమేష్, రాజారెడ్డి, కొమ్ముల ఆదిరెడ్డి, ఏలేటి జలంధర్ రెడ్డి, కొత్తపెల్లి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు తూర్పు డివిజన్‌లో మంత్రి శ్రీధర్ బాబు పర్యటన



**మంథని, (జనంసాక్షి) :**
మంథని నియోజక వర్గం పరిధిలోని తూర్పు డివిజన్ లో రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు గురువారం పర్యటించను న్నారు. ఇందులో భాగంగా మధ్యాహ్నం 1-00 గంటలకు కాటారంలోని బి ఎల్ ఎ గార్డెన్ లో కాటారం, మహా ముత్తారం, పలిమెల, మహ దేవపూర్, మలహర్‌రావు సంబంధించిన గ్రామాలలో 300 ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారు లకు మంజూరు పత్రాలను అందజేయను న్నారు. అనంతరం 4 మండలాల 50 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులతో పాటు, 90 కల్యాణ లక్ష్మి చెక్కులను మంత్రి శ్రీధర్ బాబు చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేయనున్నారు. అలాగే చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ వారి పోషణ్ మహా మాసం అంగన్వాడి లబ్ధిదారులకు నిర్వహించే కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు పాల్గొననున్నారు.

# కరీంనగర్‌లో ఘనంగా బతుకమ్మ సంబురాలు





- సాంప్రదాయ బతుకమ్మ వైభవం
- మంత్రుల సీతక్క, పొన్నం ప్రభాకర్ హాజరు
- మహిళల ఆర్థిక శ్రేయస్సే లక్ష్యం
- ట్రాన్స్‌జెండర్లకు ప్రభుత్వం అండ

**కరీంనగర్, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):** కరీంనగర్ జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో నగరంలోని మహాత్మా జ్యోతిబా మైదానంలో బుధవారం రాత్రి జిల్లా స్థాయి బతుకమ్మ సంబురాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి మహిళా, శిశు సంక్షేమం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ వందల సంవత్సరాల సాంప్రదాయం, ఆచారాలకు నిదర్శనమని, ఈ సంప్రదాయం మరో వెయ్యి ఏళ్లు వర్ధిల్లాలని ఆకాంక్షించారు. మహిళలంతా ఐక్యంగా, సంతోషంగా జీవించాలని, వారి ఆర్థిక, రాజకీయ శ్రేయస్సు కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని, ఎల్లప్పుడూ తోడుగా ఉంటుందని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి సంకల్పం మేరకు కోటి మందిని కోటీశ్వరులుగా తీర్చిదిద్దే దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. ట్రాన్స్‌జెండర్లకు కూడా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, వారు సమాజంలో అంతర్భాగమని, గౌరవించాలని సూచించారు. హైదరాబాద్‌లో 40 మంది ట్రాన్స్‌జెండర్లకు ట్రాఫిక్ నియంత్రణలో ఉద్యోగాలు కల్పించిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు.
మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. రాష్ట్రంలోని మహిళలను ఆర్థికంగా స్వావలంబన చేసే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో బతుకమ్మ సంబరాలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. హైదరాబాద్‌లో టూరిజం అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్‌లతో పాటు మహిళా కమిషన్ రాష్ట్ర చైర్పర్సన్ నేరెళ్ల శారద, తెలంగాణ ఉమెన్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్పర్సన్ బండ్రు శోభారాణి, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, మానకొండూరు శాసనసభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి బతుకమ్మ సంబరాల్లో పాల్గొని, మహిళలతో కలిసి బతుకమ్మ ఆడి, పాటలు పాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేశం, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీ కిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డిఆర్ఓ వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్ బాబు, అంగన్వాడి టీచర్లు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, మెప్మా, డీఆర్డీఏ సభ్యులు, మహిళా పోలీసులు, అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## దసరా ఉత్సవాల వాల్ పోస్టర్ ఆవిష్కరణ

- ఈఎల్‌వి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు
- 10,000 మంది పాల్గొనే విధంగా ఏర్పాట్లు
- ఈఎల్ వి ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ భాస్కర్



**మర్రిగూడ, సెప్టెంబర్ 24 (జనం సాక్షి) :** దసరా ఉత్సవాల వాల్ పోస్టర్ ఆవిష్కరణ. అక్టోబర్ 3న నల్గొండ జిల్లా గట్టుప్పల మండల కేంద్రంలో ఈఎల్ వి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే దసరా ఉత్సవాల వాల్ పోస్టర్లను బుధవారం గట్టుప్పల మండల కేంద్రంలో ఈఎల్ వి ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ భాస్కర్ ఆవిష్కరించారు. సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడ నిర్వహించని విధంగా దసరా వేడుకలను భారీ ఏర్పాట్లతో ఘనంగా మండల కేంద్రంలో జానపద కళాకారులతో ఆటపాటతో 10,000 మంది పాల్గొని భోజనాలు చేసే విధంగా ఏర్పాట్లు చేస్తామని ఈఎల్ వి ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ భాస్కర్ అన్నారు. ప్రతి ఒక్కరూ కార్యక్రమంలో పాల్గొని తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు.

## నిఫా సిల్వర్ జూబ్లీ వేడుకల్లో కోలగని శ్రీనివాస్‌కు అవార్డు



**కరీంనగర్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):**
ఢిల్లీలో జరిగిన నేషనల్ ఇంటిగ్రేటెడ్ ఫోరం ఆఫ్ ఆర్ట్స్ అండ్ ఆక్టివిటీస్ ( నిఫా) సిల్వర్ జూబ్లీ వేడుకల్లో ఒకటో డివిజన్, తీగల గుట్టపల్లి తాజా మాజీ కార్పొరేటర్, నిఫా రాష్ట్ర సెక్రటరీ కోలగని శ్రీనివాస్ అవార్డు అందుకున్నారు. ఢిల్లీలోని భారత్ మండపంలో ఈ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం జరిగింది. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో వివిధ జిల్లాలలో నుండి అధిక సంఖ్యలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసినందుకు గాను నిఫా తెలంగాణ రాష్ట్ర సెక్రెటరీ కోలగాని శ్రీనివాస్ కి అవార్డు దక్కింది. ఈ సందర్భంగా కోలగని శ్రీనివాస్ మాట్లాడుతూ... రక్తదానం ఒకరికి జీవితాన్ని ప్రసాదిస్తుందనే భావనతో అనేక జిల్లాల్లో రక్తదాన శిబిరాలను అత్యధికంగా చేపట్టడం జరిగిందని తెలిపారు. అన్ని దానాల్లో కన్నా రక్తదానం ఓ మహత్తర కార్యక్రమమని, అలాంటి కార్యక్రమాల్లో తాను భాగస్వామ్యం కావడం , ఈ సేవకు అవార్డు దక్కడం సంతోషంగా ఉందన్నారు.

## ఫీవర్ కేసులకు మెరుగైన వైద్య అందించాలి

- పాఠశాల అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి
- మంథని, రామగిరి మండలాల్లో పర్యటించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



**మంథని, (జనంసాక్షి) :**
ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ఫీవర్ కేసులకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మంథని, రామగిరి మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. మంథని పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి, జేబిఎస్ స్కూలు, జడ్పీహెచ్ఎస్ బాలికల స్కూలు, గురుకుల పాఠశాల, రామగిరి మండలం రత్నాపూర్ గ్రామంలోని మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ స్కూల్, బేగంపేట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ.. మంథని ఆసుపత్రి కు వచ్చే ఫీవర్ కేసులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, సీజనల్ వ్యాధుల లక్షణాలు గల వారికి ల్యాబ్ లో నిర్ధారణ పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ఓపి సేవలను పెంచాలని, ఓపి సమయంలో వైద్యులు పూర్తి సమయం అందుబాటులో ఉండాలని అన్నారు. మంథని పట్టణ కేంద్రంలోని జెబిఎస్ పాఠశాలలో కాంపౌండ్ వాల్, టాయిలెట్స్, కిచెన్ షెడ్ నిర్మాణ పనులు, బాలికల జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో కాంపౌండ్ వాల్, టైల్స్, అదనపు తరగతి గది నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని అన్నారు. గురుకుల పాఠశాలలో డార్మటరీ మరమతు పనులు చేపట్టాలని, లైటింగ్ వ్యవస్థ ఇంప్రూవ్ చేయాలని అన్నారు.రామగిరి మండలం రత్నాపూర్గ్రామంలోని అప్పర్ ప్రైమరీ స్కూల్ లో డి.ఎం.ఎఫ్.టి 9 లక్షల రూపాయలతో చేపట్టిన మరమ్మత్తు పనులు ప్రారంభించాలని, వర్షపు నీరు నిలువ ఉండకుండా గ్రౌండ్ లెవెలింగ్ చేయాలని అన్నారు. బేగంపేట జడ్పీహెచ్ఎస్పాఠశాలలో డయాస్ నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట మంథని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజశేఖర్, మంథని ఏఈ పిఆర్ అనుదీప్, రామగిరి ఏఈ పిఆర్ వరలక్ష్మి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మాచారెడ్డి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ





**కామారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 24 (జనం సాక్షి) :**
సస్పెక్ట్ ప్రతి కదలికపై నిఘా పెట్టాలి బాధితులతో గౌరవంగా వ్యవహరించి తక్షణ పరిష్కారం చేయాలి కేసుల నమోదు, రికార్డుల నవీకరణ ఎప్పటికప్పుడు చేయాలి దేవాలయాలు, ప్రార్థన స్థలాలు, బ్యాంకుల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి చేసి, సీసీ కెమెరాల ఏర్పాటు కోసం కృషి చేయాలి. డయల్ 100 కాల్స్‌కి వెంటనే స్పందించి, సంఘటన స్థలానికి చేరుకుని సమస్య పరిష్కారానికి కృషి చేయాలి సిబ్బంది నీతి, నిజాయితీతో బాధ్యతయుతంగా తమ విధులను నిర్వర్తించాలని జిల్లా ఎస్పి యం. రాజేష్ చంద్ర, అన్నారు. బుధవారం మాచారెడ్డి పోలీస్టేషన్‌ను వార్షిక తనిఖీలలో భాగంగా జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర,సందర్శించి తనిఖీ చేశారు. ముందుగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, సిబ్బంది అందరితో మాట్లాడడం జరిగింది. సిబ్బంది అన్ని విషయాల గురించి తెలియజేశారు. ఎస్పీ ఎస్ఐ, సిఐ, ఏఎస్పి కు తెలియజేసిన విషయాలు సిబ్బందికి అందరికి తెలిశాయా లేదా అని పరిశీలించినారు. అనతరం పోలీస్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం పోలీస్టేషన్లో రికార్డ్స్ ను, పరిసరాలను తనిఖీ చేసి పోలీస్టేషన్ రిసెప్షన్, లాకప్, మెన్ బ్యారెక్, టెక్నికల్ రూం, పరిసరాలను పరిశీలించారు. పోలీస్టేషన్ పరిధిలో ఎక్కువగా ఎలాంటి నేరాలు జరుగుతున్నాయి, పెండింగ్‌లో ఉన్న కేసులు, దర్యాప్తు వివరాలను మాచారెడ్డి ఎస్సై అనిల్‌ని అడిగి తెలుసుకున్నారు.బాధితుల పట్ల గౌరవంగా వ్యవహరిస్తూ ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించే దిశగా త్వరితగతిన సిబ్బందిని కేటాయించి బాధితులకు తగ న్యాయం చేయాలని సూచించారు. సస్పెక్ట్ ప్రతి కదలికపై నిఘా పెట్టాలని, నేరాల అదుపుకు పటిష్టమైన గస్తీ పెట్రోలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. బాధితుల పట్ల గౌరవంగా వ్యవహరిస్తూ, ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా సిబ్బందిని కేటాయించి బాధితులకు తగిన న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. కేసుల నమోదు, రికార్డుల నవీకరణ ఎప్పటికప్పుడు చేసి ఎలాంటి పెండెన్సీ లేకుండా ఉంచాలని సూచించారు.దేవాలయాలు, ప్రార్థన స్థలాలు, బ్యాంకుల్లో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసి, మరిన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి కృషి చేయాలని సూచించారు. డయల్ 100 కాల్స్‌కి వెంటనే స్పందించి సంఘటన స్థలానికి చేరుకోవాలని, ప్రతి సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు.కామారెడ్డి నుండి సిరిసిల్లకు వెళ్లే స్టేట్ హైవే మచారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్నందున రోడ్డు ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, ప్రమాదాలు జరిగే ప్రాంతాలను బ్లాక్ స్పాట్స్‌గా గుర్తించి నివారణ చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని సూచించారు. సాయంత్రం సమయాలలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించి రోడ్డు ప్రమాదాలను అరికట్టాలని ఆదేశించారు.దుర్గా నవరాత్రి సందర్భంగా అవాంచనీయ, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా, పోలీసు బందోబస్తు మరియు నైట్ పేట్రోలింగ్‌ను మరింత పెంచాలని సూచించారు.
విలేజ్ పోలీసింగ్ ఆఫీసర్లు తమ గ్రామాలను తరచూ సందర్శించి ప్రజలతో సత్సంబంధాలు కలిగి నేరాల నివారణకు చురుగ్గా పనిచేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, విధుల్లో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఎస్పీ సూచించారు.
అలాగే సైబర్ నేరాలను అరికట్టే విధంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టి, ప్రజలకు సైబర్ సేఫ్టీపై సూచనలు ఇవ్వాలని, ప్రత్యేకంగా యువతలో సైబర్ అవగాహన పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ బి. చైతన్య రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ టి. శ్రీధర్, మచారెడ్డి ఎస్‌హెచ్ఓ యస్ అనిల్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## యూరియా సరిపడా అందుబాటులో ఉంచాలి

**ఎంసిపిఐ (యు) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వనం సుధాకర్**



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 24 (జనం సాక్షి) :** రైతుల పంటల ప్రయోజనార్థం వస్తున్న యూరియా బ్లాక్ కు తరలిస్తూ కొందరు ప్రైవేట్ డీలర్లు సొమ్ము చేసుకుంటున్నారని, ఇదంతా చూస్తూ వ్యవసాయ అధికారులు చూసినట్లు వ్యవహరిస్తున్నారని ఎం సిపిఐ (యు) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వనం సుధాకర్ ఆరోపించారు. జిల్లా కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని రైతులకు పంటల అదును దాటిపోతున్న ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కావడం లేదని ఒకవైపు రైతు తీవ్ర కష్టాల్లో ఉంటే వారిని పట్టించుకునే నాదుడే కరువయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు ప్రైవేట్ డీలర్ల చేతుల్లోకి వెళ్లిన యూరియాకు అదనంగా రేటు పెంచుతూ లింకులు అంటగడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా రైతులకు సరిపడా యూరియా అందించి రైతాంగాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జబ్బర్ నాయక్ జిల్లా నాయకులు నర్సింలు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.





# తేజస్ డిఫెన్స్ అకాడమీలో ఫ్రెషర్స్ పార్టీ

- ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే విజయరమణరావు
- పరీక్షల్లో రాణించిన విద్యార్థులకు అభినందాలు

**కరీంనగర్ జిల్లా బ్యూరో, (జనంసాక్షి):** కరీంనగర్ పట్టణ కేంద్రంలోని కొత్తపల్లిలో తేజస్ డిఫెన్స్ అకాడమీ చైర్మన్ సతీష్ రావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఫ్రెషర్స్ పార్టీ మహోత్సవ కార్యక్ర మం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పెద్దపల్లి శాసనసభ్యులు చింత కుంట విజయరమణరావు పాల్గొన్నారు. ముందుగా అకాడమీ యాజమాన్యం, విద్యార్థులు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికి, వారిని సత్కరించారు. తదుపరి ఇంటర్, ప్రథమ, ద్వితీయ పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులను ఎమ్మెల్యే విజయరమణరావు అభినందించి, ప్రత్యేక బహుమతులు ప్రదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు డిఫెన్స్ రంగంలో రాణించేలా కఠిన కృషి చేయాలని, అకాడమీ నిర్వహణకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తేజస్ డిఫెన్స్ అకాడమీ చైర్మన్ సతీష్ రావు, యాజమాన్య సభ్యులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొని, ఉత్సవాంశలో మునిగి ఆనందించారు.


# కరీంనగర్ కోట ఇన్స్టిట్యూట్‌లో ముందస్తు బతుకమ్మ వైభవం

- విద్యార్థినుల సాంప్రదాయ వేడుకలు
- సంస్కృతి పరిరక్షణకు పిలుపు : డాక్టర్ అంజిరెడ్డి



**కరీంనగర్, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):**
కరీంనగర్‌లోని కోట ఇన్స్టిట్యూట్‌లో ముందస్తు బతుకమ్మ వేడుకలు బుధవారం అత్యంత వైభవంగా జరిగాయి. విద్యార్థినులు రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలను అందంగా సిద్ధం చేసి, సాంప్రదాయ క్రీడలతో సందడి చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ డాక్టర్ అంజిరెడ్డి చిన్నమైల్, కోట ఇన్స్టిట్యూట్ చైర్మన్ డాక్టర్ డి. అంజిరెడ్డి హాజరై, తెలంగాణ సంస్కృతి వైభవాన్ని విశదీకరించారు. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే అసాధారణమైన పండుగ అని డాక్టర్ అంజిరెడ్డి చిన్నమైల్ పేర్కొన్నారు. తెలంగాణ సాంస్కృతిక సంపదను కాపాడి నిలబెట్టిన పూర్వీకులకు సమాజం ఎల్లప్పుడూ ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ప్రతి పుష్పం ఒక చరిత్రను, భావాన్ని సూచిస్తుందని, బతుకమ్మ కేవలం పండుగ మాత్రమే కాక, ప్రకృతి పట్ల గౌరవం, మహిళల ఆత్మగౌరవానికి ప్రతీక అని ఆయన వివరించారు. మహిళలు కుటుంబానికి, సమాజానికి ఆధారమని, వారిని గౌరవించడం మన బాధ్యత అని అన్నారు. తెలంగాణ రాష్ట్ర పండుగగా బతుకమ్మ గుర్తింపు పొందడం ప్రతి తెలంగాణవాసికి గర్వకారణమని తెలిపారు. భారతదేశం సమగ్ర అభివృద్ధి సాధించాలంటే, తెలంగాణ మట్టిని, ఆచారాలను, సంస్కృతిని కొత్త తరానికి అందించాల్సిన అవసరం ఉందని కళాశాల చైర్మన్ డాక్టర్ డి. అంజిరెడ్డి గుర్తుచేశారు. పల్లెలో పుట్టిన సంప్రదాయాలను పట్టణాల వరకు చేర్చి, ఆచరించడం భవిష్యత్ తరాల బాధ్యతగా విద్యార్థులను ఉత్సాహపరిచారు. ఈ వేడుకలో కళాశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జానపద గీతాలు, బతుకమ్మ చుట్టూ నృత్యాలు, పల్లె వాతావరణాన్ని తలపించే సాంప్రదాయ విందులు ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

*కొత్త మెడికల్ షాప్ పెట్టాలంటే ప్రభుత్వ డ్రగ్ ఇన్స్పెక్టర్ పరిశీలించి అనుమతి ఇవ్వాలి. కానీ కోరుట్లలో అధికారి అనుమతి అవసరం లేదు. 'అంతా నేనే చూసుకుంటా' అంటూ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు వేముల వీరభద్రయ్య తీరు, జిల్లా ఔషధ నియంత్రణ అధికారిగా అవతారం ఎత్తుతున్నాడు. కొత్త షాపు తెరవాలన్నా, అనుమతులు కావాలన్నా అన్నీ తానే నిర్వహిస్తూ అధికారిని ముందు ంచి ముడుపులు ముట్టజెప్పించాలి. ఏ షాపు తనికీ చేయాలనేది అధ్యక్షుడు చెప్పాలి, అప్పుడే జరుగుతుంది. అతని చేతులు తడిపితేనే ఓపెనింగ్, లేకపోతే ముప్పు తిప్పలు పడుడే.*



# నేను చెప్పిందే ఫైనల్... అన్ని నేనే చూసుకుంటా!

- మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడి జులుం..
- ముడుపులు ముట్టజెప్పితే తప్ప అనుమతులు ముందుకు సాగనితీరు..
- డ్రగ్ ఇన్స్పెక్టర్ అవతారమెత్తిన అసోసియేషన్ అధ్యక్షుడు

**కోరుట్ల, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):**
ఈ మధ్యకాలంలో కోరుట్లలో ఒక మెడికల్ షాప్ కొత్తగా ప్రారంభించాలని జగిత్యాల డ్రగ్ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో సంప్రదించి, సంబంధిత పత్రాలు సమర్పించి, ప్రభుత్వ రుసుము చెల్లించారు. ఇక్కడే అసలు కథ మొదలైంది. ఆఫీసులో పని చేసే ఒక పొరుగుసేవకు ఉద్యోగి, సంబంధిత వారి సమీప బంధువు కార్యాలయం ముందే ఒక జెరాక్స్ సెంటర్‌లో కలిసి వెళ్ళమని చెప్పాడు. అక్కడికి వెళ్లాక కోరుట్ల మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడిని కలిసి, 'నేను చెప్పినప్పుడు కలసి, అతను చెప్పిన మామూలు ఇవ్వండి, అంతే అతనే చూసుకుంటాడు. సార్‌తో ఆయనే మాట్లాడుతాడు' అని పంపించారు. రెండు రోజుల తర్వాత ఫోన్ రానే వచ్చింది. కొత్తగా షాపు తెరవాలనుకున్నవారు అధ్యక్షుడు వేముల వీరభద్రయ్యను ఆయన నిర్వహిస్తున్న మెడికల్ షాపులో కలిశారు. అప్పుడు వీరభద్రయ్య 'మీ షాపు ఓపెన్ చేయాలంటే సార్ ముప్పది వేలు అడిగాడు, అవి ఇవ్వాలి, లేకపోతే మీరు షాపు ఓపెన్ చేయడం కష్టం, మీ ఇష్టం' అని సెలవిచ్చాడు. ఏమి చేసేది లేక అతడు అడిగిన ముప్పది వేలు ముట్టజెప్పారు. ఆ డబ్బులు ముట్టాక కొత్తగా పెట్టే షాపు వివరాలు అధికారి వలె నోట్ చేసుకున్నాడు. 'మీరు ఇచ్చిన డబ్బులు సారుకె పోతాయి, నాకు ఏమీ మిగలదు' అంటూ సెలవిచ్చాడు. మా యూనియన్‌లో మెంబర్‌షిప్ కోసం అదనంగా ఐదు వేలు కూడా అడుగుతాడు. ఇవన్నీ వీడియో రికార్డింగ్ అవుతున్నట్లు తెలియక అధ్యక్షుడికి డబ్బులు ఇచ్చేవారు తీసుకుని, ఇతడు లెక్కిస్తున్నవి 'ఇవన్నీ సారుకె ముడతాయి, నేను ఎలా చెప్పినా అట్లే సారు వింటాడు' అని విర్రవీగాడు.
మెడికల్ షాపులను పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు సరైన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అధికారులు మామూలు మత్తులో పడి, మెడికల్ షాపుల పర్యవేక్షణను విస్మరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సంవత్సరానికి ఒక్కసారి కూడా ఈ మందులు అమ్ముతున్నారా, ఎంత స్టాక్ ఉంది, స్టాకు సంబంధిత లెక్కలు, బ్రాండెడ్ కంపెనీల మందులా, నారక మందులా అనే కనీస పర్యవేక్షణ చేయకపోవడం వల్ల మెడికల్ షాపుల నిర్వహణపై దృష్టి సాధించకపోతే, నారక మందుల కారణంగా ప్రజలు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని వాపోతున్నారు. పట్టణంలో ప్రజల అమాయకత్వాన్ని ఆశ్రయంగా చేసుకుని జెనరిక్ మందులను బ్రాండెడ్‌లుగా అమ్ముతున్న మెడికల్ షాపు నిర్వాహకులపై చర్యలు తీసుకోకపోతే ప్రజల ప్రాణాలకు భద్రత ఉండదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు కళ్ళు తెరిచి జిల్లాలోని మెడికల్ షాపులపై సోదాలు చేసి, అధికారి కానరాకపోవడం, అధ్యక్షుడు చెప్పిన షాపులపైనే తనికీలు చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. అధ్యక్షుడు చెప్పిన మెడికల్ షాపులపైనే అధికారి వస్తున్నాడని, ఈ మధ్యకాలంలో పట్టణంలోని కల్లూరు రోడ్‌లో ఓ అనుమతులేని మందుల దుకాణాన్ని తనికీ చేసి పెద్ద మొత్తంలో వసూళ్లకు పాల్పడ్డారని ఒక పత్రికలో వార్త సంచలనం సృష్టించింది. ఏది ఏమైనా అధ్యక్షుడి జేబులో అధికారి అని గుసగుసలు వినిపిస్తున్నాయి.
దుకాణం పెట్టాలన్నా, రెన్యూవల్ కావాలన్నా అంతా ఈ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడే చూసుకుంటాడు. ఎవరైనా ఎదురు మాట్లాడితే వారి మందుల దుకాణం తనికీ జరుగుడే. కాదు పోదు అంటే ఏడాది మామూలు పెంచుడే. అధ్యక్షుడి మాటే అధికారి మాట. ఆరు నెలలకు ఒక్కసారి అధికారి అడిగాడని చెప్పి ఒక్కో మెడికల్ షాపు నుంచి నాలుగు వేల నుంచి ఆరు వేల రూపాయలు వసూలు చేస్తున్నారని సమాచారం. అయినా విచ్చలవిడిగా అనుమతులు ఉన్నా లేకపోయా మందులు విక్రయాలు జరుగుతున్నాయని మెడికల్ షాపు నిర్వాహకులు బహిరంగంగా అధ్యక్షుడి తీరును ఎండగడుతున్నారు. పట్టణంలో మెడికల్ షాపు పెట్టాలంటే జిల్లా అధికారి నుంచి లైసెన్స్ కావాలి. లైసెన్స్ కావాలంటే మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడి జేబు అధికారి జేబు నింపాలి. కాదు కూడదు అంటే ఆ షాపుకు లైసెన్స్ రాదు. ఈ రకమైన అవినీతి, రౌడీజం ప్రజల ప్రాణాలను పాతాళానికి పంపుతున్నాయని, అధికారులు త్వరగా చర్యలు తీసుకోవాలని డిమాండ్‌లు గుర్తుచేస్తున్నాయి.

## కరీంనగర్ అభివృద్ధికోసం
# కలిసి పనిచేస్తున్నాం

- ప్రజల సంక్షేమమే మా మొదటి ప్రాధాన్యత.
- బండి సంజయ్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి.
- కేంద్ర మంత్రితో కలిసి మహాశక్తి అమ్మవారిని దర్శించుకున్న పొన్నం



**కరీంనగర్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):**
హుస్నాబాద్ నియోజకవర్గం సహా కరీంనగర్ పార్లమెంట్ అభివృద్ధి విషయంలో రాజకీయాలకు అతీతంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ తో కలిసి పనిచేస్తున్నట్లు రాష్ట్ర బీసీ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి విషయంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ సహకరిస్తున్నారని చెప్పారు. దసరా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని బండి సంజయ్ ఆహ్వానం మేరకు పొన్నం ప్రభాకర్ కరీంనగర్ లోని మహాశక్తి అమ్మవారి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ తో కలిసి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ గత 18 ఏళ్లుగా అమ్మవారి మాల వేసుకుని మహా శక్తి ఆలయంలో సర్వేజనా సుఖినోభవ (అందరూ బాగుండాలి) దీక్ష చేపట్టి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. బండి సంజయ్ ఆహ్వానం మేరకు ఇక్కడికి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నట్లు తెలిపారు. రాజకీయాలు వేరు, అభివృద్ధి వేరు అని పేర్కొన్న పొన్నం ప్రభాకర్ సహృద్భావ వాతావరణంలో నియోజకవర్గ అభివృద్ధి కోసం కలిసి పనిచేస్తున్నట్లు చెప్పారు. కేంద్ర మంత్రిగా ఉన్నందున హుస్నాబాద్ సహా కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో ఏ సమస్య ఉన్నా బండి సంజయ్ దృష్టికి తీసుకెళుతున్నామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి విషయంలో కేంద్ర మంత్రి సహకరిస్తున్నారని పేర్కొన్నారు. తామిద్దరం(బండి సంజయ్, పొన్నం ప్రభాకర్) విద్యార్థి సంఘం నుండి ఎదిగిన నేతలమని, ప్రజల సంక్షేమమే తమ ప్రాధాన్యత అని చెప్పారు. జిల్లా అభివృద్ధిలో మా పాత్ర ఉండేలా పనిచేస్తున్నామని వివరించారు. దేవాలయ దర్శన కార్యక్రమంలో కరీంనగర్ పార్లమెంటు ఇంచార్జి వెలిచాల రాజేందర్ రావు, కాంగ్రెస్ నేతలు, భక్తులు పాల్గొన్నారు.

## డివిజన్ ఏసీపీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన
# కరీంనగర్ పోలీస్ కమిషనర్



**కరీంనగర్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):** కరీంనగర్ కమీషనరేట్ పరిధిలోని టౌన్ డివిజన్ ఏసీపీ కార్యాలయాన్ని బుధవారం రోజు కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం సందర్శించారు. కార్యాలయంలో గల పెండింగ్ కేసుల పై సమీక్ష చేసి వాటికి గల కారణాలు తెలుసుకున్నారు. త్వరితగతిన వాటిని పూర్తి చేయాలనీ సూచించి అర్బన్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్ల పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలని, ప్రతి నెల వారికి సంబందించిన నూతన సమాచారం ఎప్పటికప్పుడు సేకరించి నమోదు చేసుకోవాలన్నారు. సైబర్ నేరాల సంఖ్య రోజు రోజుకీ పెరుగుతున్నందున, వాటి బారిన పడకుండా ప్రజల్లో అవగాహన పెంచాలని, పెండింగ్ వారెంట్ల ను అమలు చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలపై చర్చించి తరుచూ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను బ్లాక్ హెూల్స్ గా గుర్తించి, రోడ్డు ప్రమాదాల నివారణకై చర్యలు చేపట్టాలన్నారు. గంజాయి రవాణా, అక్రమ ఇసుక రవాణా, పి.డి.ఎస్. బియ్యం, పేకాట స్థావరాలను గుర్తించి ఆడేవారిని పట్టుకోవడం, వంటి వాటిని గుర్తించి తగిన కేసులు నమోదు చేసి, వాటిపై ఉక్కుపాదం మోపాలన్నారు. ఈ కార్యక్రమం లో టౌన్ ఏసీపీ వెంకటస్వామి, ఇన్స్పెక్టర్లు వన్ టౌన్ రామ్ చందర్ రావు, టూ టౌన్ ఇన్స్పెక్టర్ సృజన్ రెడ్డి , త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ జాన్ రెడ్డి, ఉమెన్ పోలీసు స్టేషన్ ఇన్స్పెక్టర్ శ్రీలతతో, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా వైద్యాధికారిని రజిత



**ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 24, (జనంసాక్షి) :** ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని గొల్లపల్లి, వెంకటాపూర్ గ్రామాలలో గల సబ్ సెంటర్‌లో స్వస్థ్ నారి స్వశక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా మండల వైద్యాధికారులు బుధవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరాన్ని జిల్లా వైద్యాధికారిని డాక్టర్ రజిత, డాక్టర్ నయీమా సందర్శించి వైద్య సిబ్బందికి, రోగులకు పలు సుచనలు ఇచ్చారు. రికార్డులను పరిశీలించారు. జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ ప్రభుత్వం నిరుపేదల కోసం వైద్య శిబిరాలు నిర్వహిస్తుందన్నారు. అట్టి వైద్య శిబిరాలను వైద్య సిబ్బంది ప్రముఖ డాక్టర్లు ఉచితంగా వైద్య శిబిరం నిర్వహించి, మందులను ఇవ్వడం జరుగుతుందన్నారు. అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు కూడా చేయడం జరుగుతుందని, షుగర్, బీపి, రక్తపరీక్షలు నిర్వహించి మహిళలకు ఆరోగ్యకరమైన సమతుల పోషకహారం, వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రతపై వైద్య సిబ్బంది చైతన్యవంతులు చేయాలన్నారు. ఈ వైద్య శిబిరాలను ప్రజలు స్వదినియోగం చేసుకోవాలని కోరారు. ఈ వైద్య శిబిరంలో పిల్లల డాక్టర్ ఓంకార్ 22 మంది పిల్లలకు, 37 మంది మహిళలకు , 11 మంది మగవారికి వైద్య పరీక్షలు చేసి తగిన మందులు ఇవ్వడం జరిగిందన్నారు.

# రాజన్న ఫిర్యాదు చేసేదెలా..?


- బోర్డుపై విశ్రాంత ఉద్యోగుల ఫోన్ నంబర్లు.
- అలసత్వం వీడని అధికారులు.. విమర్శిస్తున్న భక్తులు.




**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి (జనం సాక్షి) :** శ్రీ రాజరాజేశ్వర దేవస్థానంలో అనధికారికంగా డబ్బులు వసూలు చేస్తే ఫిర్యాదు చేసేందుకు ఏర్పాటు చేసిన బోర్డుపై పదవి విరమణ పొందిన అధికారుల ఫోన్ నెంబర్లు దర్శనమిస్తుండడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ఏదైనా సమస్య ఎదురైతే విశ్రాంతి ఉద్యోగులకు చెప్పాలా అనే ప్రశ్నలను భక్తులు లేవనెత్తుతున్నారు. శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం కళ్యాణ కట్టలలో అధికారికంగా నిర్ణయించిన రుసుము మినహాయించి అధికంగా డబ్బులు వసూలు చేసిన వారిపై ఫిర్యాదు చేసేందుకు ఆలయ అధికారులు గోడపై ఒక బోర్డులను ఏర్పాటు చేస్తూ దానిపై ఫోన్ నెంబర్లను నమోదు చేశారు.చాలా ఏళ్ల క్రితం ఏర్పాటుచేసిన బోర్డును అధికారులు మారిన మార్చకపోవడంతో అసలు అధికంగా డబ్బులు వసూలు చేసే కళ్యాణకట్ట తీరుపై ఫిర్యాదు చేసేది ఎలా అంటూ భక్తులు అయోమయం చెందుతున్నారు. ఇప్పటికప్పుడు సమాచారాన్ని మెరుగుపరచాల్సిన ఆలయ అధికారులతో పాటు, సమాచార విభాగం నిద్రమత్తులో ఉన్నట్లు దీనితో అర్థమవుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రస్తుతం అవిభాగం చూస్తున్న అధికారుల ఫోన్ నెంబర్లను నమోదు చేయాలని భక్తులు కోరుతున్నారు.

# కోల్‌కత్తాలో ఐఎన్‌టీయుసి పాల్గొనే సమావేశానికి కోర్టు గ్రీన్ సిగ్నల్

- కోల్‌ఇండియా బోనస్‌పై కీలక చర్చలు
- కుట్రలు ఖండించిన కోర్టు
- ఐఎన్‌టీయుసి శ్రేణుల సంతోషం
- దీపావళి ముందు కార్మికులకు ఆశ



**గోదావరిఖని, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):**
కోల్‌కత్తాలో రేపు జరగనున్న కోల్‌ఇండియా లిమిటెడ్ (సిఐఎల్) ప్రోడక్షన్ లింక్డ్ రివార్డ్ (పీఎల్ఆర్) దీపావళి బోనస్‌పై జేబీసీసీఐ-6వ స్టాండర్డైజేషన్ సమావేశానికి దేశంలోని అతిపెద్ద కార్మిక సంఘటనా సంస్థ అయిన ఐఎన్‌టీ యుసి (ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్) పాల్గొననుంది. ఈ సమావేశం 2.5 లక్షల మంది కార్మికుల బోనస్‌ను నిర్ణయించే కీలకమైనదిగా ఉంది. ఐఎన్‌టీయుసి పాల్గొనకుండా చేయాలని కొన్ని యూనియన్లు చేసిన కుట్రపూరిత ప్రయత్నాలను కలకత్తా హైకోర్టు ఖండించింది. అదే విధంగా, ఐఎన్‌టీయుసిని హేళన చేసిన మరికొన్ని యూనియన్లకు గట్టి సమాధానం చెప్పుతూ, కోర్టు ఈ రోజు స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసింది. ఈ తీర్పుతో ఐఎన్‌టీయుసి శ్రేణులు, దేశవ్యాప్తంగా కార్మికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.
ఈ సమావేశంలో ఐఎన్‌టీయుసి అనుబంధ ఐఎన్ఎమ్ఎస్ (నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ మైన్ వర్కర్స్) ఫెడరేషన్ తరఫున అధ్యక్షుడు అనూప్ సింగ్, ప్రధాన కార్యదర్శి ఎస్క్యూ జామా, ఐఎన్‌టీయుసి సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ పాల్గొనను న్నారు. జయమంగల్ సింగ్, ఎస్క్యూ జామా ప్రధాన ప్రతినిధులుగా, జనక్ ప్రసాద్ ఆల్టర్నేట్ మెంబర్‌గా హాజరవుతారు. భారతీ య మజ్దూర్ సంఘ్ (బీఎమ్ఎస్) వంటి యూనియన్లు ఐఎన్‌టీయుసి పాల్గొనకుండా అడ్డుకోవడానికి ప్రయత్నించి నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఐఎన్‌టీయుసి చివరిసారిగా 2017లో స్టాండర్డైజేషన్ సమావేశంలో పాల్గొన్నది. కలకత్తా హైకోర్టు డివిజన్ బెంచ్, సింగిల్ బెంచ్ ఆర్డర్‌ను ధృవీకరిస్తూ, ఐఎన్‌టీయుసి అనుబంధ ఐఎన్ఎమ్ఎస్‌ను స్టాండర్డైజేషన్ కమిటీలో చేర్చాలని స్పష్టం చేసింది. కోల్‌ఇం డియా ఈ ఆదేశాన్ని సవాలు చేసినా, కోర్టు తిరస్కరించింది. దీపావళి, దుర్గాపూజా పండుగల ముందు బోనస్‌పై అనిశ్చితి ఉండటంతో కార్మికులు ఆందోళన చెందారు. కానీ కోర్టు తీర్పుతో ఇప్పుడు సమావేశం జరగడం ఖాయమైంది. కోల్ మినిస్ట్రీ, కోల్‌ఇండియా ఈ మధ్య ఏదైనా ఆధారం గా బోనస్ లేదా ఎక్స్‌గ్రేషియా చెల్లింపు చేస్తాయా అనేది ఇంకా అనిశ్చితం.
ఐఎన్‌టీయుసి ఫెడరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఏకే ఝా మాట్లాడుతూ, కోర్టు ఆర్డర్‌తో ఐఎన్‌టీయుసి ప్రతినిధులు కోల్‌కత్తాలో పాల్గొంటారని, బీఎమ్ఎస్ ఐఎన్‌టీయుసిని అడ్డుకోవడానికి ప్రయత్నించిందని ఆరోపించారు. దీర్ఘకాలం నుంచి ఐఎన్‌టీయుసి లోపలి వివాదాలు, చంద్రశేఖర్ దుబే (దాదై దుబే), ఐఎన్‌టీయుసి అధ్యక్షుడు జీ. సంజీవ రెడ్డి మధ్య గొడవల వల్ల కోల్‌ఇండియా జేబీసీసీఐ సమావేశాలకు ఐఎన్‌టీయుసిని అనుమతించకపోయింది. జేబీసీసీఐ-11లో కూడా ఐఎన్‌టీయుసి సీట్లు ఖాళీగా ఉంచారు. ఈ తీర్పు కార్మికుల హక్కులకు, ఐఎన్‌టీయుసి స్థానానికి బలం చేకూర్చిందని దేశవ్యాప్తంగా ఐఎన్‌టీయుసి శ్రేణులు స్వాగతిస్తు న్నాయి. దుర్గాపూజా పండుగ ముందు బోనస్ చెల్లింపు జరగడంతో కార్మికులకు ఆశాకిరణంగా మారింది.

## మానేరు వాగు పాత బ్రిడ్జిని
# కూల్చిందెవరు?



- కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల రహదారి బంద్
- సిద్దిపేట-కామారెడ్డి మధ్య రాకపోకలు నిలిచిపోయాయి
- మాజీ డిసిసి అధ్యక్షుడు మృత్యుంజయం
- అగ్రిమెంట్ రద్దు చేసి కొత్త పనులు చేపట్టాలి

**గంభీరావుపేట, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):**
రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలోని లింగన్నపేట, గంభీరావుపేట గ్రామాల మధ్య సంగమం చేసే మానేరు వాగుపై గతంలో పరిశీలించి, పాత బ్రిడ్జిని కూల్చి నూతన హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి పనులు ప్రారంభించినప్పటికీ, తాత్కాలిక మట్టి రోడ్డు వాగు ఉధృతికి కొట్టుకపోవడంతో సిద్దిపేట-కామారెడ్డి రహదారి పూర్తిగా బంద్ అయింది. ఈ ఘటనతో మండల ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్య తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మాజీ ఉమ్మడి జిల్లా డిసిసి అధ్యక్షులు, రాష్ట్ర అధికార ప్రతినిధి కటకం మృత్యుంజయం మానేరు వాగును పరిశీలించి, సంబంధిత కాంట్రాక్టర్ మీద తక్షణ చర్యలు తీసుకోవాలని, అధికారులకు తెలిపి ఆ కాంట్రాక్టర్ అగ్రిమెంట్‌ను రద్దు చేసి కొత్త వారికి ఇచ్చి త్వరగా పనులు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా మాట్లాడిన మృత్యుంజయం, గత 35 ఏళ్ల క్రితం పాటి రాజం హయాంలో లోలెవల్ బ్రిడ్జి నిర్మించి ఈ ప్రాంత ప్రజల రాకపోకలు సాఫీగా సాగేలా చేశారని గుర్తు చేశారు. అయితే, మాజీ బీఆర్ఎస్ ప్రభుత్వంలో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం కోసం పాత బ్రిడ్జిని కూల్చి మూడేళ్లుగా పనులు ప్రారంభించినా, కాంట్రాక్టర్ మాత్రం పనుల్లో నత్తనడకలు వేస్తూ పూర్తి నిర్లక్ష్యం వహించాడని విమర్శించారు. అటువంటి కాంట్రాక్టర్‌ను వెంటనే అగ్రిమెంట్ రద్దు చేసి, కొత్తవారికి అప్పగించి బ్రిడ్జి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని, అంతేకాక తాత్కాలికంగా మట్టి రోడ్డు వేసి ప్రజల రాకపోకలు కొనసాగేలా చూడాలని అధికారులకు సూచించారు. అధికారుల నిర్లక్ష్యమే ఈ పరిస్థితికి కారణమని, ప్రభుత్వం త్వరగా జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు.
ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హమీద్, పార్టీ నాయకులు రాజ్వీర్, వేషాల వెంకట్, అక్కపెల్లి బాలయ్య, పిట్ల వెంకన్న, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
25 సెప్టెంబర్ 2025

# ఆర్టీసీలో ఏఐ వినియోగం

- మరింత వేగంగా సేవలకు నిర్ణయం
- ఏఐ వినియోగం కోసం ప్రత్యేక టీమ్ ఏర్పాటు
- ఆర్టీసీ యాజమాన్యానికి మంత్రి పొన్నం అభినందన



హైదరాబాద్, సెప్టెంబర్ 24 (జనంసాక్షి) : అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తమ సేవలను మెరుగు పరుచుకునేందుకు ఆర్‌టిసి మరో గొప్ప అడుగు వేసింది. అన్ని రంగాలను ప్రభావితం చేస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ను విస్తృతంగా వినియోగించాలని నిర్ణయించింది. తమ ఉత్పాదకత పెంపు, సిబ్బంది పనితీరు, ఆరోగ్య స్థితి పర్యవేక్షణ, ఖర్చుల తగ్గింపు, రద్దీకి అనుగుణంగా సర్వీసుల ఏర్పాటుతో పాటు సేవలను మరింత ప్రజానుకూలంగా తీర్చిదిద్దడమే ఈ నిర్ణయానికి ప్రధాన ఉద్దేశం. దేశంలోనే తొలిసారిగా ఏఐ వినియోగించిన ప్రజా రవాణా సంస్థగా తెలంగాణ ఆర్‌టిసి నిలిచింది. ఏఐ ప్రాజెక్టు అమలుకు హన్స ఈక్విటీ పార్ట్‌నర్స్ ఎల్‌ఎల్‌పి అనే సంస్థ ఆర్‌టిసికి తోడ్పాటు అందిస్తోంది. సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యం, ప్రణాళికాబద్ధమైన అమలు వ్యూహాలను అందించి, అన్ని డిపోల్లో సులభంగా అమలు జరిగేలా ఆ సంస్థ సహకరిస్తోంది. సంస్థలో ఏఐ వినియోగం కోసం ఒక ప్రత్యేక టీంను యాజమాన్యం ఏర్పాటు చేసింది. సాంకేతిక పరిజ్ఞానంపై ఆసక్తి, అవగాహన ఉన్న అధికారులను గుర్తించి ఆ టీంలో ప్రాధాన్యం ఇచ్చింది. ఏఐ వాడకంపై ఆ టీమ్‌కు హన్స ఈక్విటీ పార్ట్‌నర్స్ శిక్షణ ఇస్తోంది. ఏఐ ప్రాజెక్టులో భాగంగా మొదట 40 వేల మంది సిబ్బంది ఆరోగ్య స్థితిని పర్యవేక్షిస్తున్నారు. గ్రాండ్ హెల్త్ ఛాలెంజ్ లో భాగంగా ఉద్యోగులకు చేసిన వైద్య పరీక్షల ఆధారంగా ఆరోగ్య పరిస్థితిని ఏఐ, మెషిన్ లెర్నింగ్ సహకారంతో అంచనా వేస్తున్నారు. మొదట పైలట్ ప్రాజెక్టుగా ఆరు డిపోల్లో అమలు చేయగా మంచి ఫలితాలు వచ్చాయి. ప్రస్తుతం అన్ని డిపోల్లోనూ ఈ ప్రాజెక్టును అమలు చేస్తున్నారు. త్వరలోనే ఏఐ ద్వారా ఆటోమెటిక్ షెడ్యూలింగ్‌ను సంస్థ ప్లాన్ చేస్తోంది. రోజు, తిథి, పండుగలు, వారాల్లో ఏఐ మెషిన్ లెర్నింగ్ సహకారంతో ప్రయాణికుల రద్దీని అంచనా వేసి ఆ మేరకు బస్సులను సంస్థ ఏర్పాటు చేయనుంది. ఆర్‌టిసిలో ఏఐ ప్రాజెక్ట్ అమలు తీరు గురించి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఇటీవల రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సంస్థ ఉన్నతాధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ఆర్‌టిసి ఎండి, విసి సజ్జనార్, ఆర్‌టిసి ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఆధునిక రవాణా అవసరాలకు అనుగుణంగా ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు సంస్థను ఆర్థికంగా, సాంకేతికంగా బలోపేతం చేయడం కోసం 2021 నుంచే అమలు చేస్తున్న స్ట్రాటజిక్ డిప్లొయ్మెంట్ ప్లాన్ (ఎస్‌డిపి) కీలక పాత్ర పోషిస్తున్నదని ఆర్‌టిసి ఉన్నతాధికారులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రతి నెలా ఎస్‌డిపి సమీక్షా సమావేశాలను నిర్వహిస్తూ, స్వల్పకాలిక దీర్ఘకాలిక లక్ష్యాలను నిర్దేశిరచుకుని, వాటి అమలులో సంస్థ చురుకైన చర్యలు తీసుకుంటున్నదని వివరించారు. తమ పనితీరు మెరుగుపరచుకోడానికి ఎఐని వినియోగించుకోవడంపై మంత్రి పొన్నం ప్రభాకర్ సంతోషం వ్యక్తం చేశారు. ఆర్‌టిసి ఉన్నతాధికారుల కృషిని అభినందించారు. ప్రపంచంలో ప్రస్తుతం ఏఐ ప్రభావితం చేయని రంగమే లేదని, రవాణా వ్యవస్థలో మార్పులను గుర్తించి ప్రజల రవాణా అవసరాలకు అనుగుణంగా ఎఐని వినియోగించుకోవాలని భావించడం గొప్ప విషయమని ఆయన అన్నారు. ఈ ఎఐ ప్రాజెక్ట్ అమలుకు సమష్టిగా పనిచేసి ఆర్‌టిసి మరింత అభివృద్ధి సాధించేలా అధికారులందరూ కృషి చేయాలని సూచించారు. సంస్థ అభివృద్ధిలో భాగస్వాములుగా పనిచేస్తూ 2021 నుంచి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద ఎస్‌డిపి అమలు, ఎఐ ప్రాజెక్ట్ రూపకల్పనలో విశేషంగా తోడ్పడిన హన్స ఈక్విటీ పార్ట్‌నర్స్ ఎల్‌ఎల్‌పికి చెందిన త్రినాధబాబు, సునీల్ రేగుళ్లను మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేకంగా అభినందించి, సన్మానించారు. సంస్థను భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా బలోపేతం చేసేందుకే ఎఐ ప్రాజెక్టు అమలు చేస్తున్నామని ఆర్‌టిసి ఎండి సజ్జనార్ తెలిపారు. ఎఐ వినియోగం వల్ల సేవల్లో మరింత వేగం, కచ్చితత్వం, స్పష్టత ఉంటు-oదని ఆయన వివరించారు. ప్రయాణికుల అవసరాలు, ట్రాఫిక్ పరిస్థితులను బట్టి స్మార్ట్ షెడ్యూలింగ్ సాధ్యమవుతుందని చెప్పారు. ప్రజా రవాణా రంగంలో సాంకేతికతను వినియోగించి దేశంలోనే తొలి మోడల్‌గా టిజిఎస్ ఆర్‌టిసి నిలవడం గర్వకారణమని అన్నారు. ఈ సమావేశంలో సంస్థ ఈడీలు మునిశేఖర్, ఖుశ్రోషా ఖాన్, వెంకన్న, రాజశేఖర్, సిటిఎం శ్రీదేవి, సిపిఎం ఉషాదేవి, సిఈఐటి శ్రీదేవి తదితర అధికారులు పాల్గొన్నారు.

# అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై న్యాయవిచారణ

- రామ్మోహన్ నాయుడికి ఎఫ్‌ఐపీ డిమాండ్

న్యూఢిల్లీ, సెప్టెంబర్24 (జనంసాక్షి) : అహ్మదాబాద్‌లో జరిగిన 171 విమాన ప్రమాద ఘటనపై న్యాయ విచారణ జరపాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడిని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ పైలట్స్ ఎఫ్‌ఐపీ డిమాండ్ చేసింది. ఈ మేరకు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడికి ఎఫ్‌ఐపీ రాసింది. ఈ లేఖను సోమవారం అంటే.. సెప్టెంబర్ 22న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడికి రాసింది. కానీ ఈ లేఖ బుధవారం బహిర్గతమైంది. అయితే ఈ ప్రమాదంపై ప్రస్తుతం దర్యాప్తు చేస్తున్న ఎయిర్ క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) వైఖరిపై ఈ సందర్భంగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ పైలట్స్ పెదవి విరించింది. ఆ క్రమంలో ఏఏఐబీపై తీవ్ర విమర్శలు గుప్పించింది. ఏఏఐబీ దర్యాప్తు.. విమానయాన రంగంలోని పైలట్ల నైతికతపై ప్రతికూల ప్రభావం చూపు అవకాశం ఉందంటూ ఆందోళన వ్యక్తం చేసింది. అంతేకాదు.. ఈ విచారణలో భాగంగా 171 విమాన ప్రమాదంలో మరణించిన పైలట్ సబర్వాల్ నివాసానికి ఏఏఐబీ అధికారులు ఆగస్ట్ 30వ తేదీన వెళ్లారు. ఆ క్రమంలో కెప్టెన్ సబర్వాల్ తండ్రితో ఏఏఐబీ అధికారులు వ్యవహరించిన తీరుపై ఎఫ్‌ఐపీ ఆక్షేపించింది. ఈ ఏడాది జూన్ 12వ తేదీన అహ్మదాబాద్ ఎయిర్ పోర్ట్ నుంచి లండన్‌కు ఎయిర్ ఇండియా విమానం టేకాఫ్ అయింది. ఆ కొన్ని సెకన్లకే విమానం హాస్టల్ భవనంపై కుప్పకూలింది. దీంతో ఒక్కరు మినహాయించి.. విమాన ప్రయాణికులతోపాటు-హాస్టల్‌లో భోజనం చేస్తున్న మెడికోలు సైతం మరణించారు. ఈ ప్రమాదంలో మొత్తం 260 మందికి పైగా మరణించారు. దీంతో ఈ ప్రమాద ఘటనను దర్యాప్తు వివాదంలో చిక్కుకుంది. పైలట్ తప్పిదమే కారణమన్నట్లుగా ఏఏఐబీ నివేదిక స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఈ ప్రమాద ఘటనపై న్యాయ విచారణ జరిపి.. అసలు వాస్తవాలను వెలుగులోకి తీసుకు రావాలని కేంద్ర మంత్రికి రాసిన లేఖలో ఎఫ్‌ఐపీ పేర్కొంది.

# ఈడీ విచారణకు హాజరైన సోనూసూద్



న్యూఢిల్లీ, సెప్టెంబర్24 (జనంసాక్షి) : బాలీవుడ్ నటుడు సోనూ సూద్ బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ విచారణకు హాజరయ్యారు. నిషేధిత బెట్టింగ్ యాప్‌లకు ప్రచారం చేసిన కేసులో విచారణకు రావాలని ఈడీ గతంలో సోనూ సూద్‌కి సమన్లు జారీ చేసింది. అయితే కొన్నిరోజులుగా పంజాబ్‌లోనే ఉండి వరద బాధితులకు అండగా నిలిచిన సోనూ తాజాగా ఢిల్లీలోని ఈడీ కార్యాలయానికి చేరుకున్నారు. విచారణలో భాగంగా.. బెట్టింగ్ యాప్‌ల ప్రచారం వాటితో సోనూ సూద్‌కి ఉన్న సంబంధాలు ప్రచారానికి తీసుకున్న డబ్బుల గురించి అధికారులు ఆయనను ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. ఈ కేసులో ఇప్పటికే పలువురు సినీ, క్రీడా ప్రముఖులను ఈడీ విచారించింది. ఇటీవల సురేశ్ రైనా, యువరాజ్ సింగ్, నటి మంచు లక్ష్మి, నటు-డు విజయ్ దేవరకొండ, రానా కూడా విచారణకు హాజరయ్యారు. చట్టవిరుద్ధమైన బెట్టింగ్ కార్యకలాపాలను ప్రోత్సహించడం, నల్లధనం లావాదేవీలకు సంబంధించిన ఆరోపణలపై ఈడీ దర్యాప్తు చేస్తోంది. ఇందులో భాగంగానే పలువురు సెలబ్రిటీలను ఈడీ ప్రశ్నిస్తోంది.

# 'సీఎం ప్రజావాణి'కి బ్యాటరీ వెహికల్

- వృద్ధులు, వికలాంగులకు ఉచిత రవాణా కోసం వినియోగం
- పూజలు చేసి బ్యాటరీ వాహనాన్ని ప్రారంభించిన చిన్నారెడ్డి, దివ్య దేవరాజన్

హైదరాబాద్ (జనంసాక్షి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టి విజయవంతంగా ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్న ముఖ్యమంత్రి ప్రజావాణికి రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా బ్యాటరీ వాహనాన్ని మంజూరు చేసింది. రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్, ప్రజావాణి ఇన్చార్జి డాక్టర్ జి చిన్నారెడ్డి, సీఎం ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ బ్యాటరీ వాహనానికి మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో మంగళవారం పూజలు నిర్వహించి లాంఛనంగా ప్రారంభించారు. సీఎం ప్రజావాణి కార్యక్రమానికి వివిధ సమస్యలపై ధరఖాస్తులు అందజేసేందుకు వచ్చే వృద్ధులు, వికలాంగులకు ప్రధాన రహదారి మేన్ గేటు నుంచి పిటిషన్లు అందజేసే భవనం వరకు ఉచితంగా రవాణా సౌకర్యం కల్పించేందుకు ఉద్దేశించి రూ. ఏడు లక్షల విలువ చేసే బ్యాటరీ వాహనాన్ని వినియోగించనున్నారు.

# గిన్నీస్ బతుకమ్మ వేదిక సరూర్‌నగర్‌కు మార్పు

- వర్షాల హెచ్చరిక నేపథ్యంలో కీలక నిర్ణయం

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (జనంసాక్షి) : బతుకమ్మ ఉత్సవాలను ఎల్‌బి స్టేడియం నుంచి సరూర్‌నగర్ స్టేడియానికి మార్చారు. ఈనెల 28న ఎల్.బీ. స్టేడియంలో నిర్వహించ తలపెట్టిన గిన్నిస్ బుక్ రికార్డ్ బతుకమ్మ ఈవెంట్ ను 29 వ తేదీకి వాయిదా వేసినట్లు- రాష్ట్ర పర్యాటక శాఖ తెలియచేసింది. ఈ వరల్డ్ బుక్ రికార్డ్ బతుకమ్మ ఉత్సవాన్ని ఎల్.బీ. స్టేడియంలో కాకుండా సరూర్ నగర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్టు-తెలిపింది. సరూర్ నగర్ లో సెప్టెంబర్ 29 న నిర్వహించే అతిపెద్ద బతుకమ్మ ఉత్సవానికి పెద్ద సంఖ్యలో మహిళలు హాజరవుతారని తెలిపింది. వరసగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపిన నేపథ్యంలో ఎల్.బి స్టేడియం నుండి సరూర్ నగర్ స్టేడియంకు మార్చినట్లు- ఒక ప్రకటనలో పర్యాటక శాఖ తెలియచేసింది.

## ప్రతిపక్ష హోదా ఇవ్వాలంటూ జగన్ పిటిషన్

- స్పీకర్ తదితరులకు హైకోర్టు నోటీసులు
- విచారణ అక్టోబర్ 4కు వాయిదా



అమరావతి, సెప్టెంబర్ 24 (జనంసాక్షి) : తనకు ప్రతిపక్ష హోదా ఇవ్వాలని స్పీకర్‌ను ఆదేశించాలని కోరుతూ మాజీ సీఎం జగన్ వేసిన పిటిషన్‌పై బుధవారం హైకోర్ట్‌లో విచారణ జరిగింది. ఈ నేపథ్యంలో ప్రతివాదులుగా ఉన్న అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, సెక్రటరీ జనరల్ ప్రసన్నకు మార్‌కు న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. గతంలో జగన్ వేసిన పిటీ-షన్‌ను కూడా ఈ పిటిషన్‌కు కలపాలని ఆదేశం చింది. గతంలో జగన్ రాసిన లేఖపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు రూలింగ్ ఇచ్చారు. ప్రజలు ఇవ్వని ప్రతిపక్ష హోదాను తామెలా ఇస్తామని ప్రశ్నించారు. రాజ్యాం గం, అసెంబ్లీ నిబంధనలు అంగీకరించవని ఆయన స్పష్టం చేశారు. స్పీకర్ రూలింగ్‌పై హైకోర్ట్‌ను జగన్ ఆశ్రయించారు. తనకు ప్రతిపక్ష హోదా ఇవ్వాలని స్పీకర్‌ను ఆదేశించాలని పిటిషన్ వేశారు. ఈ మేరకు విచారణ చేపట్టిన హైకోర్టు విచారణను అక్టోబర్ 4కు వాయిదా వేసింది.

# జీపీవోలు ప్రభుత్వ సంకల్పాన్ని నెరవేర్చాలి


- క్షేత్రస్థాయిలో మెరుగైన సేవలను అందించి, భూ సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దాలి
- జీపీవోల ఆత్మీయ సమ్మేళనంలో తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మెన్ వి.లచ్చిరెడ్డి



కరీంనగర్ (జనంసాక్షి) : గ్రామ స్థాయిలో ప్రజలకు, రైతులకు మేలు జరగాలనే ప్రభుత్వ సంకల్పం జీపీవో (గ్రామ పాలన అధికారులు)లు నెరవేర్చాలని తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ వి. లచ్చిరెడ్డి అన్నారు. ఇటీవల రెవెన్యూ శాఖలో నియమకమైన జీపీవోలు అంకిత భావంతో పని చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆయన సూచించారు. జీపీవోలపై ప్రభుత్వం పెట్టిన గురుతర బాధ్యతను అనునిత్యం గుర్తించుకోవాలన్నారు. బుధవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల ఐకాస ఆధ్వర్యంలో గ్రామ పాలన అధికారుల ఆత్మీయ సమ్మేళనము కరీంనగర్ కలెక్టరేట్ రోడ్డులోని రెవెన్యూ గార్డెన్స్ లో జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న లచ్చిరెడ్డి నూతనంగా నియామకమైన జీపీవోలకు భూభారతి చట్టంపై అవగాహన, విధులు/బాధ్యతలతో పాటు పారదర్శకత, అంకితభావంతో కూడిన పౌరసేవలపై ఆయన దిశా నిర్దేశం చేశారు. తెలంగాణ రాష్ట్ర గ్రామీణ రైతాంగానికి, ప్రజలకు మెరుగైన సేవలను క్షేత్రస్థాయిలోనే అందించాలనే సంకల్పంతో పాటు గ్రామీణ రెవెన్యూ వ్యవస్థ బలోపేతం, పునర్నిర్మాణంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సంపూర్ణ సహకారం, భూ భారతి చట్టం అమలుతో జీపీవో వ్యవస్థ ఏర్పాటు సాధ్యమైందన్నారు. జీపీవోల సమస్యలను నాకు వదిలేసి ప్రజల సమస్యల పరిష్కారం బాధ్యత ను జీపీవో లు స్వీకరించాలన్నారు. తెలంగాణలోని ప్రతి గ్రామాన్ని రెవెన్యూ, భూ సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దాలని ఆయన సూచించారు. రెవెన్యూ చట్టాలకు సంబంధించి తెలంగాణ రెవెన్యూ పత్రికను నడపడం జరుగుతుందన్నారు. గతంలో ఐదు వేల మంది ఉంటే, నేడు 10వేల పై చిలుకు రెవెన్యూ ఉద్యోగులను రెవెన్యూ శాఖలోకి తీసుకోవడం జరిగిందన్నారు. జీపీవోలు ఉద్యోగం భావన తెలిసి ఉండాలన్నారు. ఏ ఒక్కరు తప్పు చేసినా అది మొత్తం వ్యవస్థకు చెడ్డ పేరు వస్తుందన్నారు. ప్రజలతో సఖ్యతగా ఉండాలని సూచించారు. జీపీవోల సమస్య తీరిందని, ఇతరుల సమస్యలను విస్మరించవద్దన్నారు. కారుణ్య నియామకాలకు సంబంధించి త్వరలోనే తీపి కబురు వస్తుందన్నారు. ప్రజలకు మంచి సేవ చేస్తారని నేను భావిస్తున్నానని, కింది స్థాయి, నుండి ఉన్నత స్థాయి వరకు పదోన్నతులు వచ్చేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. భూ జీపీవో ల విధులు, పదోన్నతులు కూడా చాలా పకడ్బందీగా రూపొంచడం జరుగుదని, ఈ రోజు జీపీవోల వేతనాలకు సంబంధించి ప్రభుత్వ పెద్దలు, సీసీఎల్ఏ దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. త్వరలోనే వేతనాలు అందుతాయని తెలిపారు. ఉద్యోగుల జేఏసీ చైర్మెన్ లచ్చిరెడ్డి సారథ్యంలో గ్రామ పాలన అధికారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని టీజీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు బాణాల రాంరెడ్డి అన్నారు. రెవెన్యూ వ్యవస్థను చిన్నాభిన్నం చేసిన వ్యక్తులే నేడు మళ్ళీ మన మధ్య తిరుగుతున్నారని అన్నారు. పదోన్నతుల విషయంలో కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. జీపీవో లు ఎలాంటి ప్రలోభాలకు లోను కావద్దని సూచించారు. టీజీటీఏ జనరల్ సెక్రటరీ రమేష్ పాక మాట్లాడుతూ దేశ భవిష్యత్తుకు యువత ఎంత కీలకమో, రెవెన్యూ వ్యవస్థకు జీపీవోలు అంతే కీలకమన్నారు. పోరాడి సాధించుకున్న ఉద్యోగంను ఒక యగ్నంగా భావించి ప్రజలకు నాణ్యమైన సేవలను సత్వరం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మెన్ లచ్చిరెడ్డితో పాటు టీజీటీఏ జనరల్ సెక్రటరీ రమేష్ పాక, టీజీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బాణాల రాంరెడ్డి, వి.బిక్షం, రాష్ట్ర అసోసియేషన్ ప్రెసిడెంట్ చిల్లా శ్రీనివాస్, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ కరీంనగర్ నగర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కిషన్, రమేష్, టీజీటీఏ కరీంనగర్ నగర్ కార్యదర్శి రాజేశ్వరి, నవాజ్ షరీఫ్, రిటైర్డ్ తహసీల్దార్ గంప శంకరయ్య, మల్లారం అర్జున్, ఆంజనేయ ప్రసాద్, సాయి కిషోర్, బాపుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లుండి బతుకమ్మకుంట ప్రారంభోత్సవం


- బతుకమ్మ ఉత్సవాలకు భారీగా ఏర్పాట్లు చేయండి: సిఎస్ ఆదేశం



హైదరాబాద్, సెప్టెంబర్ 24 (జనంసాక్షి) : ఈనెల 29 న సరూర్ నగర్ స్టేడియంలో నిర్వహించే భారీ బతుకమ్మ కార్యక్రమంతో పాటు-, 26న రాష్ట్ర ముఖ్యమంత్రి చే బతుకమ్మకుంట ప్రారంభోత్సవ కార్యక్రమాలను విజయవంతం చేయడానికి సమన్వయంతో కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు అధికారులను ఆదేశించారు. 29న నిర్వహించే కార్యక్రమం గిన్నిస్ బుక్ రికార్డ్ లో నమోదయ్యే అవకాశం ఉన్నందున విస్తృత ఏర్పాట్లు- చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న బతుకమ్మ ఉత్సవాల ఏర్పాట్లపై సంబంధిత ఉన్నతాధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా సి.ఎస్. మాట్లాడుతూ, అంబర్ పేట్ లో ప్రభుత్వం పునరుద్ధరించిన బతుకమ్మ కుంటను రాష్ట్ర ముఖ్యమంత్రి 26 న ప్రారంభిస్తారని, ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో బతుకమ్మలతో హాజరవుతున్నందున తగు ఏర్పాట్లను చేపట్టాలని జీహెచ్ఎంసీ, హైడ్రా అధికారులను ఆదేశించారు. బతుకమ్మ కుంట ప్రారంభోత్సవ కార్యక్రమానికి సంబంధించి ఆహ్వానాలను ప్రజాప్రతినిధులు, వీఐపీ లకు సకాలంలో పంపించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ను ఆదేశించారు. సాయంత్రం 4 గంటల నుండే పెద్ద సంఖ్యలో మహిళలు బతుకమ్మ కుంటకు చేరుకునే అవకాశమున్నందున శానిటేషన్, తగు బందోబస్తు, తాగునీటి సదుపాయం తదితర మౌలిక సదుపాయాలను కల్పించాలని అన్నారు. అదేవిధంగా, 29 న సరూర్ నగర్ స్టేడియంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గిన్నెస్ బుక్ రికార్డ్ బతుకమ్మ కార్యక్రమంలో దాదాపు 10 వేలకు పైగా మహిళలు బతుకమ్మలతో హాజరవుతారని వెల్లడించారు. సరూర్ నగర్ స్టేడియంలోనూ మహిళలకు మౌలిక సదుపాయాల ఏర్పాటు-తో పాటు- స్టేజి ఏర్పాట్లు-, విద్యుదీకరణ, శానిటేషన్ లను చేపట్టాలని రామకృష్ణా రావు స్పష్టం చేశారు. వీటితో పాటు-, 27 న ట్యాంక్ బండ్ పై సాయంత్రం బతుకమ్మ కార్నివల్, 29 న పీపుల్స్ ప్లాజా, 30 న ట్యాంక్ బండ్ పై పలు కార్యక్రమాలను ఏర్పాటు-చేశామని టూరిజం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ వెల్లడించారు. ఈ కార్యక్రమాలన్నింటినీ విజయవంతం చేయడానికి సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ఈ టెలి కాన్ఫరెన్స్ లో రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, నగర పోలీస్ కమిషనర్ సి.వీ. ఆనంద్, ఆర్టీసీ ఎం.డీ సజ్జనార్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, జీహెచ్ ఎంసీ కమిషనర్ కర్ణన్, ఫైర్ సర్వీసుల డీజీ నాగిరెడ్డి, టూరిజం ఎండీ వల్లూరు క్రాంతి, హైదరాబాద్, రంగా రెడ్డి జిల్లాల కలెక్టర్లు హరిచందన, నారాయణ రెడ్డి, సమాచార పౌర సంబంధాల స్పెషల్ కమిషనర్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ తల్లి ఫ్లైఓవర్‌గా తెలుగుతల్లి ఫ్లైఓవర్

- జీహెచ్ఎంసీ స్టాండింగ్ కౌన్సిల్ తీర్మానం



హైదరాబాద్, సెప్టెంబర్ 24 (జనంసాక్షి) : తెలుగుతల్లి ఫ్లై ఓవర్ పేరును తెలంగాణ తల్లి ఫ్లై ఓవర్‌గా మార్చాలని జిహెచ్ఎంసి నిర్ణయించింది. తెలంగాణ తల్లి ఫ్లైఓవర్ గా నామకరణం చేస్తూ కార్పొరేషన్‌కు సిఫార్సు చేయాలని జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ-సమావేశం ఆమోదించింది. నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన బుధవారం స్టాండింగ్ కమిటీ-సమావేశం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో జరిగింది. కమిటీ-సమావేశంలో 14 ఎజెండా అంశాలు, 10 టేబుల్ ఐటమ్ లకు స్టాండింగ్ కమిటీ- ఆమోదం తెలిపింది. 'స్టార్మ్ వాటర్ డ్రెయిన్ నిర్మాణం - సాయి నగర్ ఆర్చ్ నుండి టి.ఐ.ఎఫ్.ఆర్ కాంపౌండ్ వాల్ కల్వర్ట్ వరకు, వార్డు నం.3లోని కృష్ణారెడ్డి నగర్ రోడ్ నం.1, రోడ్డు నం.2, కాప్రా సర్కిల్, చర్లపల్లి లో రూ.285.00 లక్షల అంచనా వ్యయంతో నిర్మించేందుకు కార్పొరేషన్‌కు సిఫార్సు - పరిపాలన ఆమోదం కోరబడింది. సీసీ రోడ్డు నిర్మాణం - అల్వాల్ సర్కిల్ వార్డు నం.133లో హై టెన్షన్ లైన్ మార్గంలో వి.బి.ఆర్ గార్డెన్స్ నుండి ఎస్.ఎన్. రెడ్డి ఎన్ క్లేవ్ వరకు 2025-26 ఆర్థిక సంవత్సర నిధులు రూ.450.00 లక్షల వ్యయంతో సిసి రోడ్డు నిర్మణానికి - టెండర్లు పిలిచేందుకు అనుమతి ఇచ్చింది. కాప్రా సర్కిల్ వార్డు నం. 2 లో భవాని నగర్ నుండి బావి బజార్ నాలా మీదుగా ఇ.టి.డి.సి నార్త్ కమలా నగర్ నాలా వరకు రూ.395.00 లక్షల వ్యయంతో చేపట్టనున్న 'ఆర్‌సిసి బాక్స్ డ్రెయిన్ నిర్మాణానికి కార్పొరేషన్‌కు సిఫార్సు - పరిపాలన ఆమోదించారు. మల్కాజిగిరి సర్కిల్, డివిజన్ 136లో ఆర్‌కే పురం ఫ్లైఓవర్ కింద స్పోర్ట్స్ జోన్ ఆపరేషన్, నిర్వహణ బాధ్యతలను అనుభవజ్ఞులైన ఏజెన్సీకి అప్పగించేందుకు ఆమోదించారు. మూసాపేటలోని కెపిహెచ్‌బి మల్టీపర్పస్ స్పోర్ట్ కాంప్లెక్స్ లో వివిధ స్పోర్ట్స్ కార్యకాలపాలకు యూజర్ చార్జీలు ఫిక్స్ చేయడం కోసం ఆమోదం కొరకు సమర్పణ. బండ్లగూడ మల్టీపర్పస్ స్పోర్ట్స్ స్టేడియంలో అవుట్‌సోర్సింగ్ విధానంలో ఉద్యోగుల నియామకానికి అనుమతి కోరింది. ఈ సమావేశంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి కర్ణన్, స్టాండింగ్ కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370